సంపుటము–I
సమావేశము–XXX
నంబరు. 3

వెల : రూ. 15–00
08 మార్చి, 2018
గురువారము
హేవళంబి నామ సం.
ఫాల్గుణ బ. 7

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL DEBATES

## అధికార నివేదిక

## OFFICIAL REPORT

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయం | పేజీ నం. |
|---|---|---|
| (1) | ప్రశ్నోత్తరాలు | 01–27 |
| (2) | సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు | 27–27 |
| (3) | 2018–2019 సంవత్సరానికి వార్షిక ఆదాయ–వ్యయ పట్టిక (బడ్జెట్) సమర్పణ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి. నారాయణ సమర్పిస్తారు | 28–28 |
| (4) | 2018–2019 సంవత్సరానికి వ్యవసాయ, అనుబంధ రంగాల (బడ్జెట్) సమర్పణ పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు సమర్పిస్తారు | 28–115 |

# ఆంధ్రప్రదేశ్   శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ ఎన్. ఎం.డి. ఫరూక్ |
| డెప్యూటీ  చైర్మన్ | : | శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం |
| ఉపాధ్యక్షుల  పేర్ల  పట్టిక | : | శ్రీమతి పామిడి శమంతకమణి |
| | | శ్రీ వాకాటి నారాయణ రెడ్డి |
| | | శ్రీ బొడ్డు నాగేశ్వర రావు |
| కార్యదర్శి  (ఇన్‌ఛార్జ్) | : | శ్రీ ఎమ్. విజయరాజు |
| ఉప  కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీ  పి. బాలకృష్ణమాచార్యులు |
| సహాయ  కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి |
| | | శ్రీ కె. రాజకుమార్ |
| | | శ్రీమతి  ఆర్. వనితారాణి |
| | | డా. వై. కామేశ్వరి |
| | | శ్రీ  ఇ.  సంజీవరావు |
| | | శ్రీ  కె. వెంకటేశ్వరరావు |
| | | శ్రీ  డి.  జగన్‌మోహన్‌రావు |
| | | శ్రీ   బి. ప్రభాకరరావు |
| | | శ్రీమతి కె. భారతి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్

గురువారం, 08వ తేది, మార్చి, 2018

----

(సభ ఉదయం 10.00 గంటలకు సమావేశమైనది)

( గౌరవ అధ్యక్షులు అధ్యక్ష స్థానం వహించారు )

**మిస్టర్ చైర్మన్ :** ఇవాళ అంతర్జాతీయ మహిళా దినోత్సవం కాబట్టి మహిళా సోదరీమణులందరికీ శాసన పరిషత్తు తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

<u>1.ప్రశ్నోత్తరాలు</u>

Now Question No.10230 Minister for Tourism.

**కుమారి భూమా అఖిలప్రియ:** అధ్యక్షా, ధన్యవాదాలు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ కూడా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

<u>**పర్యాటక స్థలంగా బాలయోగేశ్వరాలయం**</u>

ప్రశ్న నెం. 10230 (11)

**శ్రీమతి అంగూరి లక్ష్మీ శివ కుమారి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన పర్యాటక శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

**అ)** ముమ్మిడివరం బాలయోగేశ్వర దేవాలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నదా;

**ఆ)** అయితే, ఆ విషయంలో తీసుకున్న చర్యలేమిటి ?

**గౌరవనీయులైన పర్యాటక, తెలుగు భాష మరియు సాంస్కృతిక శాఖా మంత్రి (కుమారి భూమా అఖిలప్రియ ) :**

**అ)** లేదండీ.

**ఆ)** ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీమతి అంగూరి లక్ష్మీ శివకుమారి(శాసనసభా నియోజకవర్గం) :** అధ్యక్షా, మొదటిగా మీకు ధన్యవాదాలు. ఎందుకంటే మహిళా దినోత్సవ శుభ సందర్భంలో మహిళా సభ్యురాలు వేసిన ప్రశ్న చర్చకు రావడం, మహిళా మంత్రిగారే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడమనేది మా అదృష్టంగా భావిస్తున్నాము. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు ప్రతి మహిళకూ చెందాలని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం తరువాత కాకినాడ రెండో పెద్ద పట్టణం. ఆ పట్టణానికి సమీపంలోని ముమ్మడివరం దగ్గర ప్రసిద్ధిగాంచిన బాలయోగేశ్వరస్వామివారి ఆశ్రమం, దేవాలయం ఉంది. బాలయోగేశ్వరస్వామివారు దళిత కుటుంబానికి చెందినటువంటి మహావ్యక్తి. ఆ ఆశ్రమానికి 15 ఎకరాల భూమి కూడా ఉంది. బాలయోగేశ్వరస్వామివారు 45 సంవత్సరాలపాటు తపస్సు చేసిన తరువాత ప్రతి మహాశివరాత్రికి అర్ధరాత్రి 12 గంటలకు బయటకు వచ్చి ప్రజలకు ఆశీస్సులు అందచేస్తారు. ఆ ఆలయానికి కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు రావడం జరుగుతుంది. ఈ ఆలయాన్ని అధికారికంగా ప్రభుత్వం గుర్తించినా, అక్కడ అభివృద్ధి మాత్రం జరగలేదు. కనుక ఆ ఆలయ ప్రతిభను అందరూ తెలుసుకుని అభివృద్ధి చెందడానికి సహకరించాల్సిందిగా మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ పి.రామసుబ్బారెడ్డి:** అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకానికి చాలా అవకాశాలున్నాయి. ముఖ్యంగా జమ్మలమడుగు మండలంలోని గండికోట వ్యూ పాయింట్ నుండి చూస్తే క్రిందిభాగంలో మైలవరం, పైభాగాన గండికోట రిజర్వాయర్లు కనబడుతుంటాయి. వీటి మధ్యలో బ్రహ్మాండమైన లోయ ఒకటి ఉంది. ముఖ్యమంత్రిగారు గండికోట మొత్తం తిరిగి, భద్రతాసిబ్బంది అభ్యంతరం పెట్టినప్పటికీ వ్యూ పాయింట్ వరకూ వచ్చి చూసి ఈ లోయను ప్రపంచ ప్రఖ్యాతిపొందిన అమెరికాలోని Grand Canon అనే ప్రాంతంలాగా అభివృద్ధి చేయడానికి అవకాశముందని కూడా వారు చెప్పడం జరిగింది. ఆ ప్రాంతంలో అభివృద్ధికి చాలా అవకాశముంది. అంతేగాకుండా, పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీళ్లు తీసుకురావడం వల్ల రాయలసీమలో తక్కువ వర్షపాతం నమోదైనా గండికోట, మైలవరం రిజర్వాయర్లలో 6 టి.ఎం.సిల నీళ్ళున్నాయి. ఇటీవలే గండికోట వారోత్సవాలు కూడా జరిపారు. ఈ ప్రాంతానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తున్నారు. కాబట్టి, అక్కడి రిజర్వాయర్‌లో శాశ్వతంగా బోటింగ్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

అధ్యక్షా, గతంలో ఒకసారి ఐటిసి సి.ఇ.ఓగారు గండికోటకు వచ్చి ఆ వ్యాలీని చూసి "ఇండియాలో ఇంత బ్రహ్మాండమైన టూరిజం స్పాట్ ఉందని నేను ఊహించలేదని" వ్యాఖ్యానించారు. ఇప్పుడు అక్కడ మంత్రిగారుకూడా వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకుని అభివృద్ధి చేస్తున్నారు. అక్కడ రోప్‌వే, స్కైవాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, అక్కడ హోటల్స్ లేవు కాబట్టి వాటికి సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారనేది మంత్రిగారు చెప్పాలి. అలాగే అక్కడ రోప్‌వేతోపాటు, మిగతా వ్యాలీ చూడడానికి సస్పెన్షన్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. దానికోసం ఏమేం చర్యలు తీసుకున్నదీ తెలియజేయాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

అదేవిధంగా, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటే నీటి సదుపాయం అవసరమని ఆనాటి రాజులు ఊహించి కోటకు పక్కనే, పెన్నానది ఒడ్డునే మైలవరం, గండికోట రిజర్వాయర్లను నిర్మించారు. కానీ నీళ్ళు చాలా ఎత్తులో ఉండడంవల్ల నీటి సరఫరాకు ఇబ్బంది కలుగుతున్నందున ఒక మంచి నీటి పథకాన్ని కూడా మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నాను.

**డాక్టర్ ఎం.వి.వి.ఎస్ మూర్తి(స్థానిక సంస్థలు – విశాఖపట్టణం):** అధ్యక్షా, ముమ్మిడివరంతో నాకు చాలా ప్రత్యక్షమైనటువంటి సంబంధం ఉంది. అక్కడికి దగ్గర్లోని ప్రాంతంలోనే నేను జన్మించాను. మహాశివరాత్రి వస్తే కోనసీమనుంచే కాకుండా, భారతదేశంలోని అన్ని ప్రాంతాలనుంచి ప్రజలు అక్కడికి వచ్చేవారు. చిన బాలయోగిగారు ఎస్.సి కమ్యూనిటీలో పుట్టినప్పటికీ, ఆరాధ్య దైవంగా మారడంవల్ల మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి కూడా వచ్చి వారిని దర్శించుకునేవారు. శివరాత్రినాడు వైజాగ్ నుంచి మేము ఎంతోమందిని అక్కడికి తీసుకెళ్తూ ఉండేవాళ్ళం. అంత వైభవం కలిగిన ప్రదేశంలో మంచి పార్కును అభివృద్ధి చేసి సద్వినియోగం చేసుకోగలిగితే బాగుంటుంది. కాకినాడ నుంచి పామర్రు వరకూ, నెం.214 జాతీయ రహదారి కూడా తయారవుతోంది కాబట్టి అక్కడ అభివృద్ధి చేస్తే మనకు Golden Goose కింద మారుతుందని మనవి చేస్తున్నాను. కనుక తప్పకుండా దానిమీద దృష్టి పెట్టాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ సోము వీర్రాజు(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, కాకినాడలో పర్యాటకానికి సంబంధించిన ఉత్సవాలు, కోనసీమ ఉత్సవాలు నిర్వహిస్తున్నాము. అలాగే మూడు కోట్ల రూపాయలతో బుడగల పండగను నిర్వహిస్తున్నాము. మా ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించమని గౌరవ సభ్యులు అడిగారు. అన్ని చోట్లా జరిగే ఉత్సవాలకు పది, పన్నెండు కోట్ల రూపాయల వరకూ ఖర్చవుతున్నాయి. పర్యాటకానికి సంబంధించిన ఇతర ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు అవసరమని కోరితే, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి Sri Alphons Joesph Kannanthanam గారు చెప్పిన ఒక స్టేట్మెంట్‌ను ఈమధ్యనే నేను చదవడం జరిగింది. ఇవాళ రాష్ట్రంలో పర్యాటకం గురించి కేరళ కంటే అద్భుతమైన పర్యాటకంగా మలిచే అవకాశాలున్నటువంటి ప్రాంతమైన లంబసింగికి పర్యాటకులు విపరీతంగా వెళ్తున్నారు. కానీ లంబసింగిలో ఎటువంటి మౌలికసదుపాయాలు లేకపోవడంవల్ల, ఆ ప్రాంతంలోని స్థానికులు వేసిన టెంట్లలో పర్యాటకులు సేదదీరి అక్కడి అపురూప దృశ్యాలను చూడడం జరుగుతోంది. లంబసింగి నుంచి కొంతదూరంలో ఉన్నటువంటి జలాశయాన్ని గిరిజన యువకులే నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. అక్కడ కనీస సదుపాయాలు కూడా లేవు కాబట్టి ఆ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

అధ్యక్షా, గౌరవ సభ్యులు గండికోట గురించి, మా జిల్లాలోని ముమ్మిడివరం గురించి చెప్పారు. అసలు పర్యాటకం మీద ఇప్పటివరకూ ఎటువంటి పాలసీ నిర్ణయించలేదు. ఇవాళ రాజమండ్రి, పిచ్చుకలంక ప్రాంతాలకు సంబంధించి టెండర్లు పిలుస్తున్నాము. అయితే, రాష్ట్రంలోని యువకులకు చాలా తక్కువ ఖర్చులో ఎక్కువ ఉపాధి

కల్పించే విషయంలో ప్రాథమికంగా, నిర్మాణాత్మకంగా ఎటువంటి చర్యలు చేపడుతున్నారో తెలియచేయాల్సిందిగా మీద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

కుమారి భూమా అఖిలప్రియ : అధ్యక్షా, మన రాష్ట్ర విభజన జరగకముందు కేవలం హైదరాబాద్, దాని చుట్టుప్రక్కల ప్రాంతాల్లోనే చాలా పెద్ద ఎత్తున పర్యాటకం జరిగేది. కానీ, రాష్ట్ర విభజన జరిగిన తరువాత, మన రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పర్యాటకానికి సంబంధించిన ప్రదేశాలను గుర్తించి, వాటిని బాగా అభివృద్ధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. అదేవిధంగా గుజరాత్ రాష్ట్రం తరువాత మనకు 973 కి.మీల తీరప్రాంతం ఉంది. అలాగే లంబసింగి, దిండి, రాయలసీమలోని దేవాలయాలు, గండికోట వంటి ప్రాంతాలలో ఇంతకు ముందు ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదు.

ఉ.10.10

కాని ఎప్పుడైతే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో అభివృద్ధి అనేది కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకూడదని, అన్ని ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరగాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ప్రతి ఒక్క జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రోగ్రామ్స్ నిర్వహించడం జరుగుతోంది. గౌరవ సభ్యులు ముమ్మిడివరం బాలయోగేశ్వరాలయాన్ని గురించి అడిగారు. ఫండ్స్ లిమిటెడ్‌గా ఉండడంవలన మనకు రాష్ట్రంలో దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలు ఎక్కువగా ఉండడంవలన అన్ని ప్రదేశాల గురించి పర్యవేక్షించడం కష్టమవుతుంది కాబట్టి ప్రతి సంవత్సరం సంబంధిత జిల్లా కలెక్టర్లకు వారి స్థాయిలో అభివృద్ధి చేయమని రూ.3 కోట్లు ఇవ్వడం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం నుండి 'ప్రసాద్' పథకంద్వారా శ్రీశైలం, అమరావతివంటి ప్రాంతాలకు ఫండ్స్ ఇవ్వడం జరిగింది. శ్రీశైలానికి దాదాపు రూ.50 కోట్లు, అమరావతికి రూ.27 కోట్లు ఇవ్వడం జరిగింది. వీటికి యు.సి.లు సిద్ధం చేసి పంపించడం జరుగుతోంది. దేవాలయాల చుట్టూ ఉన్న ప్రాంతాలలో ఏమైనా సౌకర్యాలు కల్పించగలుగుతాము కాని, దేవాలయాలు అభివృద్ధి చేయడానికి మాకు అనుమతులు లేవు. ఫండ్స్ కూడా లిమిటెడ్‌గా ఉండడం వలన రోడ్లు, ప్లాంటేషన్, వాటర్, టాయిలెట్స్‌వంటి సౌకర్యాలను జిల్లా టూరిజం శాఖద్వారా కల్పించేందుకు కలెక్టర్లకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది.

అదేవిధంగా గౌరవసభ్యులు గండికోట గురించి చెప్పడం జరిగింది. రాయలసీమలో పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నాయి, వాటన్నింటిని డెవలప్ చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రిగారు చాలా సందర్భాలలో మాకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. గండికోటకు గతంలో ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. కాని, ఈ ప్రభుత్వం వచ్చిన తరవాత ఒక మాస్టర్ ప్లాన్ తయారు చేసి టెండర్లు పిలిచి పనులు అప్పగించడం జరిగింది. రూ.7 కోట్లతో గండికోటకు రోప్‌వే నిర్మించడం జరుగుతోంది. గండికోటకు వెళితే అక్కడ ఉండేందుకు సరైన సౌకర్యాలు లేవని ముఖ్యమంత్రిగారి

దృష్టికి తీసుకువెళితే ముఖ్యమంత్రిగారు వెంటనే స్పందించారు. పిపిపి మోడల్‌లో అక్కడ Luxury Camping Tents నిర్మించటం జరుగుతుంది. అదేవిధంగా రూ.3 కోట్లతో అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడెమీని పెట్టడం జరుగుతోంది. వాటర్ స్పోర్ట్స్ కోసం పిపిపి మోడల్ క్రింద టెండర్లు పిలిచి, మిగతా యాక్టివిటీస్‌ను కూడా డెవలప్ చేయడం జరుగుతుంది.

అదేవిధంగా గౌరవ సభ్యులు శ్రీ సోము వీర్రాజుగారు లంబసింగి ప్రాంతం గురించి అడగడం జరిగింది. లంబసింగి ప్రాంతం చాలా డెవలప్ అవుతోంది. చాలమంది పర్యాటకులు వస్తున్నారు. మాకు కొన్ని ఆంక్షలు ఉండడం వలన పిపిపి మోడల్‌లో చేయలేకపోతున్నాము. కాని ప్రభుత్వం తరఫున నిధులు ఖర్చుపెట్టి ఏదైనా చేయడానికి ప్రయత్నిస్తున్నాము. పర్యాటక రంగం చాలా బాగా అభివృద్ధి చెందింది. రాబోయే రోజులలో కూడా పర్యాటక ప్రదేశాలన్నింటిలో కావాల్సిన ప్రాథమిక సౌకర్యాలు మేము కల్పించడం జరుగుతుంది.

**MR.CHAIRMAN:** Question No.**10348;**

## వెనుకబడిన జిల్లాలకు నిధులు

ప్రశ్న నెం.10348(19)

**డా. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, సర్వశ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్, గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు,**

గౌరవనీయులైన ఆర్థిక శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** 2017-18 ఆర్థిక సంవత్సర కాలానికి రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ఏవైనా నిధులు కేటాయించిందా;

**ఆ)** అయితే, 2014-15 మరియు 2015-16 కాలానికి జిల్లాల వారీగా వ్యయం మరియు కేటాయించిన నిధులు వివరాలేమిటి?

**గౌరవనీయులైన ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన సభా వ్యవహారాలు శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు):**

**అ)** లేదండీ.

**ఆ)** 06-03-2018 నాటికి 2014-15 మరియు 2015-16 కాలానికి జిల్లా వారీగా ఖర్చు చేసిన వ్యయం, కేటాయించిన నిధులు వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

| వరుస సంఖ్య | జిల్లా | 2014-15 | | 2015-16 | |
|---|---|---|---|---|---|
| | | విడుదల చేసిన నిధులు | చేసిన వ్యయం | విడుదల చేసిన నిధులు | చేసిన వ్యయం |
| 1 | శ్రీకాకుళం | 50.00 | 44.38 | 50.00 | 43.58 |
| 2 | విజయనగరం | 50.00 | 27.82 | 50.00 | 41.07 |
| 3 | విశాఖపట్నం | 50.00 | 46.48 | 50.00 | 44.98 |
| 4 | చిత్తూరు | 50.00 | 39.20 | 50.00 | 70.92 |
| 5 | వై.ఎస్.ఆర్. కడప | 50.00 | 21.17 | 50.00 | 30.00 |
| 6 | అనంతపురం | 50.00 | 35.20 | 50.00 | 40.55 |
| 7 | కర్నూలు | 50.00 | 48.69 | 50.00 | 43.01 |
| | **మొత్తం** | **350.00** | **262.94** | **350.00** | **314.11** |

2014-15వ సంవత్సరానికి వెనుకబడిన జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలకు రిలీజ్ చేసిన ఫండ్స్ రూ.350కోట్లు, ఖర్చుచేసినది 262.94 కోట్లు. 2015-16వ సంవత్సరంలో రూ.350 కోట్లు రిలీజ్ చేస్తే, రూ.314.11 కోట్లు ఖర్చుచేయడం జరిగింది. 2016-17వ సంవత్సరలో రూ.350 కోట్లు రిలీజ్ చేస్తే ఖర్చు చేసింది రూ.307.48 కోట్లు, 2017-18 ఫండ్స్ రిలీజ్ చేసింది శూన్యం, ఖర్చుచేసింది రూ.69.97 కోట్లు. మొత్తం ఇప్పటికి వెనుకబడిన జిల్లాలకు మనకు వచ్చింది రూ.1050 కోట్లు, ఖర్చుచేసింది రూ.954.50 కోట్లు. అంటే దాదాపు 91% ఖర్చుచేయడం జరిగింది.

**శ్రీమతి పోతుల సునీత:** కడప వెనుకబడిన జిల్లా. ఆ జిల్లాకు నిధులు కేటాయించి న్యాయం చేయాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

SRI Y. RAMAKRISHNUDU: This is relating to Backward Districts Sir. The amount was released by the Government of India on the basis of the AP Reorganisation Act. ఏడు జిల్లాలకు ఒక్కొక్క జిల్లాకు రూ.50 కోట్లు ఇచ్చారు. ఖర్చుల వివరాలు చెప్పాను. దాదాపు వందశాతం యు.సి.లు కూడా సబ్మిట్ చేయడం జరిగింది. కడప జిల్లాకు సంబంధించినంత వరకూ 2014-15వ సంవత్సరంలో రూ.50 కోట్లు ఇచ్చారు. అదేవిధంగా రూ.21.17 కోట్లు వరకూ ఖర్చయ్యింది. 2015-16వ సంవత్సరంలో కూడా రూ.50

కోట్లు ఇచ్చారు. ఇవన్నీ కూడా కలెక్టర్స్‌కు రిలీజ్ చేశాము. ఖర్చు రూ.30కోట్లు అయ్యింది. 2016-17వ సంవత్సరంలో కడప జిల్లాకు రూ.50 కోట్లు ఇచ్చారు, అదేవిధంగా ఖర్చు రూ.75.59 కోట్లు అయ్యింది. 2017-18వ సంవత్సరంలో మొత్తం రాష్ట్రానికి ఇంకా నిధులేమీ ఇవ్వలేదు. అదేవిధంగా మన రాష్ట్రానికి రూ.350 కోట్లు రిలీజ్ చేశారు కాని క్లియరెన్స్ లేక అమౌంట్ వెనక్కి తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోయినా సరే రూ.10.54 కోట్ల వరకూ అడ్వాన్స్‌గా ఇచ్చాము. మొత్తం కడప జిల్లాకు మొత్తం **expenditure incurred so far is Rs.137.30 Crores.** వెనుకబడిన ప్రాంతాలకు సంబంధించి రీఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం కేంద్రప్రభుత్వం ఇచ్చిన నిధులను ఈ జిల్లాలకు ఖర్చుపెడుతున్నాము.

**ఉ.10.20**

## <u>చంద్రన్న విలేజ్ మాల్స్</u>

ప్రశ్న నెం.10032(12)

**సర్వశ్రీ కరణం బలరామకృష్ణ మూర్తి, గుండుమల తిప్పేస్వామి, ఎం.ఎల్.సి.లు,**

గౌరవనీయులైన పౌర సరఫరాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) చంద్రన్న విలేజ్ మాల్స్ విధివిధానాల వివరాలు ఏమిటి;

ఆ) చంద్రన్న విలేజ్ మాల్స్ ద్వారా వినియోగదారులకు ఉత్తమ సౌకర్యాలను అందించడానికి తీసుకున్న చర్యలు ఏమిటి?

**గౌరవనీయులైన పౌర సరఫరాల శాఖ మంత్రి (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు):**

అ) చౌకధరల దుకాణం (ఎఫ్‌పిఎస్) డీలర్లకు అదనపు ఆదాయ వనరును సృష్టించడం మరియు వినియోగదారులకు వారికి సమీపంలోనే తక్కువ ధరలో నాణ్యమైన, బాగా చలామణిలో ఉన్న బ్రాండెడ్ వినియోగ వస్తువులను సమకూర్చాలనే రెండు లక్ష్యాలను సాధించే దిశగా రాష్ట్రంలో చంద్రన్న మాల్స్‌ను అమలు చేయడమయింది.

**విధివిధానాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:**

1. మొత్తం 13 జిల్లాలలో దశల వారీగా చౌకధరల దుకాణాలను విలేజ్ మాల్స్‌గా (మినీ-సూపర్ మార్కెట్‌లు) స్థాయిని పెంచడం. మొదటి దశలో 6,500 చౌకధరల దుకాణాలను విలేజ్ మాల్స్‌గా స్థాయిని పెంచడమవుతుంది.

2. సరఫరాదారుల నిర్వాహణా వ్యయాన్ని తొలగించడమయింది. ఫలితంగా వచ్చిన పొదుపును 40:60 దామాషాలో డీలర్లకు మరియు వినియోగదారులకు ఇవ్వడమవుతుంది.

3. విలేజ్ మాల్స్‌లో ఉత్పత్తులను గరిష్ట చిల్లర ధర (ఎం.ఆర్.పి) కంటే 4 శాతం నుండి 35 శాతం తక్కువ ధరలను వినియోగదారులకు అందుబాటులో ఉంచడమవుతుంది.

4. చౌకధరల దుకాణం కనీస విస్తీర్ణం 30 అడుగుల రోడ్డు నుండి 200 చదరపు అడుగులు, గరిష్టంగా 100 మీటర్లుగా ఉంటుంది.

5. ప్రారంభంలో మొదటి దశలో పట్టణ మరియు సెమీఅర్బన్ దుకాణాలకు ప్రణాళిక రూపొందించడమయింది.

6. చౌకధరల దుకాణం డీలర్లు పాల్గొనడం అనేది స్వచ్ఛందంగా ఉంటుది.

7. సరఫరాదారులతో కనీసం 3 సంవత్సరాలకు అనుసంధానం ఉంటుంది, దీనిని పొడిగించవచ్చును.

8. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ, విలేజ్ మాల్స్‌ను అమలు చేస్తున్నది. అందులో ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌సిఎస్‌సిఎల్) సంధాన కర్తగా వ్యవహరిస్తుంది.

ఆ) సరఫరాదారు నుండి ఆర్థిక సహాయం అందించడం ద్వారా మౌలిక సౌకర్యాల సదుపాయాలను కొనసాగించడమవుతున్నది.

1. ఉత్పత్తులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ/ఆగ్‌మార్క్/బిఐఎస్‌ల నాణ్యత ధృవీకరణ పత్రాలు ఉండే విధంగా చూడాలి.

2. ఉత్పత్తుల రకం ఆధారంగా ధరలను నియతకాలికంగా (నెలవారీగా/త్రైమాసికం వారీగా) సమీక్షించడమవుతున్నది.

3. నకిలీ వస్తువులు తొలగించడానికి సరఫరా/బట్వాడా సమయంలో తనిఖీతోపాటు నాణ్యత ధృ వీకరణ పత్రాలను జోడించడమవుతుంది.

4. వినియోగదారునికి ఐచ్ఛికాన్ని పెంచడం కోసం దాదాపు 500కు పైగా వస్తువులను అందుబాటులో ఉంచడమయింది.

5. వస్తువులను ఆన్‌లైన్‌లో ఆర్డరు చేయడం మరియు ట్రాకింగ్ కోసం ఇ-కియోస్కులను ఏర్పాటు చేయడమవుతున్నది.

**శ్రీ కరణం బలరామకృష్ణ మూర్తి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, మంత్రిగారు చెప్పిన సమాధానంలో 200 చ.అ విలేజ్ మాల్స్‌ని అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పారు. ఇప్పుడు దానికి స్థలం ఎవరు ఇస్తున్నారు? లేకపోతే మీ సొంతంగా చేస్తున్నారా? ఉన్న వాళ్లకే మీరు సహాయం చేసి మాల్స్ పెట్టిస్తున్నారా అనేది క్లారిఫై చేయాల్సి ఉంది. దీనితోపాటు 13 జిల్లాలలో 6500 వరకు విలేజ్ మాల్స్ ఏర్పాటు చేయాలనే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇప్పటికి ఎన్ని స్టార్ట్ చేశారు? దానిలో వస్తున్న ప్రభుత్వ ఫీడ్‌బ్యాక్ ఏమిటనేది కొంత క్లారిటీ ఇస్తే బాగుంటుంది.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం(ఉపాధ్యాయ నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు) :** అధ్యక్షా, మంత్రిగారు చాలా స్పష్టంగా బ్రాండెడ్ వస్తువుల్ని, వినియోగ వస్తువుల్ని సమకూర్చడమనేది మాకు ఉన్న రెండు లక్ష్యాలలో ప్రధాన లక్ష్యమని చెప్పారు. మొత్తం మీద దేశంలో గానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గాని స్థానికంగా ఉన్న ఉత్పత్తులను స్థానికంగా ఉన్న వినియోగదారులకు స్థానికంగా ఉన్న వ్యాపారులు అమ్మడం జరుగుతోంది. అది పెద్ద ఉపాధిని కల్పిస్తోంది. తక్కువ రేట్లకు కూడా వారికి అందుబాటులోకి వస్తున్నాయి. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 6500 చౌకధరల దుకాణాల ద్వారా వీటన్నింటిని సెంట్రలైజ్ చేసి, పెద్ద పెద్ద కంపెనీలు తయారుచేసే లేదా వాళ్లు సమీకరించుకున్న బ్రాండెడ్ వస్తువుల్ని అమ్మడానికి ఏర్పాటు చేయడం కింద ఇది మారదా? దీనివల్ల స్థానిక వినియోగదారులకే కాకుండా, స్థానిక వ్యాపారులకు కూడా తీవ్రమైన నష్టం జరగదా అనేది మా అనుమానం. దీనిపై కూడా స్పష్టత ఇవ్వాలని మేము కోరుతున్నాము.

**శ్రీ కత్తి నరసింహా రెడ్డి(ఉపాధ్యాయ నియోజకవర్గం – కర్నూలు, అనంతపురం, కడప):** అధ్యక్షా, రిలయన్స్‌కు, ఫ్యూచర్ గ్రూపులకు ఈ మాల్స్‌ని ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చారు. వాళ్లు మామూలుగా ఫుడ్ ఐటమ్స్ పైన 40 నుంచి 50 శాతం ధరలు తక్కువ గాను, నాన్ ఫుడ్ ఐటమ్స్ పైన 20శాతం ధరలు తక్కువగా అమ్ముతారని ప్రభుత్వం ప్రకటన చేసింది. అంటే వాళ్లు ఏమీ లాభాపేక్ష లేకుండా ఈ మాల్స్‌ను ఏర్పాటు చేస్తారా? వారు ఆ ఐటమ్స్‌ని స్థానికంగా ఉండే చిన్న, సన్నకారు రైతుల నుండి, చిన్న చిన్న షాపుల వాళ్ల నుండి సేకరించి ఈ మాల్సులో అమ్ముతారా? లేదా ఎక్కడో బయటి నుండి తీసుకువచ్చి అమ్ముతారా? అలా జరిగితే స్థానికంగా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతుంది. అలా జరగకుండా జాగ్రత్త తీసుకోవాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ గుండుమల తిప్పేస్వామి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, ప్రజలకు ఉపయోగపడేవిధంగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి గారి ఆధ్వర్యంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా ప్రత్తిపాటి పుల్లారావు గారు చంద్రన్న విలేజ్ మాల్స్‌ని తీసుకురావడం చాలా అభినందించదగ్గ విషయం. ఈ సందర్భంలో మీ ద్వారా మంత్రిగారికి తెలియజేసేదేమంటే, చౌకధరల దుకాణాలను చంద్రన్న విలేజ్ మాల్స్‌లా మారుస్తున్నారు. చాలా చౌకధరల దుకాణాలు బినామీల పేరు మీద నడపబడుతున్నాయి. చాలా చౌకధరల దుకాణాలలో డీలర్ ఎక్కడ ఉంటాడో తెలియదు. ఎవరో 'X', 'Y', 'Z'లు తీసుకుని అనేక అక్రమాలకు, అవకతవకలకు పాల్పడుతున్నారు. ఈ సందర్భంలో అనేకమార్లు

సంబంధిత తహాశీల్దారులకు గానీ, ఆర్డీవోలకు గానీ ఫిర్యాదు చేస్తే వాళ్లు కోమట్లకు భయపడుతున్నారు. గతంలో హైదరాబాదులో అతని పేరు సభలో చెప్పకూడదు అధ్యక్షా, ఆర్డీవోలను, తహాశీల్దారులను పిలిపించి, ఎఫ్‌పి షాపులనుండి సస్పెన్షన్ చేస్తే, నిన్ను ఉద్యోగంలో నుంచి తీసేస్తామని బెదిరిస్తే అధికారులంతా భయపడి వాళ్లు ఏవిధమైన అక్రమాలు, అన్యాయాలు జరిగినా పట్టించుకోకుండా ఉన్నారు. చాలా ఘోరాతి ఘోరంగా మోసం జరుగుతోంది. ఈ సందర్భంలో మీ ద్వారా మంత్రిగారికి విన్నవించేదేమంటే, దయచేసి ఇప్పుడు ఎలాగో బయోమెట్రిక్ వచ్చింది. ఎవరైతే ఎఫ్‌పి షాపు డీలర్ తంబింగ్ వేయకుండా ఒకటి నుండి మూడునెలలు ఉంటారో వారిని ఖచ్చితంగా తొలగించేలా చర్యలు తీసుకోండి. రెండోది టెంపరరీ డీలర్స్ ఎవరైతే ఉన్నారో వారిని పర్మినెంట్ ప్లేసెస్‌కి అపాయింట్ చేయడం ద్వారా, ముఖ్యమంత్రిగారు తీసుకువచ్చిన ఈ సరకులు వారికి అందడానికి అవకాశం ఉంటుంది. కర్ణాటక బోర్డర్‌లో ఉన్న మా ప్రాంతంలో చాలా అన్యాయాలు, అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయి. వెంటనే మంత్రిగారు జోక్యం చేసుకుని ఈ అక్రమాల్ని, అవకతవకల్ని అరికట్టాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు:** అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ కరణం బలరామకృష్ణ మూర్తి గారు 200 చదరపు అడుగులు ఇస్తున్నారా అని అడుగుతున్నారు, ఎక్కడికక్కడ డీలర్‌కి ఉన్న ఫెసిలిటీనే మనం విలేజ్ మాల్స్‌గా కన్వర్ట్ చేస్తున్నాము. దానికి కావాల్సిన ఫైనాన్స్‌ని 'ముద్ర' పథకం ద్వారా మరియు రిలయన్స్ వారు ఏర్పాటు చేస్తున్నారు. ఆ విధంగా ఓన్‌గా డీలర్లు అరేంజ్ చేసుకోవడం తప్ప ప్రభుత్వం ప్రత్యేకంగా స్థలాలు చూపించడం, షాపులు చూపించడం లేదు.

అదేవిధంగా సభ్యులు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు ఇతర బ్రాండ్స్ గురించి, రిలయన్స్ బ్రాండ్స్ గురించి మాట్లాడడం జరిగింది. అన్ని రకాల బ్రాండ్స్ అంటే మార్కెట్‌లో 500 రకాల బ్రాండ్స్ ఉన్నాయి. కేవలం రిలయన్స్ బ్రాండ్సే కాదు, మార్కెట్‌లో ఉన్న అన్ని బ్రాండ్స్ ఉంటాయి. ఉదాహరణకు విజయవాడలో రిలయన్స్‌లో ఉండే బ్రాండ్స్ కన్నా, ఈ చంద్రన్న విలేజ్ మాల్‌లో తక్కువ ధరలు ఉండే విధంగా కండిషన్స్ పెట్టడం జరిగింది. దానిలో 4శాతం నుంచి 35 శాతం వరకు డిస్కౌంట్ ఉంటుంది. గిరిజన సహకార సంస్థ వాళ్లు చేసే బ్రాండ్ ఐటమ్స్‌ని కూడా ఏర్పాటు చేస్తున్నాము. అన్ని రకాల బ్రాండ్ ఐటమ్స్ ఉంటాయి. ప్రత్యేకించి రిలయన్స్, ఫ్యూచర్‌కు మాత్రమే పరిమితం కాదు.

అదేవిధంగా సభ్యులు శ్రీ కత్తి నరసింహా రెడ్డిగారు కూడా అదే చెప్పారు. అన్ని బ్రాండ్స్ ఉంటాయి. ఎప్పటికప్పుడు మార్కెట్ పర్యవేక్షణ చేస్తున్నారు. బయట మార్కెట్ కన్నా తక్కువ ఉండాలి. ఖచ్చితంగా కొనుక్కోవాలని కాదు, తక్కువుంటేనే వినియోగదారుడు కొనుక్కునే అవకాశం ఏర్పాటు చేయడం జరిగింది. దీనివలన వినియోగదారుడు బెనిఫిట్ పొందాలి, క్వాలిటీ రావాలి, దానితోపాటు ధర తక్కువ ఉండాలి. డీలర్‌కు కూడా ఆదాయం పెరగాలి. ఇదే చంద్రన్న విలేజ్ మాల్. వినియోగదారుడు ఏదీ ఖచ్చితంగా తీసుకోవాల్సిన అవసరం లేదు. బయట అన్ని మార్కెట్‌లకు

వెళ్లి వచ్చిన తరువాత, ఈ మాల్స్‌లో క్వాలిటీ బెస్ట్‌గా ఉండి, రేటు తక్కువ ఉంటేనే వినియోగదారుడు ఇక్కడ కొనుక్కునే అవకాశం ఉంటుంది.

**ఉ. 10.30**

అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ జి. తిప్పేస్వామి మాట్లాడుతూ డీలరు పేరు ఒకరిది ఉంటుంది, కానీ వేరే వాళ్ళు అక్కడ పనిచేస్తున్నారు. ఇది చాలాచోట్ల ఉంది. దానికోసమే ఇప్పుడు బ్లడ్ రిలేషన్ అనేటటువంటిది కూడా ఇంప్లిమెంట్ చేస్తున్నాము. ఎందుకంటే, ఏ డీలర్ పేరు మీద అయితే షాపు ఉంటుందో, ఆ బ్లడ్ రిలేషన్ వాళ్ళు మాత్రమే ఆపరేట్ చేయాలనేటటువంటిది వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాము. ఖాళీలను కూడా భర్తీ చేస్తున్నాము. ఇక రెండవ విషయం ఏమిటంటే సమయాభావం పాటించనటువంటి వారిపైన కూడా తగిన చర్యలు తీసుకుంటున్నాము. వాటికి సంబంధించి ప్రభుత్వం కూడా ఒక జీవోను విడుదల చేయడం జరిగింది. ఒకరోజు షాపు తీయకపోతే రూ.1,000లు, రెండు రోజుల పాటు సమయాభావం పాటించకపోతే రూ.1500లు, మూడు రోజుల పాటు సమయాభావాలు పాటించకపోతే రూ.2,000లు జరిమానా విధించడమే కాకుండా, ఆ పైన సస్పెన్షన్ కూడా పెట్టాము. కనుక గౌరవ సభ్యులు చెప్పినటువంటి అంశాల పైన కూడా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

<u>పశువుల అక్రమ రవాణా</u>

ప్రశ్న నెం.10068 (13)

**శ్రీ ద్వారపురెడ్డి జగదీశ్వర రావు, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య పరిశ్రమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** విజయనగరం జిల్లాలో పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న విషయం వాస్తవమేనా;

**ఆ)** అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

**గౌరవనీయులైన మార్కెటింగ్, గిడ్డంగులు, పశుసంవర్ధకం, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ సిహెచ్. ఆదినారాయణ రెడ్డి):**

**అ)** ప్రస్తుతం, విజయనగరం జిల్లా అలమంద, పార్వతీపురం మరియు మనపురం సంతల నుండి పశువుల అక్రమ రవాణా లేదా లోడింగ్ జరగడం లేదు.

**ఆ)** అక్రమ రవాణాను అరికట్టేందుకు రవాణా, పోలీసు మరియు పశుసంవర్ధక శాఖలతో కూడిన ప్రత్యేక బృందాలను రూపొందించడమయింది.

అధ్యక్షా, గతంలో విజయనగరం జిల్లాలో ఈ పశువుల అక్రమ రవాణా కొంతవరకు జరిగిన మాట వాస్తవమే. దానికి ప్రభుత్వం స్పందించి 01-10-2015 నాడు జీవో నెం.23 ద్వారా 8 మంది సభ్యులతో కమిటీగా వేసి, అందులో స్థానిక చైర్మన్, సర్పంచ్, తహశీల్దారు, స్టేషన్ హౌస్ ఆఫీసరు, వెటర్నరీ డిపార్టుమెంటు అధికారి మరియు కలెక్టరు నామినేట్ చేసిన అధికారి, స్టేట్ నియంత్రణ కమిటీ నుండి ఒకరిని వేసి వాటిని నియంత్రణ కూడా చేయడం జరిగింది. దానికి సంబంధించి రకరకాలుగా పశువులను రవాణా చేసిన వారికి 2015-16లో దాదాపు 1700 మందికి రూ.35లక్షలు జరిమానా కూడా వేయడం జరిగింది. 2016-17లో 1061 మందికి రూ.21 లక్షలు, 2017-18లో 792 మందికి రూ.15లక్షల వరకు జరిమానా కూడా వేయడం జరిగింది. ఇప్పుడు వీటిని నియంత్రించడం కోసం టోల్‌ఫ్రీ నెం.100ను తయారు చేసి, ఆ నెంబరుకు ఎవరు ఫోన్ చేసి ఫిర్యాదులు చేసినా కూడా వెహికల్ ఇన్‌స్పెక్టరు గానీ, లోడ్ చేసినప్పుడు లేదా అన్‌లోడ్ చేసినప్పుడు అయినా లేదా పోలీసు అధికారులు, మా వెటర్నరీ డిపార్టుమెంటు అధికారులు, లేక కమిటీలోని సభ్యులు ఆ వాహనాలపై అటాక్ చేసి, వెంటనే వాటిని నియంత్రణ చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇంకా ఏమైనా ఫిర్యాదులు వస్తే నాకు చెప్పినా కూడా వెంటనే వాటిని నియంత్రణ చేసే దానికి సంబంధిత జిల్లా కలెక్టర్లకు వెంటనే చెప్పి తక్షణమే చర్యలు తీసుకోమని చెప్పడానికి ఆస్కారం ఉంటుంది.

**శ్రీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు(స్థానిక సంస్థలు – విజయనగరం):** అధ్యక్షా, సమస్య అయితే ఎంత తీవ్రతరంగా ఉందో దానిని గౌరవ మంత్రివర్యులే చెప్పడం జరిగింది. విజయనగరం జిల్లాలో ప్రజలే పలు ఇబ్బందులు పడుతున్నారు. వాటన్నింటిని కూడా సత్వరమే పరిష్కారించాలని కోరుతున్నాను. ఒడిశా నుండి క్యాచ్‌మెంట్లలో పశువుల సంతలకు (Shandys) వచ్చి ఇక్కడ మార్కెట్ కమిటీలో ఉన్న సంతలలో పశువులను పెట్టి అమ్మడం, వాటినేమో కొన్ని లారీల మీద, మరికొన్ని రహదారిమీద అలా వెళుతూ ఉంటాయి. తద్వారా ట్రాఫిక్ సమస్యలు మరియు అనేక రకాలు జబ్బులకు కూడా ఆస్కారం ఏర్పడుతోంది. ఇవన్నీ చాలా తీవ్రంగా ఉంటున్నాయి. ఇందుకు సంబంధించి చర్యలు అయితే తీసుకోవడం లేదని అనడం లేదు కానీ, ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటోంది. అయితే, ఇది ఒక మాఫియా. ఒక వారం రోజుల పాటు ప్రభావవంతంగా పనిచేసినా, తదుపరి అక్రమార్కులు విజృంభిస్తున్నారు. కాబట్టి, దీనిని మరింత ఫలవంతంగా అమలుచేస్తే గానీ ఆయా జిల్లాలలో సమస్యలు తీరవని ఈ సందర్భంగా తమ ద్వారా గౌరవ మంత్రివర్యులకు విన్నవిస్తున్నాను.

**శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, ముందుగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈరోజు గౌరవనీయులు శ్రీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావుగారు అడిగినట్లుగానే గౌరవ మంత్రిగారు వాటిని నియంత్రణ చేశామని చెపుతున్నారు. ఈ వాహనాలు బుధవారం ఒడిశా నుండి ప్రారంభమవుతాయి. అంటే, ఆ రహదారి మొత్తం పూర్తిగా ఎక్కడా ఖాళీ ఉండదు. మామూలుగా ఎవరైనా అధికారులను పంపించి చూపించినా ఏదో ఒక నిమిషమో, అర నిముషమో అరగంటో, గంటో రవాణా కాదు అధ్యక్షా అది. బుధవారం

ఒడిశా నుండి ప్రారంభమై మా నియోజకవర్గం సాలూరు మీదుగా లక్ష్మివారం ఒక సంత, శుక్రవారం ఒక సంత, శని, ఆదివారాలు వరుసగా సంతలు జరుగుతూ ఉంటాయి. రహదారుల వెంట వాహనాలు అలా ప్రయాణం చేస్తూనే ఉంటాయి. అవి కనీసం 10, 20 కాదు, వందలు, వేలల్లో వాహనాలు వెళుతూ ఉంటాయి. దయచేసి ఆ సమస్యను సీరియస్‌గా తీసుకోమని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. ఎందుకంటే, మన తరువాత తరం వారు పశువులు ఉన్నాయట, అవి ఎలా ఉంటాయో అనే మాటలకు మనం వచ్చే పరిస్థితిలో ఉన్నాము. మా జిల్లాలో మేము ఎప్పుడూ చూస్తూ ఉంటాము. కారు వెళ్ళేందుకు కూడా కొంచెం స్థలం ఉండదు. కాబట్టి, ఈ సమస్యలను ప్రభుత్వం కొంచెం సీరియస్‌గా తీసుకుని తక్షణమే తగిన చర్యలు తీసుకోవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు(నామినేటెడ్):** అధ్యక్షా, ఈ పశువుల అక్రమ రవాణా అనేది చాలాచోట్ల జరుగుతోంది. చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గం నుండి మరొక వైపు తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ఉంటాయి కాబట్టి ఇక్కడ చాలా చోట్ల లారీలలో పశువులను తరలించడం, నేరుగా బండికి కట్టి తోలుకుపోవడం జరుగుతోంది. దీనికి సంబంధించి కొన్ని నియంత్రణ చర్యలు తీసుకున్నామని మంత్రిగారు చెప్పారు. వాటిని కూడా ఈ బ్రోకర్లు ఏమి చేస్తున్నారంటే మామూలు పశువులను పాల కోసమని అమ్మడానికి తీసుకువెళుతున్నామని రకరకాలుగా దొంగ సర్టిఫికేట్లు పెట్టి తీసుకుపోయే ప్రమాదం ఉంటోంది. వాళ్ళు పోలీసుల కన్ను కూడా కప్పుతున్నారు. వీటిపైన ప్రత్యేకమైన నిఘా వేయాలని సరిహద్దు ప్రాంతాలలో ఇటువంటి అక్రమ రవాణా చర్యలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ రాము సూర్యారావు(ఉపాధ్యాయ నియోజకవర్గం– తూర్పు, పశ్చిమ గోదావరి)**: అధ్యక్షా, పశువుల అక్రమ రవాణాలను తరలించకుండా ఆపడం వలన అటు వాటి మీద హింస ఎక్కువ అవుతోంది. నల్లజర్ల, దేవరపల్లి మొదలైన ప్రాంతాలలో పశువులను ఆపేసి, వాళ్ళ దగ్గరే పశువులను పెట్టి అవి చనిపోయే దాకా కూడా వాటిని పట్టించుకోలేదు. వాటికి సంబంధించిన చర్యలు చాలా పకడ్బందీగా చేయాలి. లేకపోతే ఆ పశువులను వెళ్ళనిస్తే, వాటి పని అవే చేసుకుంటాయి. గౌరవ సభ్యులు చెప్పిన అంశాలను కూడా దృష్టిలో పెట్టుకుని మంత్రిగారు మరింత ప్రభావవంతంగా పనిచేయాలని కోరుతున్నాను. లేకపోతే ఊరుకోవాలనుకుంటే మంచిదని తమ ద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

**శ్రీ సిహెచ్.ఆదినారాయణ రెడ్డి:** అధ్యక్షా, వీటికి సంబంధించి ఊరుకోవడమనేది అసాధ్యంగా ఉంటుంది. అక్రమ రవాణాకు సంబంధించి చర్యలు అయితే జరుగుతున్నాయి. గౌరవ సభ్యులు చెప్పిన అంశాలనన్నింటిని నేను వ్రాసుకున్నాను. మా శాఖకు సంబంధించిన అధికారులకు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోమని చెపుతాను. సభ్యులు శ్రీ గౌనివారి శ్రీనివాసులు చెప్పినట్లుగా కుప్పంలో జరిగే పశువుల సంత పూర్వకాలం నుంచి జరుగుతున్నదే. పశువుల అమ్మకం అంటే కొనేవాళ్ళ కోసం రకరకాలుగా మూగ జీవాలు వాటిల్లో గొర్రెలు, మేకలు మొదలైనవి అమ్మేది

కూడా అక్కడే. అది కాకుండా అక్రమంగా బయట రాష్ట్రాలకు వెళ్ళే దానికోసం ఆపడానికైతే మేము జీవో.నెం.23ని 2015లో వాటిని నియంత్రించడానికి ఇవ్వడం జరిగింది. ఇటువంటి అంశాలు ఏవైనా ఉంటే కేవలం ప్రభుత్వమే కాకుండా సభ్యులు కూడా చొరవ చూపి టోల్‌ఫ్రీ నెంబర్లకు చెప్పడం, సంబంధిత జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్ళడం ద్వారా స్పాట్‌లో వాటిని నియంత్రించడానికి మరియు వారిని మందలించడానికి కూడా ఆస్కారం ఉంటుంది. తద్వారా అక్రమాన్ని నివారించడానికి అవకాశం ఉంటుంది. ఇది అందరికీ సంబంధించిన అంశమే. దీనికి అందరూ కలిసికట్టుగా ప్రయత్నిస్తే వీటి నియంత్రణ జరగాల్సిన విషయం వాస్తవమే. నంద్యాలలో కూడా ఇటువంటివి జరుగుతున్నాయి, ఇవి కరెక్టే. కానీ, వీటన్నింటిని ఆపడానికి ప్రభుత్వంతోపాటు అందరు సభ్యులు కలిసికట్టుగా తగిన చర్యలు తీసుకుంటే ఈ అక్రమాన్ని నివారించవచ్చని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

**MR. CHAIRMAN:** Question No. 10325(s) postponed. ఆరోగ్య శాఖామాత్యులు లేరండీ. తదుపరి ప్రశ్న 10083.

## <u>వ్యవసాయోత్పత్తులకు ఇంక్యుబేషన్ సెంటర్లు</u>

ప్రశ్న నెం.10083 (15)

**డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి, శ్రీ వట్టికూటి వీర వెంకన్న చౌదరి, ఎం.ఎల్.సి.లు.,**

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

**అ)** వ్యవసాయ పట్టభద్రులు విలువ జోడింపు వ్యవసాయ ఉత్పత్తులను ప్రారంభించేందుకు మొగ్గు చూపిన విషయం వాస్తవమేనా;

**ఆ)** అయితే, ప్రారంభించిన ఇన్‌క్యుబేషన్ కేంద్రాల సంఖ్య ఎంత?

**గౌరవనీయులైన వ్యవసాయ, అగ్రి-ప్రాసెసింగ్, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి)**

**అ)** అవునండీ.

**ఆ)** ప్రస్తుతం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇన్‌క్యుబేషన్ కేంద్రాలను ఇంకా ప్రారంభించాల్సి ఉంది. అయితే, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని 5 వ్యవసాయ కళాశాలలన్నింటిలో వ్యవసాయ అనుభవపూర్వక అభ్యసన కార్యక్రమం (ఎ.ఇ.ఎల్.పి) ద్వారా విలువ జోడింపు ఉత్పత్తుల ప్రక్రియలో విద్యార్థి “రెడీ” (గ్రామీణ వ్యవస్థాపకత అవగాహనాభివృద్ధి యోజన) విధానం క్రింద వ్యవసాయ పట్టభద్రులకు వారి బి.ఎస్‌సి; (వ్యవసాయం) ఆఖరి సంవత్సరంలో శిక్షణ ఇవ్వడమవుతున్నది.

Presently, the Incubation Centers are yet to be started in the State of Andhra Pradesh. However, the agricultural graduates are being trained in their final year B.Sc. (Ag.) Degree under Student READY (Rural Entrepreneurship Awareness Development Yojana) concept in the process of value added products through Agricultural Experiential Learning Programme (AELP) in all the 5 Agricultural Colleges of Acharya N.G. Ranga Agricultural University.

**Dr. M.V.V.S.MURTHY:** The biggest production activity in Andhra Pradesh is Agriculture and it is contributing 15% of GDP and it is going to be 25% according to the Ministers earlier statement. అటువంటప్పుడు ఈ కార్యకలాపాలకు మనం ఇవ్వవలసినటువంటి ప్రాధాన్యత ఇస్తున్నామా? ఇస్తుంటే ఇంతవరకు అవి ఎవరూ కూడా మన రాష్ట్రంలోని పరిశ్రమలకు ఇన్‌క్యుబేషన్ కేంద్రాలు ఉంటాయి, ఇన్నోవేషన్స్ ఉంటాయి. రీసెర్చి జరుగుతోంది.

**ఉ.10.40**

అధ్యక్షా, రీసెర్చ్ కావాలంటే స్వామినాథన్‌గారి దగ్గరకు వెళ్లి ఏమైనా Evergreen activity జరుగుతుంటుంటే అది ఏమిటని తెలుసుకోవడం తప్ప మనం మన రాష్ట్రంలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలనుకున్నప్పుడు ప్రతి జిల్లా కేంద్రంలో ఇంక్యుబేషన్ కేంద్రాలను పెట్టాలి. వాటి research activity పెంచాలి. ఉత్పత్తులను మనం పెంచగలిగినప్పుడే గౌరవ మంత్రి గారు 25శాతం గ్రోత్‌తో టార్గెట్‌ను రీచ్ అవ్వగలుగుతారు. లేకపోతే మరలా కౌంటర్ ప్రొడక్టివ్ అయ్యి తగ్గుతూ ఉంటుంది తప్ప పెరగడానికి అవకాశం ఉండదు. ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి 5 కళాశాలలు చాలవు. కొత్తగా ఎన్ని ప్రైవేట్ కళాశాలలు ఇచ్చారో నా దగ్గర రికార్డు లేదు. కొత్తగా ఎన్ని కళాశాలలు ఎన్ని జిల్లాలలో ప్రారంభమయ్యాయో, రాబోయే సంవత్సరాలలో ఎన్ని జిల్లాలలో ప్రారంభమవుతున్నాయో మంత్రి గారికి తెలుసు. వీటన్నింటిలోను ఇన్‌క్యుబేషన్ కేంద్రాలను పెట్టి ప్రమోట్ చేస్తారా? ప్రమోట్ చేస్తే దానికి ఎటువంటి అలోకేషన్స్ ఇస్తారు. వాటి ద్వారా ఆదాయం రావడానికి అవకాశం ఉంది. కాబట్టి దీని మీద కూడా చర్య తీసుకుంటే బాగుంటుందని మీ ద్వారా గౌరవ మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

**శ్రీ వి.వి.వి.చౌదరి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలలో ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ అనేది చాలా ప్రధానమైన పరిశ్రమ. దీనికి సంబంధించి A.P.Food Processing Society ద్వారా National Research Development Corporationతో MoU అయినట్లుగా మీడియా ద్వారా అవగతమవుతుంది. దీని ద్వారా ఎన్ని ఇన్‌క్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అగ్రిమెంట్ అయ్యింది? ఏయే రంగాలలో Food Processing Units లో అగ్రిమెంట్స్ అయినాయో ఆ వివరాలు తెలియజేస్తే బాగుంటుందని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి:** అధ్యక్షా, గుంటూరు జిల్లా లాం, కడప జిల్లా కెవికె యూనివర్శిటీలలో value added products కింద ట్రైనింగ్ ఇస్తున్నాము. అదే విధంగా మహిళా పారిశ్రామికవేత్తలకి మిల్లెట్స్‌తో

value added products తయారు చేసే దానికి ట్రైనింగ్ ఇస్తున్నాము. Society for Elimination of Rural Poverty వారు కూడా మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడానికి షేర్ చేసుకుంటున్నారు. పెద్దలు ఎం.వి.వి.ఎస్.మూర్తి గారు, వి.వి.వి.చౌదరి గారు చెప్పినట్లు ఇన్‌క్యుబేషన్ కేంద్రాలను అదనంగా అగ్రికల్చర్ కళాశాలలలో ఏర్పాటు చేసేందుకు ఈ సంవత్సరం ప్రణాళికను రూపొందిస్తున్నామని తెలియజేస్తున్నాను.

**MR.CHAIRMAN:** Now Question No.10247.

<u>భూముల కేటాయింపు</u>

ప్రశ్న నెం.10247(16)

**సర్వశ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్, గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్ల కాళి కృష్ణ శ్రీనివాస్, ఎం.ఎల్.సిలు,**

గౌరవనీయులైన పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) ప్రైవేటు వ్యాపార సంస్థలు/ ప్రైవేటు పారిశ్రామిక యూనిట్లకు 2014, జూన్ నుండి కేటాయించిన భూమి విస్తీర్ణం వివరాలను తెలుపండి;

ఆ) భూములను కేటాయించడానికి ప్రాతిపదిక మరియు ధర వివరాలు ఏమిటి?

**గౌరవనీయులైన పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ మంత్రి: (శ్రీ యన్.అమరనాథ్ రెడ్డి):**

అ) ప్రైవేటు వ్యాపార సంస్థలు/ప్రైవేటు పారిశ్రామిక యూనిట్లకు ఎపిఐఐసి ద్వారా 2014, జూన్ నుండి 11,669 ఎకరాల భూమిని కేటాయించడమయింది.

ఆ) దరఖాస్తుదారులు సమర్పించిన సవివరమైన ప్రాజెక్టు నివేదికలను తృతీయ పక్షం మదింపు చేసిన తరువాత భూమి కేటాయింపులను చేయడమయింది. సాధారణంగా, అమలులో ఉన్న మార్కెట్ ధరను తగురీతిగా పరిగణనలోనికి తీసుకుంటూ కాస్ట్ ప్లస్ ప్రాతిపదికన పలు కేటగిరీలు పరిశ్రమలకు భూమిని కేటాయించడమవుతున్నది. అభివృద్ధి చేసిన మరియు అభివృద్ధి చేయని భూమికి ధర నిర్ధారణ వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది.

<u>**భూమి ధర నిర్ధారణ వివరాలు**</u>

<u>అభివృద్ధి చేసిన భూమి ధర అంశాలు</u>

1. భూమి ధర (ఏదేని పెంచిన భూమి నష్టపరిహారం మరియు ఆర్ మరియు ఆర్‌తో కలుపుకుని ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూమి, పట్టా భూమి ధర, భూసేకరణ యూనిట్ సిబ్బంది వ్యయాలు మున్నగునవి).

2. భూమి ప్రాథమిక విలువపై 3 శాతం చొప్పున భూమి వినియోగ మార్పిడి ధరలను విధించడమయింది.

3. రోడ్ల వ్యయంలో ఏవేని సబ్ స్టేషన్లు, వీధిదీపాలు, మురుగునీరు లైన్లు ఇతర సాధారణ మౌలిక సౌకర్యాలు వ్యయం చేరి ఉంటుంది.

4. అభివృద్ధి వ్యయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆదేశించిన విధంగా 5 శాతం అభివృద్ధి వ్యయం చొప్పున పర్యావరణ నిర్వహణ వ్యయం సిఇటిపి మరియు ఎస్‌టిపి కోసం స్వయంభరణ అంతరం (అవసరం లేనిచోట దీనిని పరిగణనలోనికి తీసుకోరాదు) (సర్క్యులర్ నెం.116 తేదీ:24-03-2005).

5. భూసేకరణ వ్యయం మరియు భూమి అభివృద్ధి వ్యయం పై ప్రస్తుతం విడిగా 15 శాతం పరిపాలన వ్యయాన్ని నిర్ధారించడమయింది. (సర్క్యులర్ నెం.ఎఫ్‌డబ్ల్యు/పిఎఫ్ మరియు ఐసి/2015-16, తేదీ:03-06-2015).

6. ల్యాండ్ డిపాజిట్‌లపై వడ్డీ మరియు భూసేకరణ వ్యయంపై ఒకే విడత వడ్డీని సంవత్సరానికి 12 శాతం చొప్పున వసూలు చేయడం మరియు నిర్మాణ సమయంలో సంవత్సరానికి 12 శాతం చొప్పున ఒక సంవత్సరానికి అభివృద్ధి వ్యయంపై వడ్డీని వసూలు చేయడం (సర్క్యులర్ నెం.386, తేదీ:18-01-2011).

**అభివృద్ధి చేయని భూమి అంశాలు:**

1. భూమి ధర (ఏదేని పెంచిన భూమి నష్ట పరిహారం మరియు ఆర్ మరియు ఆర్‌తో కలుపుకుని ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూమి, పట్టా భూమి ధర, భూమి సేకరణ యూనిట్ సిబ్బంది వ్యయాలు మున్నగునవి).

2. మొత్తం వ్యయంపై 15 శాతం చొప్పున పరిపాలన వ్యయం.

3. కేటాయింపు నిబంధనలతో పేర్కొన్న స్లాబ్ రేట్ల ప్రకారం ప్రాసెస్ రుసుం విధించడమయింది.

| | | |
|---|---|---|
| 100 ఎకరాల వరకు | - | ఎకరానికి రూ.15,000/- |
| 100 ఎకరాలు పైన 400 ఎకరాలు వరకు | - | ఎకరానికి రూ.10,000/- |
| 400 ఎకరాలకు పైన | - | ఎకరానికి రూ. 07,500/- |

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, ఎండి, ఎపిఐఐసి గారు కార్యదర్శి గారికి ఒక లెటరు వ్రాశారు. అది ఏమిటంటే, జీవో నెం.25, తేదీ.1.5.2015, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటు జీవోను మేము అమలు చేయలేము, మాకు మినహాయింపు ఇవ్వమని అడుగుతున్నారు. ఇది కేవలం జీవో మాత్రమే కాదు. దీనికి statute support కూడా ఉంది. ఇది ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లో equitable distribution of the assets అని ఒక provision ఉంది. ఆ provision ను బేస్ చేసుకుని ఈ జీవోను విడుదల చేశారు. Department లో Operational problems

ఉంటే దానిని చర్చించాలి. Concerned people, Minister Chambers లోనో, కార్యదర్శి గారితోనో మాట్లాడాలి గాని, మమ్మల్ని మినహాయించండి అని అనడం it is very unfortunate. ఏ శాఖలకు కూడా జీవోలను, చట్టాలను మినహాయించడం కుదరదు. కాబట్టి దీనిని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి. గౌరవ మంత్రిగారు కూడా రెవ్యూ పెట్టి Operational problems ఉంటే we can discuss and get suggestions from the concerned groups.

**శ్రీ కత్తి నరసింహా రెడ్డి:** అధ్యక్షా, 11,699 ఎకరాలను ప్రైవేటు పారిశ్రామిక వ్యాపార సంస్థలకు కేటాయించడం జరిగింది. వీటికి ప్రభుత్వ విధానంగా నిర్ధుష్టమైన సమయం లోపల వారు అనుకున్న టార్గెట్‌ను రీచ్ కాకపోతే వాటిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునే చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా? అదే విధంగా స్థానికంగా కియా మోటర్స్ అనంతపురంలో పెట్టారు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు స్థానికులకు 80శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 11,669 ఎకరాలు కేటాయించిన ఆ సంస్థలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని మనం ఏమైనా ఉత్తర్వులు ఇచ్చామా? దీనిని కూడా అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ వయ్యావుల కేశవ్ :** అధ్యక్షా, పారిశ్రామిక వాడలకు పక్క నున్న రాష్ట్రం కర్ణాటక లో ప్రైవేట్ పబ్లిక్ పార్టిసిపేషన్ లో మామూలు తాలుకా స్థాయిలో కూడా Industrial estates development జరుగుతుంది. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎమ్ఎస్ఎమ్ఇ పేరుతో విస్తృతంగా ప్రభుత్వమే ఏపిఐఐసి ద్వారా చేసే ప్రయత్నం చేస్తుంది. ఆ విధంగా ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ మోడ్‌లో చేసే ఆలోచనను చేస్తారా అని మీ ద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. దానితో పాటు అనంతపురం జిల్లా హెడ్‌క్వార్టర్స్ లో చిన్న చిన్న పరిశ్రమలు పెట్టాలనుకున్న వారికి పారిశ్రామిక భూమి దొరకడం లేదు. అక్కడ Industrial Estate ను ఏర్పాటుచేసే ప్రతిపాదనను ఆలోచించమని గౌరవ మంత్రివర్యుల దృష్టికి తీసుకువస్తున్నాను. రాయదుర్గం నియోజకవర్గం డి.హీరేహాళ్ మండలంలో పెద్ద ఎత్తున భూములను సేకరిస్తామని నోటిఫై చేశారు. వాటికి రైతులకు ధరలు చెల్లించడంలేదు. రైతులు అమ్ముకోవడానికి వెసులుబాటు కల్పించడం లేదు. దీని మీద ఏదోఒక నిర్ణయం తీసుకోవాలని వారిని ఆదుకోమని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదే విధంగా ఉరవకొండలో కూడా ఎమ్ఎస్ఎమ్ఈ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయమని ప్రభుత్వాన్ని కోరాము. వాటి మీద ప్రభుత్వం తొందరలో చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని తమరి ద్వారా మంత్రి గారిని కోరుతున్నాము.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి(పట్టభద్రుల నియోజకవర్గం– చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు):** అధ్యక్షా, భూముల సేకరణ సందర్భంగా నిర్ధుష్టమైన కాలపరిమితి లోపల కొన్ని పరిశ్రమలను స్థాపించలేదు. భూములను రికవరీ చేసేందుకు చర్యలు ఏమైనా చేపట్టారా? అత్యధికంగా భూములు ఉన్న జిల్లా చిత్తూరు. నెల్లూరు, చిత్తూరు జిల్లాలో ఉన్న శ్రీ సిటీలో వేలాది ఎకరాలు ఉద్యానవనాలతో, పంట భూములతో, బోర్లతో, చెరువులతో సహా రైతులు

ఇచ్చేశారు. వరదాయపాళెం, తడ, బిఎన్ కండ్రిగ ప్రాంతాలలో రైతులు భూములను ఇచ్చారు. కానీ అక్కడ స్థానికులకు ఉద్యోగాలు 80శాతం కాదు కదా కనీసం 5శాతం కూడా కల్పించలేదు. ఆ జిల్లా వాసులు, నెల్లూరుతో అనుబంధం ఉన్న వారు స్థానికులు చాలా మంది బిటెక్ చదువుకున్న వారు ఉన్నారు. అటువంటి వారికి ఉద్యోగావకాశాలు ఇప్పించే ప్రతిపాదన ఏమైనా ఉందా? అక్కడ చాలా మంది విద్యార్థులతో ఉన్నారు. ఇప్పటికి అయితే 5శాతం కూడా స్థానికులకు ఉద్యోగాలు కల్పించలేదు. వారికి ఉద్యోగాలు కల్పించే ప్రతిపాదన ఏమైనా ఉందా అని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను.

అధ్యక్షా, అభివృద్ధి చేయని భూములకు సంబంధించి, ఇప్పుడు భూములు దొరకడమే చాలా కష్టంగా ఉన్న పరిస్థితులలో వేలాది ఎకరాల భూమిని పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు కేటాయించిన తరువాత అంగుళం భూమి కూడా దొరకని పరిస్థితులలో ఉంది. అభివృద్ధి చేయని భూములకు రూ.15,000, 10,000, 7,500 కేటాయించే సొమ్ము చాలా స్వల్పమైనది. ఈ సొమ్మును అక్కడ ఉన్న అవకాశాలను బట్టి కొంచెం పెంచాల్సిన ప్రతిపాదన ఉంది. దానిని ఏమైనా చేయగలుగుతారా అని తమరి ద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ యన్.అమరనాథ్ రెడ్డి:** అధ్యక్షా, గౌరవ సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ గారు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ ఆఫ్ ల్యాండ్ అలోకేషన్‌కు సంబంధించి కోరారు. ప్రభుత్వం దానిని ఇంకా అప్రూవ్ చేయలేదు. తప్పనిసరిగా సమావేశం ఏర్పాటుచేసి, పరిశీలించి తగు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాము. అదే విధంగా ఎంప్లాయ్‌మెంట్‌కు సంబంధించి ఎవరైతే భూములు ఇచ్చారో వారితో మాట్లాడడం జరిగింది. భూములు ఇచ్చేటప్పుడే ఏపిఐఐసి నార్మ్స్ లోనే 20శాతం భూములు ఇచ్చిన వారికి ఎంప్లాయ్‌మెంట్ ఇవ్వాలని ఉంది. దానిని ఇంప్లిమెంట్ చేయడానికి తప్పనిసరిగా తగు చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

**ఉ.10.50**

అధ్యక్షా, అదే విధంగా ఎంఎస్ఎంఈ సంబంధించి గానీ, మీడియం, లార్జ్‌కు సంబంధించి గానీ ఏవైనా భూములు తీసుకున్న తరువాత ఆ టైమ్ లిమిట్ లోపల పెట్టకపోతే ఏ రకమైన చర్యలు తీసుకుంటారు అని అడగడం జరిగింది. ఎంఎస్ఎంఈకు సంబంధించి ఒక సంవత్సరం, మీడియం సంబంధించి రెండు సంవత్సరాలు, లార్జ్‌కు సంబంధించి మూడు సంవత్సరాల లోపల వారు పరిశ్రమలు స్థాపించకపోతే తప్పనిసరిగా వాటిని రద్దు చేసి ఆ భూమిని వెనక్కితీసుకోవడం జరుగుతుంది. అదే విధంగా పాలసీకి సంబంధించి గౌరవ సభ్యులు శ్రీ పయ్యావుల కేశవ్ గారు అడిగారు. ఎంఎస్ఎంఈ పార్కులకు సంబంధించి ఒక పాలసీని కూడా త్వరలోనే తీసుకురాబోతున్నాము. అదే విధంగా మన రాష్ట్రంలో ఉండే 175 నియోజక వర్గాలకు సంబంధించి ప్రతి నియోజకవర్గంలో కూడా ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసి, దానికి ప్రత్యేకమైన పాలసీని త్వరలో తీసుకురావడం జరుగుతుందని తెలియచేస్తున్నాను. అదే విధంగా అనంతపురం జిల్లాలోని డి.హీరేహళ్ మండలంలోని భూములు తీసుకున్నారు? వాటిని నేటికి వాడలేదు అని అడిగారు, తప్పకుండా వాటిని ఎగ్జామిన్ చేసి తగు రీతిలో న్యాయం చేస్తామని తెలియచేస్తున్నాను.

**MR.CHAIRMAN:** Now, Question No.10345.

## <u>ఫుడ్ ప్రాసెసింగ్ మరియు వృద్ధి కేంద్రాలు</u>

ప్రశ్న నెం. 10345(17)

**శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

అ) ప్రకాశం జిల్లాలో ఆహార ప్రాసెసింగు మరియు వృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వద్ద ఏవైనా ప్రతిపాదనలు ఉన్నాయా;

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

**గౌరవనీయులైన పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రి బిజినెస్, కామర్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మంత్రి (శ్రీ యన్. అమర్‌నాథ్ రెడ్డి):**

అ) అవునండీ.

ఆ) 2015-20 ఆహార ప్రాసెసింగ్ విధానం ప్రకారంగా, దీనిని మెగా ఫుడ్ పార్కుగా పిలవడమయింది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో ప్రైవేటు పారిశ్రామికవేత్తల ద్వారా అభివృద్ధి చేయడమయింది. ఎస్ హెచ్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రైవేటు లిమిటెడ్‌గా పిలువబడిన మెగాఫుడ్ పార్కును రూ.115కోట్ల వ్యయంతో ప్రకాశం జిల్లా కురిచేడు మండలం ముస్తా గంగవరం గ్రామంలోని శ్రీనివాస ఫార్మ్స్ ప్రైవేటు లిమిటెడ్ ద్వారా అభివృద్ధి చేయడమవుతున్నది. గుడ్లు, కోడి మాంసం, మేక మాంసం మరియు తినడానికి సిద్ధంగా ఉన్న ఆహారపదార్థాల ప్రాసెసింగ్ కోసం కోర్ ప్రాసెసింగ్ సదుపాయాలు ఉన్నాయి.

**శ్రీ కరణం బలరామకృష్ణ మూర్తి:** అధ్యక్షా, జిల్లాలో అది ఒక్కటేనా ఇంకేమైనా ప్రపోజల్స్ ఉన్నాయా అని దానిని క్లారిఫై చెయ్యమని అడుగుతున్నాను. ఎందుకంటే, ప్రకాశం జిల్లాలో ఇంతవరకూ ఏవిధమైన పరిశ్రమ లేదు. కొత్త రాష్ట్రం నుంచి చిత్తూరు జిల్లాకు వెళతారు, లేదంటే ఆ చివరకు వెళతారు. మధ్యలో మమ్మల్ని అనాథల్ని చేశారు. మా జిల్లాకు ఇంత వరకు ఏ పరిశ్రమను ఇవ్వలేదు. మాటలేమో కోటలు దాటుతున్నాయి కానీ పనులు మాత్రం జరగడం లేదు. ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి ఉంది. కాబట్టి ముందుకు వచ్చిన పరిశ్రమలను కొంత మోటివేట్ చేసైనా ప్రకాశం జిల్లాకు పంపిచాలని కోరుతున్నాను.

ఇంకొకటి, నాకు వచ్చిన సమాచారం ప్రకారం మీ ఆఫీస్‌లో ఎవరో ఉన్నారంట? (పేరు చెప్పడం బాగుండదు) వారు ప్రకాశం జిల్లాలో వసతులు సరిగా ఉండవని ఆ పారిశ్రామికవేత్తలను డిస్కరేజ్ చేస్తున్నారు. ఏ ప్రాజెక్టులు

ప్రకాశం జిల్లాకు రాకుండా పోవడానికి కొంత కారణం అలా డిస్కరేజ్ చేయడమేనని మాకు ఉన్న సమచారం. మంత్రి గారికి జిల్లాతో సంబంధాలు ఉన్నాయి కాబట్టి దానిపై ఫరదర్‌గా ఏమి చేస్తారో చెబితే బాగుంటుదని నా అభిప్రాయం.

**శ్రీ బి.ఎస్. రాజసింహులు(స్థానిక సంస్థలు – చిత్తూరు):** అధ్యక్షా, ఈ రోజు ప్రకాశం జిల్లా లేదు, చిత్తూరు జిల్లా లేదు, ప్రతి నియోజకవర్గానికి ఇవ్వడానికి మంత్రి గారు సిద్ధంగా ఉన్నారు. అదేవిధంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో పబ్లిక్‌కి మంచి క్వాలిటీ మరియు క్వాంటిటీని ఇవ్వాలనే ఉద్దేశంతో మనం ఏవైనా ఇన్సులేటెడ్ వెహికల్స్ గానీ, ఫ్రీజర్ వెహికల్స్ గానీ, అక్కడే కోల్డ్ స్టోరేజ్‌లను పెట్టి మంచి క్వాలిటీ ఫుడ్స్ చేపలు, పండ్లు వంటి వాటిని ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో పెడితే బ్రహ్మాండంగా ఉంటుంది. అలాంటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్‌లో ట్రాన్స్‌పోర్టేషన్‌లో, కోల్డ్ స్టోరేజ్‌లను పెట్టే అవకాశాలు ఏమైనా ఉన్నాయా అని తమరి ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

**శ్రీ యన్. అమర్‌నాథ్ రెడ్డి:** అధ్యక్షా, గౌరవ సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి గారు చెప్పినట్లు ప్రకాశం జిల్లాలో ఆల్‌రెడీ ఇప్పుడు 13 ప్రాజెక్టులు మంజూరు చేయడం జరిగింది. అదే విధంగా ఈ జిల్లాకు సంబంధించి మొత్తం 12 ప్రాజెక్టులు ఇప్పటికే ఉన్నాయి, ఒక మెగా ప్రాజెక్టు ఉంది, ఇంకొక మెగా ప్రాజెక్టు కూడా రాబోతుంది. ఈ మధ్య MoU లు జరిగిన వాటిలో దాదాపు 15 MoU లను ప్రకాశం జిల్లాకు సంబంధించినవే తీసుకోవడం జరిగింది. దానికి సంబంధించిన ఇన్‌వెస్ట్‌మెంట్ దాదాపు రూ.272కోట్లు వాటి ద్వారా దాదాపు 4240 మంది ఉద్యోగావకాశాలు వచ్చే అవకాశం ఉంది. ఆల్‌రెడీ ఇప్పుడున్న యూనిట్ల ద్వారా దాదాపు రూ.297కోట్లతో 8842 మందికి ఎంప్లాయిమెంట్ కూడా వస్తుంది. ఫుడ్ ప్రాసెసింగ్‌కి సంబంధించిన ఈ 12 ప్రాజెక్టుల కూడా సమాచారాన్ని అంతా సభ్యునికి అందచేయడం జరుగుతుంది. ప్రకాశం జిల్లాని నెగ్లెక్ట్ చేసే ప్రసక్తే లేదు. రాయలసీమ ప్రాంతం ఏ విధంగా ఉందో ప్రకాశం జిల్లా కూడా అదే రకంగా ఉండే ప్రాంతం. ప్రకాశం జిల్లాపైన ముఖ్యమంత్రి గారూ కూడా ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతున్నారు. ఆ జిల్లాలో ఉండే పెద్దలందరూ కొంత సహకరించి కొంత పెట్టుబడులు తీసుకొస్తే వాళ్లకు కావలసిన పర్మిషన్స్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియచేస్తున్నాను.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** మేము ఎక్కడనుంచి పెట్టుబడి దారులను తీసుకురావలండీ అసలే పేదవారైతే, ప్రభుత్వమే తీసుకురావాలి. (మైకు లేకుండా)

**శ్రీ యన్. అమర్‌నాథ్ రెడ్డి:** మీ సైడు నుంచి కూడా కొంత సహాయం చేస్తే ఇంకొంచెం ముందుకు వెళ్లడానికి అవకాశం ఉంటుందనే విషయాన్ని చెపుతున్నానే తప్ప పేదోళ్లు, పెద్దోళ్ల విషయం గురించి నేను చెప్పడం లేదు. రాష్ట్రమంతా పేదోళ్లు, పెద్దోళ్లు ఉన్నారు కాబట్టి తప్పనిసరిగా మీ నుంచి కూడా సహాయాన్ని అందించమని కోరుకుంటున్నాను. అన్ని జిల్లాలతో సమానంగా ప్రకాశం జిల్లాకు కూడా సమానమైన అవకాశాలు తీసుకురావడం జరుగుతుంది. ఈ మెగా ప్రాజెక్టు ద్వారా దాదాపు రూ.50కోట్ల గ్రాంట్స్ వచ్చే అవకాశం ఉంది. రావలసిన పర్మిషన్స్ అన్నీ సకాలంలో పూర్తిచేసి త్వరితగతిన వాటిని ఇంప్లిమెంట్ చేయడానికి ఇప్పుడు వచ్చిన MoU లలో ప్రభుత్వం

తప్పనిసరిగా అన్నీ రకాలైన చర్యలు తీసుకుంటుందని తెలియచేస్తున్నాను. అదే విధంగా చిత్తూరు జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. మ్యాంగో పల్స్‌కు సంబంధించి కానీ, గుడ్లకు సంబంధించి కానీ అనేక అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్‌లో ఇంకా ఎన్నో అవకాశాలు వస్తాయని తెలియచేసుకుంటున్నాను.

**MR.CHAIRMAN:** Now, Question No.9971.

## కడపలో ఉక్కు కర్మాగారం

ప్రశ్న నెం. 9971(18)

**శ్రీమతి పోతుల సునీత, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన గనులు మరియు భూగర్భ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం కేంద్రప్రభుత్వానికి ఏవేని ప్రతిపాదనలు పంపడమయిందా;

ఆ) అయితే ఆ వివరాలేమిటి?

**గౌరవనీయులైన గనులు మరియు భూగర్భశాఖ మంత్రి (శ్రీఆర్.వి.సుజయ్ కృష్ణ రంగారావు):**

**అ)** అవునండీ

**ఆ)** 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 13వ షెడ్యూలు ప్రకారం, ఆవిర్భావ తేదీ నుండి ఆరు నెలల లోపల సెయిల్ నూతనంగా ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో ఏకీకృత స్టీల్ ప్లాంట్‌ను నెలకొల్పే సాధ్యాసాధ్యతను పరిశీలించాలి.

అయితే, 2015 జూన్‌లో, ఈ అంశంపై ఆర్థిక పరమైన సాధ్యాసాధ్యాల నివేదికను సెయిల్ సమర్పించింది. ఇది అత్యంత బలహీనమైన ఆర్థిక సాధ్యాసాధ్యతను సూచించింది. అందుచేత, ప్రతిపాదిత స్టీల్ ప్లాంట్ ఆర్థిక స్వయంభరణ శక్తిని పెంచేందుకు సాధనోపాయాలను కనుగొనడానికి రాష్ట్రాల నుండి ప్రతినిధులతో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. ప్రతిపాదిత స్టీల్ ప్లాంట్ సవివరమైన ఆర్థిక సాధ్యాసాధ్యతను అమలుపరచడానికి స్వతంత్ర సంస్థగా మెస్సర్స్ మెకన్ (కేంద్ర ప్రభుత్వ పిఎస్‌యు)ను టాస్క్‌ఫోర్స్ నియమించింది.

**ఉ.11.00**

**మిస్టర్ చైర్మన్:** సునీతగారూ, ఇందాక మీరు అడిగిన ప్రశ్న ఇప్పుడు వచ్చింది. సప్లమెంటరీ వేయండి.

**శ్రీమతి పోతుల సునీత:** అధ్యక్షా, ఈరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. గౌరవ మంత్రివర్యులు మన రాష్ట్రం తరఫున ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. విభజన చట్టంలోని 13వ షెడ్యూలు ప్రకారం కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని మన ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రిగారు అనేక ప్రతిపాదనలు పంపించారు. భూమి, నీరు, రవాణా సౌకర్యాలు మొదలగు మౌలిక వసతులు కల్పించడానికి మన ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని కేంద్రప్రభుత్వానికి తెలియజేయడం జరిగింది. ఇవన్నీ ఏమీ పట్టించుకోకుండా కేంద్రప్రభుత్వం చాలా అన్యాయానికి పాల్పడుతోంది. మన రాష్ట్రంలో కడప వెనుకబడిన జిల్లా, భూగర్భ నిక్షేపాలు విశేషంగా ఉన్న జిల్లా. ఇక్కడ ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటుచేయడం వలన పేద, మధ్యతరగతివారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కలిగి ఆ జిల్లా అభివృద్ధిపథంలో నడవడానికి దోహదపడుతుంది. అక్కడ ఎన్నో అనుకూలమైన అంశాలున్నాయి. అలాగే బయ్యారం గనుల ద్వారా ముడిసరుకును రవాణా చేసుకోవడానికి అవకాశాలున్నాయి. కృష్ణపట్నం పోర్టు ద్వారా కూడా ఎగుమతులు, దిగుమతులు చేసుకోవడానికి అవకాశం ఉంది. కాబట్టి మనం కేంద్రప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకునివచ్చి ఈ ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని మీద్వారా మంత్రివర్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీ పి. రామసుబ్బారెడ్డి:** అధ్యక్షా, కడప వెనుకబడిన జిల్లా. వర్షపాతం తక్కువగా ఉండి కరవుతో అల్లాడుతున్న జిల్లా. రాష్ట్ర పునర్విభజన చట్టం, 2014లోని 13వ షెడ్యూల్ క్రింద స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తామని పార్లమెంట్‌లో చెప్పడం జరిగింది. దాదాపు నాలుగు సంవత్సరాలు కావొస్తుంది. ప్రజానీకం ముఖ్యంగా నిరుద్యోగ యువత స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తే ఉద్యోగావకాశాలు వస్తాయని ఎంతో ఎదురు చూశారు. స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తే అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం, ముఖ్యమంత్రిగారు సిద్ధంగా ఉన్నారు. పట్టిసీమ నిర్మించటంవలన కృష్ణా జిల్లాలోని మైలవరం, గండికోటలలో కూడా పరిశ్రమలకు కావాల్సిన నీరు అందుబాటులో ఉంది. వేల ఎకరాల భూములు ఉన్నాయి. గతంలో బ్రహ్మణీ స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేసినప్పుడు జరిగిన విషయాలు తెలుసు. అక్కడ కూడా ల్యాండ్ ఉంది, లేదంటే మైలవరం రిజర్వాయరు ప్రక్కనే ఆరువేల ఎకరాల భూమి ఉంది. కరెంట్, రైల్వేలైను వంటి అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం కృషిచేస్తున్నప్పటికీ స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకావడం లేదు. ఆలస్యమయ్యే కొద్దీ నిరుద్యోగ యువత ఆమరణ నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఆలస్యం అవుతోంది, మనకు వస్తుందా రాదా అనే ఆందోళనలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని చూస్తే ప్రత్యేక హోదా రాదేమో అనే భయంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇది మంచి పరిణామం కాదు. ముఖ్యమంత్రిగారు కూడా చాలా ప్రయత్నం చేసినప్పటికీ కేంద్రప్రభుత్వం నుండి స్పందన రావడం లేదంటున్నారు. అన్ని సౌకర్యాలు కల్పించినప్పటికీ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం చాలా బాధాకరం. రాష్ట్రపునర్విభజన చట్టం ప్రకారం కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్(పట్టభద్రుల నియోజకవర్గం - శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం):** అధ్యక్షా,13వ షెడ్యూల్‌లో మూడవ పాయింట్‌లో ఫీజిబిలిటీ స్టడీ ఆరు నెలల్లో చేయమని ఉంది. కేంద్రప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సెయిల్ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేయడం, ఫీజిబిలిటీ రిపోర్ట్ కూడా సబ్మిట్ చేయడం జరిగింది. అయితే ఫీజిబిలిటీ సబ్మిట్ చేసిన తరవాత, దానిలో కొన్ని అభ్యంతరాలు వచ్చిన తరవాత గౌరవ మంత్రిగారిని మరియు తెలంగాణ మంత్రిగారిని స్వయంగా కేంద్రమంత్రి బీరేంద్రసింగ్‌గారు పిలిచి హైదరాబాద్‌లో మాట్లాడడం జరిగింది. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అనుసంధానం చేయడానికి ఉన్న అవకాశాలను కూడా పరిశీలించాల్సిందిగా కోరడం జరిగింది. సిఎమ్. రమేశ్‌గారు, సుజనా చౌదరిగార్లతోపాటు మన కడప నుండి వచ్చిన డెలిగేషన్ అందరితో పార్లమెంట్ ఆవరణలో సమావేశమైన బీరేంద్రసింగ్‌గారు కడప స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయడానికి ప్రయత్నిస్తామని, అందుకు అవసరమైన అన్ని విధానాలు అవలంబిస్తామంటూ ఒక ప్రకటన చేయడం జరిగింది. ఇన్ని చెప్పినా కూడా కేంద్రప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ఇవ్వకుండా అడ్డుకుందని చెప్పడం చాలా దారుణం. ఈ ప్రయత్నాలతోపాటు విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్‌ను స్టడీ చేసి దానిని సబ్సిడీ క్రింద తీసుకుని చేయడానికి కూడా ఉన్న అవకాశాలను కేంద్రప్రభుత్వం పరిశీలిస్తోంది.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి:** అధ్యక్షా, వెనుకబడిన జిల్లాలో ఒక పరిశ్రమను సాధించుకోవాలంటే ఉద్యమిస్తేనే కాని రాదు. గతంలో కూడా "విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు" అనే ఒక పెద్ద ఉద్యమం చేస్తేనే విశాఖలో ఉక్కు కర్మాగారం వచ్చింది. ఇప్పుడు కూడా రాయలసీమలో, అందులో కడపలో గనులకు, ప్రకృతి వనరులకు నిలయమైన జిల్లాలో "కడప ఉక్కు, ఆంధ్రుల హక్కు" అని ఉద్యమిస్తే గానీ కేంద్రం నుండి స్పందన రాని పరిస్థితి ఉన్నది. రాష్ట్రప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తామని చెబుతున్నది. విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ప్రకారం కేంద్రం ఆదుకోవాలి, కడపలో ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించి తీరాలి, ఆ ప్రాంత ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతున్నాము.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, 20 సంవత్సరాలు పోరాడితేనే గానీ విశాఖ స్టీల్ ప్లాంట్ రాలేదు.

(అంతరాయం)

**శ్రీ విటపు బాల సుబ్రహ్మణ్యం:** ఇప్పుడు కూడా 20 సంవత్సరాలు పోరాటం చేయమంటారా? మంత్రిగారు సమాధానం చెబుతారు కదా?

(అంతరాయం)

**శ్రీ చడిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి:** అధ్యక్షా, ఒక మంత్రిగా కాకుండా జమ్మలమడుగుకు చెందిన ఒక వ్యక్తిగా చెబుతున్నాను. గౌరవసభ్యులు శ్రీ రామ సుబ్బారెడ్డిగారు చెప్పిన ప్రతి మాట వాస్తవం. మాకు ల్యాండ్ ఉంది, రైల్వేలైన్ ఉంది, గండికోట, మైలవరం నీరు ఉన్నాయి, గతంలో మాదిరిగా కాకుండా కావాల్సినంత ఖనిజం ఉన్నది.

నాకు అధ్యాపకుడిగా పనిచేసిన అనుభవం ఉంది. చిత్తము చాలా మందికి ఉంటుంది, కాని విత్తము కావాలి. ఆ విత్తమును కల్పించాలి. షెడ్యూల్ ప్రకారము యాక్ట్ ఉంది. షెడ్యూల్‌లో ప్రకటించారు, ప్యాకేజీలో ప్రకటించారు. మేము రోజూమొత్తుకుంటున్నాము. కడప జిల్లా చాలా వెనుకబడిన ప్రాంతము, చాలా నష్టపోయిన ప్రాంతము. కచ్చితంగా ఇప్పించే బాధ్యత బి.జె.పి నాయకుల మీద ఉన్నది. మీటింగ్ జరిగిన మాట వాస్తవమే. కాని మీటింగు మ్యాచింగ్ కాలేదు. దీనిని కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉన్నది అధ్యక్షా.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** అధ్యక్షా, సెయిల్‌వారికి దీని సాధ్యాసాధ్యాల గురించి నివేదిక ఇవ్వడానికి ఆరు నెలల సమయం ఇచ్చారు, ఆరునెలల్లోపు అని చెప్పారు. ఎంతకాలం పట్టింది? ఇప్పుడు మెకాన్ వారికి ఇచ్చారు, వారికి ఎంతకాలం పడుతుంది? ఇదేమీ చిన్న అంశము కాదు, చాలా పెద్దయెత్తున ఆందోళన జరిగే అంశము. ఇది రాయలసీమకు ప్రాణం. విశాఖపట్టణం ఎలా అభివృద్ధి చెందిందో రాయలసీమ అదేవిధంగా అభివృద్ధి చెందాలంటే ఉక్కు ఫ్యాక్టరీ వచ్చి తీరాల్సిందే. రాజకీయంగా మాత్రం హామీలిచ్చి, సాంకేతికమైన కారణాలు చూపి సాగదీసి ఆలస్యం చేయడం జరిగితే, ఈ సాంకేతిక కారణాలేవీ చెల్లవు. ప్రజలు అంగీకరించకుండా తిరగబడితే ఇవన్నీ వెనక్కి వెళతాయి. ప్రజలు ముందుకు వస్తారు. ఆ పరిస్థితి తీసుకురాకుండా ఉండడం అనేది మంత్రుల బాధ్యత. ప్రశ్నకు గౌరవమంత్రిగారు సమాధానం చెప్పాలి. కాని, మంత్రిగారి బదులుగా గౌరవ సభ్యులు మాధవ్‌గారు జవాబు చెబుతున్నారు, మంచిదే. ఇకనుండి కేంద్రప్రభుత్వానికి సంబంధించిన ఏ ప్రశ్న వచ్చినా మాధవ్‌గారు సమాధానం చెబుతామంటే మేము కూడా అంగీకరిస్తాము. కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కూడా మాధవ్‌గారిదే.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి:** అధ్యక్షా, రాయలసీమ వెనుకబడిన జిల్లా. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా, అందులోనూ కడప ఉక్కు ఫ్యాక్టరీ అనేది చాలా దీర్ఘకాలికంగా ఉన్న సమస్య. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ తరవాత పబ్లిక్ సెక్టారులో వెనుకబడిన జిల్లాలలో ఉన్న ఏకైక అవకాశం ఇది. 13వ షెడ్యూల్‌లో పోలవరం, కడప ఉక్కు, ఇండస్ట్రియల్ కారిడార్, రైల్వేజోన్ మొదలైన అన్నింటిలో కడప ఉక్కు ఫ్యాక్టరీ కడప ప్రాంతానికే కాదు, వెనుకబడిన జిల్లాలకు ఆ ఫ్యాక్టరీ అవసరం. దానిని సాధించుకుని తీరాలి. రాయలసీమ అభివృద్ధికి పూర్వము రకరకాలైన ఉద్యమాలు చాలా తీవ్రంగా వచ్చాయి. అందువలన అందరం కలిసి కడప ఉక్కు ఫ్యాక్టరీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి, సాధించి తీరాలి. ఈ సందర్భంగానే కడప ఉక్కు ఫ్యాక్టరీని సాధించుకునే తీరుగా మంత్రిగారు ప్రయత్నం చేయాలి. కేంద్రం, రాష్ట్రం అనే తేడాలు లేకుండా అందరం కలిసి కృషిచేయాలి. చాలామంది నిరుద్యోగులు పబ్లిక్ సెక్టార్‌లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. కడప స్టీల్ ఫ్యాక్టరీ వస్తే నిరుద్యోగులకు ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ముడి సరకులు అందుబాటులో ఉన్నాయి, కృష్ణపట్నం పోర్టు దగ్గరగా ఉంది, 13వ షెడ్యూల్‌లో ఉన్నది, ఇంకా నిర్లక్ష్యం చేయడం తగదని మీద్వారా తెలియజేస్తున్నాను.

ఉ. 11.10

**శ్రీ ఆర్.వి.సుజయ్ కృష్ణ రంగారావు:** అధ్యక్షా, విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయానికి సంబంధించి పోలవరానికి ఎంత ప్రాధాన్యత ఉందో, పారిశ్రామికంగా కడపలో స్టీల్ ప్లాంట్‌కి అంతే ప్రాధాన్యత ఉందని ప్రభుత్వం భావిస్తోంది. గౌరవ సభ్యులందరూ ఈ పరిశ్రమ ఆవశ్యకతను గురించి చెప్పడం జరిగింది. ముఖ్యంగా పునర్విభజన చట్టం – 13 షెడ్యూల్ ప్రకారం సెక్షన్–93లో మూడవ పాయింట్‌లో మెన్షన్ చేసిన విధంగా Feasibility weak అని SAIL నివేదిక ఇవ్వడం జరిగింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పునర్విచారణ చేయాలనే ఉద్దేశంతో నిపుణులు, సెయిల్ అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, ఎన్ఎండిసి, మికాన్ వంటి సంస్థలను, రాష్ట్రప్రభుత్వం తరఫున ఏ.పి.ఎం.డి.సి మేనేజింగ్ డైరెక్టర్‌గారిని సభ్యులుగాను, రాష్ట్ర గనులశాఖ సంయుక్తసంచాలకులను ఛైర్మన్‌గాను నియమిస్తూ ఒక టాస్క్‌ఫోర్స్‌ను 19.10.2016న ఏర్పాటుచేయడం జరిగింది. ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ 07.12.2016న జరిగిన తొలి సమావేశంలోనే మళ్ళీ Feasibility ని స్టడీ చేయమని, SAIL ఇచ్చిన నివేదికను మళ్ళీ పరిశీలించి Feasibility Report ఇవ్వమని MECON సంస్థకు ఆదేశాలివ్వడం జరిగింది. దాని ప్రకారంగా MECON సంస్థ వారు అప్పటి నుంచి పని ప్రారంభించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 30లక్షల టన్నుల కెపాసిటీ స్టీల్‌ప్లాంట్ నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏవి అవసరమో వాటన్నింటినీకూడా ఇవ్వడం జరిగింది.

అధ్యక్షా, స్టీల్‌ప్లాంట్ నెలకొల్పడానికి 30 సంవత్సరాల వరకూ రా మెటీరియల్ సమృద్ధిగా ఉండాలని SAIL నివేదిక ఇవ్వడం జరిగింది. అయితే, మనకు అనంతపురం జిల్లాలోని ఎనిమిది గనులలో గతంలో పనులు పని ప్రారంభించి కొన్ని కారణాలవల్ల ఆపాల్సి వచ్చింది. ఆ గనులద్వారా సుమారు 110 మిలియన్ టన్నుల హైగ్రేడ్ హెమటైట్ ఖనిజం లభిస్తుందని, అదేవిధంగా ప్రకాశం జిల్లాలో సుమారు 50,000 మిలియన్ టన్నుల ఖనిజం లభ్యత ఉందనే విషయాన్ని MECON సంస్థ వారు ఇచ్చిన నివేదికలో తెలియజేయడం జరిగింది. దాని ప్రకారంగా MECON సంస్థవారు తమ నాల్గవ సమావేశంలో ఇందాక మాధవ్‌గారు తెలియపరచిన విధంగా నాతోపాటు, రాష్ట్రప్రభుత్వం నుంచి ఇతర అధికారులను టాస్క్‌ఫోర్స్ సమావేశానికి కేంద్రమంత్రిగారు ఢిల్లీకి పిలిచినప్పుడు అక్కడ రా మెటీరియల్ లభ్యత గురించి సమగ్రంగా చర్చించి వారికి చెప్పడం జరిగింది. MECON సంస్థవారు కూడా ఆ సమావేశంలో ఉన్నందున, విశాఖపట్నంలోని ఆటో గ్రేడ్ స్టీల్‌ప్లాంట్‌కు కూడా వారు అక్కడే ఒక ప్రతిపాదన ఇవ్వగా, కేంద్రమంత్రిగారు విశాఖపట్నంలోని సదుపాయాల గురించి చర్చించినప్పుడు వారికి కూడా మనం చాలా స్పష్టంగా తెలియజేయడం జరిగింది.

అధ్యక్షా, పునర్విభజన చట్టంలో పొందుపరిచిన కడప స్టీల్‌ప్లాంట్‌ను మనకు తప్పనిసరిగా ఇవ్వాలని, దీనితోపాటు అదనంగా విశాఖపట్నం ఆటోగ్రేడ్ స్టీల్‌ప్లాంట్ ఇస్తే సంతోషమే కానీ కడప స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ఇది ప్రత్యామ్నాయం కాదని చాలా స్పష్టంగా కేంద్ర మంత్రివర్యులకు తెలియజేయగా, వారు కడప స్టీల్ ప్లాంట్‌కు, విశాఖపట్నం ఆటోగ్రేడ్‌ప్లాంట్‌కు సంబంధం లేదని, అదనంగా తాము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని సమాధానమిచ్చారు. ఆ

తరువాత MECON వారితో జరిగిన అయిదవ సమావేశంలో ప్రాథమిక నివేదికను ఇచ్చారు. అయినా కూడా వాళ్ళు వ్యక్తిగతంగా రాష్ట్రానికి వచ్చి ఖనిజ సంపదను, పరిశ్రమ స్థాపనకు అవసరమైన స్థలాన్ని కూడా పరిశీలించాలనే ఉద్దేశంతో, 2018 సంవత్సరం జనవరి 4, 5 తేదీల్లో MECON Team అనంతపురం జిల్లా గనులలోని ఖనిజాన్ని, కడప జిల్లాలోని కంభాలదిన్నెతోపాటు, ఇతర ప్రాంతాలను కూడా తనిఖీయడం జరిగింది. వారు తనిఖీ చేసిన తరువాత ముఖ్యమంత్రిగారి ముఖ్య కార్యదర్శిగారు, కమీషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్, ఎ.పి.ఎం.డి.సి మేనేజింగ్ డైరెక్టర్‌గారు తదితరులు సమావేశమై మళ్ళీ MECON వారు అడిగిన వివరాలను విపులంగా తెలియజేయడం జరిగింది. మనకు స్థలం సౌలభ్యం, నీటి సదుపాయం, రైల్వే, పోర్టు వంటి సౌకర్యాలన్నీ ఉన్నాయని వారికి స్పష్టంగా తెలియజేశాము. వారు రాతపూర్వకంగా ఇమ్మని కోరగా, జనవరి 12వతేదీ, 2018న వారికి రాతపూర్వకంగాక కూడా పంపించాము. ఆ తరువాత వాటన్నింటినీ పరిశీలించిన మీదట కేంద్ర మంత్రిగారికి వారి నివేదికను కూడా పంపించారు. త్వరలోనే జరిగే టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆ నివేదికలోని అంశాలు విశదమవుతాయి. రాష్ట్రప్రభుత్వం నుంచి ఏం చెయ్యాలో, ఏ విధంగా సిద్ధంగా ఉన్నామో, సదుపాయాలు వంటి అంశాలను స్పష్టంగా తెలియచేయడం జరిగింది. Feasibility Report వచ్చిన తరువాత కేంద్రప్రభుత్వం దీనిమీద సానుకూలంగా స్పందిస్తున్నామని ఆశిస్తున్నాను.

**MR CHAIRMAN:** Question No.10272 is postponed at the request of the Member.

## 2.సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు

**శ్రీ కత్తి నరసింహా రెడ్డి:** అధ్యక్షా, రాష్ట్రంలోని వివిధ శాఖల్లో సుమారు నలభై శాతం మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన ఐదురోజుల ప్రత్యేక సెలవులు విద్యాశాఖలో వలె పాలిటెక్నిక్ తదితర అన్ని శాఖలలో పనిచేసే మహిళలకు వర్తింపచేయాలని, బదిలీలల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీతంతో కూడిన రెండు నెలల ప్రసూతి సెలవును ఇచ్చేవిధంగా ఒప్పంద మహిళా ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగులకు తక్షణ ఉత్తర్వులు విడుదల చేయడంతోబాటు ఈ సౌలభ్యాన్ని అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్, గెస్ట్ తదితర పేర్లతో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అందరికీ వర్తింపచేయాలని ప్రత్యేక ప్రస్తావన ద్వారా ప్రభుత్వాన్ని కోరుచున్నాను.

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు(పట్టభద్రుల నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖలో 40 వేల మంది పైగా ఆశావర్కర్లు గత 12 సంవత్సరాలుగా గ్రామస్థాయిలో గర్భవతులు, బాలింతలు, పసిపిల్లల సంరక్షణతో పాటు 26 రకాల సేవలను ఏ విధమైన వేతనాలు లేకుండా, కేవలం అరకొర పారితోషికాలతో ప్రజలకు అందిస్తున్నామని, అవి కూడా సక్రమంగా చెల్లింపు జరుగుటలేదని పలు పర్యాయాలు ప్రభుత్వానికి విన్నవం చేసుకున్నా ఫలితం లేని నేపథ్యంలో ఈరోజు వేలాది మందితో ఛలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టారు.

కేరళ, కర్నాటక, హరియాణా, పశ్చిమ బంగా, రాజస్థాన్, త్రిపుర, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వాలు పారితోషికాలు, గౌరవ వేతనాలు చెల్లిస్తున్నాయి. మన రాష్ట్రంలో కూడా ఆశా వర్కర్లకు నెలకు రూ. 6000 గౌరవ వేతనము, పారితోషక బకాయిలు చెల్లింపు, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ప్రత్యేక ప్రస్తావన ద్వారా ప్రభుత్వం దృష్టికి తెస్తున్నాను.

**MR CHAIRMAN:** Now, Tea Break for 10 minutes.

(The House then adjourned at 11.19 a.m.)

**ఉ.** 11.30

(తేనీటి విరామానంతరం సభ ఉదయం గం.11.30 ని. లకు పునఃప్రారంభమయింది)

(గౌరవ అధ్యక్షులు అధ్యక్ష స్థానం వహించారు.)

**3.PRESENTATION OF ANNUAL FINANCIAL STATEMENT (BUDGET) FOR 2018-2019.**

MR. CHAIRMAN: Now, presentation of Annual Financial Statement (Budget) for 2018-19 by Dr P.Narayana, Minister for Municipal Administration and Urban Development.

(Later, with the permission of the Hon'ble Chairman, on behalf of Sri Yanamala Ramakrishnudu, the Hon'ble Minister for Finance, Dr P.Narayana, the Minister for Municipal Administration and Urban Development presented the Annual Financial Statement (Budget) for 2018-19 to the House.)

**మిస్టర్ ఛైర్మన్:** మంత్రిగారూ, మీరు గం.01.35 నిమిషాలు మాట్లాడారు. Congratulations.

01.00

**4.PRESENTATION OF AGRICULTURE AND ALLIED SECTORS BUDGET FOR 2018-2019 BY SRI PRATHIPATI PULLA RAO, MINISTER FOR FOOD AND CIVIL SUPPLIES, CONSUMER AFFAIRS AND PRICE MONITORING.**

MR. CHAIRMAN: Now, presentation of Agriculture and Allied Sectors Budget for 2018-2019 by Sri Prathipati Pulla Rao, Minister for Food and Civil Supplies, Consumer Affairs and Price Monitoring.

(అనంతరం, గౌరవ అధ్యక్షుల వారి అనుమతితో పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు మరియు ధరల నియంత్రణ శాఖా మాత్యులు శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు గారు – వ్యవసాయం, ఉద్యానవన, పట్టుపరిశ్రమ మరియు అగ్రి ప్రాసెసింగ్ శాఖామాత్యులు శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారి తరఫున, 2018–2019 సంవత్సరానికి సంబంధించిన వార్షిక వ్యవసాయ వ్యయ పట్టికను సభకు సమర్పించారు.)

**(పేజీ నెం.15 నందు " మండల జిల్లా స్థాయిలలో కార్యాలయ భవనముల ఏర్పాటు చేయుట కొరకు రూ.5 కోట్లను ప్రతిపాదించాము" పేరా తరువాత ఈ క్రింది పేరాలను చేర్చవలెను.)**

**మార్కెట్ ఇంటర్వెన్షన్:**

రాష్ట్ర ప్రభుత్వం పంట దిగుబడులను పెంచడానికి దృష్టి సారించడమే కాకుండా, రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర కల్పించే విషయంలో కూడా ప్రత్యేక దృష్టి పెట్టింది. 2016-2017 సంవత్సరంలో 89000 మెట్రిక్ టన్నుల కంది, 5175 మెట్రిక్ టన్నుల మినుములు, పెసలు కనీస మద్ధతు ధరతో రైతుల నుండి కొనుగోలు చేయడం మూలంగా, 2017-2018 సంవత్సరంలో అపరాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది.

ఇదేవిధంగా మొక్కజొన్న, వేరుశెనగ, వరి పంటలను రైతుల నుండి కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడం జరుగుతుంది. వాణిజ్య పంటలైన మిర్చి, పసుపు పంటలను కూడా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీము ద్వారా రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుండి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవడం జరిగింది.

2018-2019లో ఇందుకు గాను, రూ.500 కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీము క్రింద కేటాయించడం జరిగింది.

**MR.CHAIRMAN:** Very good. మంత్రి గారూ, మీరు 58 నిమిషాలు మాట్లాడారు. Now, the House is adjourned to meet again on Monday, the 12th March, 2018 at 10.00 a.m.

(The House then adjourned at 2.04 P.M. to meet again at 10.00 A.M. on Monday, the 12th March, 2018)

**గౌరవనీయ అధ్యక్షా! మరియు సభ్యులారా!**

తమ అనుమతితో 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలను సవినయంగా ఈ గౌరవ సభకు సమర్పిస్తున్నాను.

2. నా ఈ పదవ బడ్జెట్‌ను ఈ చారిత్రిక అమరావతిలో వరుసగా రెండవసారి సమర్పించే గొప్ప అవకాశం లభించడం నా సుకృతంగా భావిస్తున్నాను. గౌరవనీయ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో మన ప్రభుత్వ నిరంతర కృషి కారణంగా ప్రపంచం నలుమూలలా అమరావతిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అనేక సవాళ్ళ నడుమ కూడా పట్టుదల మరియు దృఢచిత్తంతో మనం సాధిస్తున్న పురోగతి ఒక ఆశాజనకమైన, ధైర్యాన్ని, విశ్వాసాన్ని కలిగిస్తుంది. ఈ సందర్భంలో నేను మన మాజీ రాష్ట్రపతి డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి స్ఫూర్తిదాయకమైన మాటలను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

***"Look at the sky. We are not alone.The whole universe is friendly to us and conspires only to give the best to those who dream and work"***

3. అధ్యక్షా, బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టే ముందు ప్రస్తుత పరిస్థితులను మననం చేసుకోవలసిన ఆవశ్యకత ఉంది.

4. అసమంజసంగా జరిగిన రాష్ట్ర విభజన వల్ల ప్రధాన ఆర్థిక ఆధారాలైన రాజధాని నగరం, ఆదాయం చేకూర్చే సేవారంగం వంటివి కొరవడిన పరిస్థితులలో, నాలుగు సంవత్సరాల కాలం, రాష్ట్ర పునఃనిర్మాణానికి చాలా తక్కువ సమయమే! కేంద్ర ప్రభుత్వంనుండి సకాలంలో అందని సహాయం సమస్యని మరింత జఠిలం చేసింది. కానీ, ఇప్పటి వరకు సాధించినది, మన ప్రయాణం ఎంత వరకు సాగింది, స్వల్ప, దీర్ఘకాలిక ప్రాధాన్యతల సమీక్షకు ఇది సరియైన సమయం.

5. మనలను చుట్టుముట్టిన సమస్యలవలయంలో కూడా ప్రభుత్వ దక్షత, సమర్థవంతమైన నాయకత్వం వలన రాష్ట్రాభివృద్ధికి పటిష్టమైన పునాదులు ఏర్పాడ్డాయన్న నా అభిప్రాయంతో గౌరవ సభ్యులందరు ఏకీభవిస్తారని భావిస్తున్నాను. సమస్యలకతీతంగా గత మూడు సంవత్సరాలలో మన రాష్ట్రం సగటున 10.96% రెండంకెల వృద్ధిని సాధించటం ఎంతో ముదావహం. భారతదేశ జాతీయ స్థాయిలో సగటు వృద్ధి 7.30% మాత్రమే. “దేశమంటే మట్టి కాదోయి, దేశమంటే మనుషులోయి”, అన్న మహాకవి గురజాడ అప్పారావుగారి పలుకులతో ఉత్తేజితులై కష్టానికి ఓర్చి నిలబడే వివేకవంతులు, విద్యావంతులు, ఔత్సాహికులైన రాష్ట్ర ప్రజానీకం అందించే సహాయ సహకారాలు శ్లాఘనీయం.

6. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరచిన హక్కులను, రాజ్యసభలో ఆనాటి గౌరవనీయ ప్రధానమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న ఉదాసీనత ఇప్పటికే తీవ్ర లోటుతో సతమతమౌతున్న అభివృద్ధిగతిపై ప్రభావం చూపుతుంది. ఒక నిశ్చితమైన దృక్పథంతో నిర్దిష్ట విధానాన్ని అనుసంధానించటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ పరిస్థితులను ఎదుర్కొంది. నిస్పృహ నుండి ఆశకు, భ్రమల నుండి విశ్వాసానికి, నిరాదరణ నుండి అభివృద్ధి

దిశగా మనం కొనసాగుతున్నాము. సమర్థవంతమైన వనరుల సమీకరణ, ప్రభావవంతమైన వనరుల యాజమాన్యం, వనరుల కేటాయింపులో ఏకీకరణ విధానం, సాంకేతిక ప్రయోజనాలను విరివిగా ఉపయోగించుకోవటం ద్వారా ఇది సాధ్యపడింది. దీనివల్ల వివిధ ప్రభుత్వ విభాగాలలో జవాబుదారీతనం, పారదర్శకత ఏర్పడింది. అవిశ్రాంత కృషి, స్వాభావిక అనుకూలతలతో రాష్ట్ర ప్రజల వ్యవస్థాపక సామార్థ్యాలు సమ్మిళతమై మన శక్తి సామార్థ్యాలపై ఒక దృఢమైన నమ్మకం ఏర్పడింది. ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలచుకొన్నాము. కేంద్ర ప్రభుత్వం ఉదాసీనత కనపరచకుంటే మరింత వృద్ధి, ప్రగతిని సాధించగలిగే వారమే!

7. హామీలు అమలు అయ్యేదాకా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఇతర రాష్ట్రాలతో సమానంగా నిలిచే వరకు మనం పట్టుదలతో పోరాడదాం. ఈ తరుణంలో జాతిపిత మహాత్మాగాంధిగారి ఆలోచనల నుండి నేను ఉత్తేజాన్ని పొందుతున్నాను.

***"When you go through hardships and decide not to surrender, that is strength"***

8. కేంద్రం నుండి స్పందన కరువైనప్పటికీ, మా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, 2022 సంవత్సరానికి దేశంలో ఉత్తమ రాష్ట్రంగా, 2029 నాటికి ప్రపంచలోనే ఉత్తమ రాష్ట్రంగా, అంతిమంగా 2050 నాటికి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించే కేంద్రంగా రూపొందించడానికి కట్టుబడి ఉంది. మన గమ్యం చేరుకోవడానికి ప్రభుత్వం ఒక పంథాను గ్లోబల్ బెంచ్ మార్కింగ్‌కు అనుసంధానం చేసి రూపొందించిన మార్గాన్ని అట్టడుగు స్థాయి నుండి అమలు పరుస్తుంది.

9. **ప్రజలే ముందు.** ఇది మా ప్రధాన నినాదం. సంక్షేమానికి తగు ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన సమ్మిళితమైన పరిపూర్ణత చేకూరుతుందనే నమ్మకంతో 2018–19 బడ్జెట్ కేటాయింపులలో సంక్షేమ రంగానికి పెద్ద పీట వేస్తున్నాను. ఉజ్వలమైన సమసమాజాన్ని ఏర్పరచగలిగే ఈ సంక్షేమాధారిత ప్రజా బడ్జెట్ మెరుగైన సామాజిక క్రమాన్ని నెలకొల్పాలనే మా ప్రభుత్వ తపనను నెరవేరుస్తుందని నేను ఆశిస్తున్నాను. రాష్ట్ర నలుమూలల నుండి వివిధ కుంటుంబాల అభిప్రాయాలను పరిగణించి, వివిధ వర్గాల ఆకాంక్షలను గుర్తించి ప్రభుత్వం తగువిధమైన పథకాల ప్రమేయంతో అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఈ పథంలో కొన్ని కార్యక్రమాలు–

- బలహీన వర్గాలైన ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిలు మరియు మైనారిటీల జీవనోపాధి వృద్ధితోపాటు కాపులు (తెలగ/బలిజ/ఒంటరి సహా); బ్రాహ్మణులు, వైశ్యులు, క్రిస్టియన్‌లు మరియు ఇతర ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం;
- చేనేత కార్మికులు, మత్సకారులు, యాదవులు, రజకులు, దూదేకులు, కళాకారులు మరియు సాంప్రదాయక వృత్తులవారి ఆర్థిక మెరుగుదల;
- నాయీ బ్రాహ్మణ, వడ్డెర, భట్రాజ, సాగర/ఉప్పర, వాల్మీకి/బోయ, కృష్ణబలిజ/పూసల, మేదర, విశ్వబ్రాహ్మణ, కుమ్మరి, సాలివాహన మరియు కల్లుగీత తరగతులవారికి జీవనాధార సహాయం;
- అట్టడుగునకు నెట్టబడ్డ నిరాదరణకు గురైన హిజ్రాల అభ్యున్నతి.

- వికలాంగులకు చేయూతనిచ్చి వారిలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, కలిగించుట;
- మహిళలు, శిశువులకు మెరుగైన పోషక విలువలతో కూడిన ఆహారం మరియు స్వయం సేవక సంఘాల ఆర్థిక వృద్ధి;
- ఆరోగ్య నిమిత్త ఖర్చు తక్కువ అయ్యే విధంగా కుదింపు;
- యువతకు ఆర్థికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధితో కూడిన సాధికారత మరియు జీవనోపాది వృద్ధి;
- రైతుల సంక్షేమానికి తోడ్పడే జలవనరులు మరియు వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుసంవర్ధకం, మత్యపరిశ్రమ, ఉద్యాన రంగాలకు ఆర్థిక తోడ్పాటు;
- పట్టు పరిశ్రమకు ఆర్థిక తోడ్పాటు;
- వాస్తవిక, డిజిటల్ తరగతుల ద్వారా భవిష్యత్ తరాలకు జ్ఞాన సంపదను అందచేయుట, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పోషక ప్రమాణాలు, పరిశుభ్రత పెంపొందించే సహాయం, అమ్మాయిల సాధికారత కొరకు నిర్దిష్ట పథకాలు, మధ్యాహ్న భోజనంలో అధిక పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని అందచేయడానికి డైట్ చార్జీలు పెంపు; మరియు
- క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక రంగాల ఉన్నతికై చేయూత.

స్థూలప్రణాళికలు, సూక్ష్మ అమలు అనే విధానముతో నేను ప్రవేశపెట్టే వివిధ పథకాలు

మా ప్రభుత్వ ఉద్దేశాలను ద్విగుణీకరిస్తాయని నా గట్టినమ్మకం. బెంజిమెన్ డిశ్రాయలీ చెప్పినట్లు –

మా ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా స్థిరమైన అభివృద్ధి, కుటుంబ వికాసం, సమాజ వికాసంను పెంపొందించి సమాజంలోని అన్ని వర్గాల సాధికారతకు, శ్రేయస్సుకు, ఆనందానికి ఈ బడ్జెట్ తోడ్పాటునిస్తుందని బలంగా నమ్ముతున్నాను.

10. 2018–19వ సంత్సరానికి నేను రెవిన్యూ మిగులుతో బడ్జెట్‌ను ప్రతిపాదిస్తుండటం ఇక్కడ గమనించదగ్గ ముఖ్య అంశం. సాధ్యమైన ఆదాయ వనరులను మదింపు చేసి, కేంద్ర ప్రభుత్వం నుండి విభజన చట్ట ప్రకారం రావలసిన అన్ని బకాయిలు అందుతాయనే ఆకాంక్షతో ఇది సాధ్యపడింది. అంతేకాక, రెవిన్యూ పద్దులపై ఖర్చులను తగు రీతిలో ఉంచి కేపిటల్ పద్దుపై ఖర్చులను పెంచడానికి దృష్టి సారించాను.

11. ప్రస్తుత పరిస్థితులలో, అందుబాటులో ఉన్నవనరులను అంచనాలతో, ప్రాధాన్యతలతో సంతులించటం కష్టమైన చర్య. కావున, వివిధ వర్గాలను కలుపుకొని నేను ప్రతిపాదిస్తున్న బడ్జెట్ పద్దులు యొక్క ప్రాముఖ్యతను అభినందించగలరని భావిస్తున్నాను.

**సంక్షేమం.**

అమెరికన్ తత్వవేత్త జాన్ రాల్స్ మాటల నుండి ప్రేరణ పొందుతున్నాను.

***"A just society is a society that if you knew everything about it, you would be willing to enter it in a random place"***

12. సమాజంలోని అన్ని వర్గాల జీవనాన్ని మెరుగుపరచడమే మా ప్రభుత్వ పథకాల ముఖ్యోద్దేశం. బలహీన వర్గాలవారి సమస్యల విషయంలో, నేటి దాకా అమలుచేస్తున్న కార్యక్రమాలను వేగవంతం చేయడమే కాక, కార్యక్రమాలపరంగా సమ్మిళతం చేసి మెరుగైన అనుసంధానం - సమాచార వ్యవస్థ: ఆర్థికాభివృద్ధి - మెరుగైన జీవన పరిస్థితులు: గుణాత్మక విద్య–శిక్షణ: నైపుణ్యాభివృద్ధి– ఉద్యోగ కల్పన: పౌష్టికాహార–ఆరోగ్య రక్ష: వంటి ప్రజల భాగస్వామ్యంతో పరిపూరక అభివృద్ధి, సాంకేతికతను ప్రభావ వంతంగా వినియోగించుకొనుట రాష్ట్ర ప్రభుత్వం విధానం.

13. సంక్షేమం ఒక్కసారి అందించే సహాయం కాదు. జీవితంలో వివిధ దశలలో నిర్ధిష్ట అవసరాలు తీర్చే ప్రక్రియ. ప్రభుత్వం వివిధ బలహీన వర్గాలకు రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ప్రీ–పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పోటీ పరీక్షల తయారీకి అభ్యర్ధులకు అధ్యయన కేంద్రాలు, విదేశీ విద్యకోసం సహాయం, భూమిలేని వారికి భూమి, ఇల్లులేనివారికి ఇల్లు, అవసరమైనవారికి వస్త్రాలు, ఆకొన్నవారికి ఆహారం, జీవనోపాధి అభివృద్ధికి ఆర్థిక మద్దతు, వివాహాల వంటి సాంఘిక కార్యక్రమాల కోసం సహాయం, వైద్య సహాయం, సాధారణ–జీవిత బీమా, పెన్షన్‌లు వంటి కార్యక్రమాలు అమలు చేస్తుంది.

14. ఇప్పటికే మా ప్రభుత్వం అల్పసంఖ్యాక వర్గాలకు, ఎస్‌టి కులాలకు చెందిన వధువుల కోసం, దుల్హన్, గిరిపుత్రిక కళ్యాణ పథకాల క్రింద సహాయం అందచేస్తుంది. ఇకనుండి ఎస్‌సి, వెనుకబడిన తరగతులకు చెందిన వధువులకు కూడా సహాయం అందచేయడానికి చంద్రన్న పెళ్ళికానుక పథకం ద్వారా ఈ బడ్జెట్‌లో నేను షెడ్యూల్డ్‌కులాలవారికి, వెనుకబడిన తరగతులకు చెరో వంద కోట్లు చొప్పున ప్రతిపాదిస్తున్నాను.

**వెనుకబడిన తరగతులు**

మహాత్మా జ్యోతీబా ఫూలే మాటలు ఈ సందర్భంగా మననం చేసుకుంటున్నాను

***"Without education wisdom was lost; without wisdom morals were lost; without morals development was lost; without development wealth was lost; without wealth the shudras were ruined; so much has happened through lack of education"***

15. వెనుకబడిన తరగతుల విద్యార్థుల విషయంలో విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి మేము తీవ్రంగా కృషి చేస్తున్నాము. ప్రీ, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు, ట్యూషన్ ఫీజువాపసుకు, ఎన్‌టిఆర్ విద్యోన్నతికి, ఎన్‌టిఆర్ విదేశీ విద్యాదరణ, హాస్టల్, రెసిడెన్షియల్ పాఠశాలలకు, దాదాపు 16 లక్షల విద్యార్థులకు లబ్ధిని చేకూర్చే విధంగా బిసి స్టడీ సర్కిల్ వంటి పథకాలకు గతంలో కేటాయించిన రూ.1,732 కోట్లపై 25% పెంపు చేస్తూ రూ.2,165 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. అదేవిధంగా కాపు సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు రూ.400 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. ఆర్థికంగా వెనుకబడిన కులాలకు చెందిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజుకై రూ.700 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

16. నిరంతరం ఆదాయం పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకొనుటకు వీలుగా, అత్యాధునిక పరికరాలు సమకూర్చుకొనుటకు వెనుకబడిన తరగతులకు చెందిన చేతివృత్తులవారికి ఆదరణ పథకం రాష్ట్రం అంతటా ద్వారా ఆర్థిక సహాయంచేయాలని సంకల్పించాం. దీని ద్వారా 2,55,000 మంది లబ్ధిపొందుతారు. ఈ పథకం అమలుకు నేను ఈ బడ్జెట్‌లో రూ.750 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

17. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులను రూ.3,316 కోట్ల నుండి రూ.4,477 కోట్లకు అనగా 35% పెంపును ప్రతిపాదిస్తున్నాను. దీనితో పాటుగా వైశ్యుల సంక్షేమంకోసం రూ.30 కోట్లు, కాపుల సంక్షేమంకోసం రూ.1,000 కోట్లు కేటాయించడమైనది.

18. చేనేత పనివారు సాంప్రదాయక నైపుణ్యాన్ని కలిగి ఉన్నారు. కాని ఆధునిక సాంకేతికతో వారు పోటీ పడలేకపోతున్నారు. ప్రభుత్వం వీరు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడానికి, వీరి సంక్షేమానికి కట్టుబడి ఉంది. ఇందుకుగాను వీరు ఉత్పత్తి చేసే వస్త్రాలన్నింటిని సేకరించి వాటిని నిరుపేదలకు అవసరమైనవారికి 50% సబ్సిడీపై జనతా వస్త్రాలుగా సరఫరాచేయాలని నిర్ణయించాము. ఈ పథకానికి, ఇతర సంక్షేమ పథకాలకు ప్రస్తుత కేటాయింపులను దాదాపు 10 రెట్లు పెంచుతూ రూ.200 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. అంతేకాక పట్టునేత పనివారికి నూలుకొనుగోలుపై రాయితీ కొరకు నేను రూ.42 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

19. సాంప్రదాయ మత్స్యకారులకు, ఇన్‌లాండ్ మరియు మెరైన్ మత్స్యకారుల ఆదాయం పెంచడానికి మరియు వారి జీవనోపాధి మెరుగుపర్చడానికి, సబ్సిడీ రేట్లపై వారికి మర పడవులు, వలలు, డీజిల్ అందించే యోచనవుంది. ఈ బడ్జెట్‌లో

ప్రస్తుత కేటాయింపు రూ.12 కోట్ల రూపాయల నుండి 6 రెట్లకు పైగా రూ.77 కోట్ల పెంపుకు ప్రతిపాదిస్తున్నాను. మత్స్యకారుల కష్టములను గుర్తించి 50 సంవత్సరముల పైబడిన మత్స్యకారులకు సామాజిక భద్రత పింఛన్‌ను ప్రతిపాదిస్తున్నాను.

20. గ్రామాలలో, పట్టణాలలో రజకులకు వారి సాంప్రదాయ వృత్తి కొనసాగించటం కష్టమవుతోంది. మౌలిక సదుపాయాలు కలుగచేసి వారి జీవనాధారం మెరుగుపర్చటానికి ఆధునిక వృత్తిపరమైన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొనడానికి కేటాయింపును రూ.70 లక్షల నుండి రూ.70 కోట్లు అంటే వంద రెట్లు పెంపు ప్రతిపాదిస్తున్నాను.

21. దూదేకుల కులంవారు ఆధునిక వృత్తిపరమైన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొనడానికి కేటాయింపును రూ.2 కోట్ల నుండి 20 రెట్లు పెంచుతూ రూ.40 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

22. నాయీ బ్రాహ్మణులకు ఆధునిక వృత్తిపరమైన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొనడానికి కేటాయింపును రూ.85 లక్షల నుండి 35 రెట్లు పెంచుతూ రూ.30 కోట్లుగా ప్రతిపాదిస్తున్నాను.

23. ఆంధ్రప్రదేశ్ అత్యంత వెనుకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి సంస్థకు ఆర్థిక సహాయాన్ని రూ.60 కోట్ల నుండి రూ.100 కోట్ల గణనీయమైన పెంపును ప్రతిపాదిస్తున్నాను.

24. వివిధ వెనుకబడిన తరగతులకు జీవనోపాధి కోసం కేటాయింపులను గణనీయంగా పెంచుతూ దిగువ పేర్కొన్న విధంగా ప్రతిపాదిస్తున్నాను.

కల్లుగీత కార్మికులకు రూ.35 కోట్ల నుండి రూ.70 కోట్లు

వాల్మీకి/బోయలకు రూ.25 కోట్ల నుండి రూ.50 కోట్లు

వడ్డెరలకు రూ.25 కోట్ల నుండి రూ.50 కోట్లు

విశ్వబ్రాహ్మణులకు రూ.30 కోట్ల నుండి రూ.50 కోట్లు

సాలివాహనులకు రూ.30 కోట్ల నుండి రూ.50 కోట్లు

సాగర/ఉప్పరలకు రూ.25 కోట్ల నుండి రూ.40 కోట్లు

మేదరలకు రూ.20 కోట్ల నుండి రూ.30 కోట్లు

కృష్ణబలిజ/పూసలకు రూ.20 కోట్ల నుండి రూ.25 కోట్లు

పై కేటాయింపులతో బిసి ఉపకార్యాచరణ పథకానికి మొత్తం కేటాయింపులు రూ.10,000 కోట్ల నుండి 20% వృద్ధితో రూ.12,200 కోట్లకు గణనీయంగా పెరిగాయని తెలియచేయడానికి మహదానంద పడుతున్నాను.

**సాంఘిక సంక్షేమం**

ఈ సందర్భంలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ మాటలను మననం చేసుకుంటున్నాను.

***"Equality may be a fiction but nonetheless one must accept it as a governing principle"***

25. నాణ్యమైన విద్యద్వారా షెడ్యూల కూలాల సాధికారికతకు ప్రభుత్వం 1,067 సాంఘిక సంక్షేమ హాస్టల్లో 97,930 విద్యార్థుల వసతికి, విద్యాభ్యాసానికి వీలుకలిగిస్తోంది. అంతేకాక ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్

సొసైటీ ద్వారా 188 విద్యాసంస్థలు 1,07,597 మంది విద్యార్థులకు విద్యనందించింది. ఇవి మంచి ఫలితాలను అందచేస్తున్నాయి. నేను ఈ సొసైటీ కేటాయింపును 40% అనగా రూ.749 కోట్లను రూ.1,050 కోట్లకు పెంపు ప్రతి పాదిస్తున్నాను.

26. షెడ్యూల కూలాల సాధికారత విషయంలో దృష్టి సారించవలసిన మరో కోణం పేద షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం. దుర్బల వర్గాలకు అందించే ఆర్థిక మద్దతు పథకాలలో సబ్సిడీకి నేను రూ.901 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

27. ఎండకు, వానకు, చలికి ఎదురునిలిచి రోడ్లప్రక్కన చర్మకారులు, పాదరక్షలను బాగుచేయడం మనం తరచు చూస్తూఉంటాము. చర్మకారులకు జీవనోపాధిని, వారి నైపుణ్యాన్ని పెంచుకోవడానికి సహాయం అందించాలని మా ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకుగాను నేను ఈ బడ్జెట్‌లో రూ.60 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. దీనికి తోడు చిన్నతరహా తోలు పరిశ్రమలు ఏర్పాటుచేయడానికి లిడ్‌క్యాప్ సంస్థకు రూ.40 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. అలాగే డప్పు కళాకారుల పెన్షన్ల కొరకు రూ.12 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

28. అన్నింటికి మించి, షెడ్యూల కులాల సర్వతోముఖివృద్ధికి, సాధికారతకు ఎస్‌సి కాంపోనెంట్ అమలుచేస్తున్నాము. 2017-18 సంవత్సరంలో ఈ కాంపోనెంట్ క్రింద రూ.9,847 కోట్లను 22 శాఖలకు కేటాయించడమైనది. మౌళిక సదుపాయలలో అంతరాలను తొలగించడానికి షెడ్యూల్డ్ కులాల ఆవాసాలను అనుసంధానించడానికి, 250 కంటే జనాభా కలిగి అనుసంధానంలేని ఎస్‌సి

ఆవాసాలను కలుపుతూ 446 రహదారులను రూ.452 కోట్లతో నిర్మించడానికి అనుమతులు మంజూరైనవి. అదేవిధంగా 1,005 షెడ్యూల్డ్ కూలాల ఆవాసాలలో రక్షిత మంచినీటి పథకానికి రూ.226 కోట్లు మంజూరైనవి. ఈ బడ్జెట్‌లో మొత్తం ఎస్‌సి కాంపోనెంట్ కేటాయింపును 14% పెంచుతూ రూ.11,228 కోట్లకు ప్రతిపాదిస్తున్నాను.

**గిరిజన సంక్షేమం**

29. బహుళ ప్రయోజన విధానం ద్వారా షెడ్యూల్ తెగ కుటుంబాలకు సాధికారం సిద్ధించాలనే లక్ష్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. 44,365 గిరిజన విద్యార్థులు 1వ తరగతి నుండి ఇంటర్‌మీడియట్ వరకు 184 గురుకులాలలో చదువుతున్నారు. విద్యానాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం 179 హాస్టళ్ళను, 80 రెసిడెన్షియల్ స్కూల్స్‌గా, 30 ఆశ్రమ పాఠశాలలుగా మార్చింది. 14,923 ఎస్‌టి విద్యార్థులు రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ విధానంలోకి వచ్చారు. రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణానికి నేను బడ్జెట్ కేటాయింపును రూ.100 కోట్ల నుండి 2018-19 సంవత్సర బడ్జెట్‌లో రూ.250 కోట్లకు పెంపు ప్రతిపాదిస్తున్నాను. అదేవిధంగా గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం ప్రస్తుత కేటాయింపు రూ.524 కోట్ల నుంచి రూ.670 కోట్లకు పెంపు ప్రతిపాదిస్తున్నాను. షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహాయానికి, నైపుణ్య పెంపు కార్యక్రమాలకు రూ.262 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

30. గిరిజన ప్రాంతాలలో స్థిరమైన బ్రాడ్‌బాండ్ అనుసంధానం దొరకని కారణంగా, సామాజిక ఆర్థికాభివృద్ధికి ప్రామాణికమైన డిజిటల్ విప్లవం గిరిజన ప్రాంతాలకు చేరటంలేదు. 2018-19 సంవత్సరంలో అత్యాధునిక ట్రిపుల్ ప్లే

సర్వీసులను గిరిజన ప్రాంతాలలో అన్ని పంచాయితీలకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకుగాను వయబులిటి గ్యాప్ సహాయంగా నేను రూ.90 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

31. నేను గిరిజనులకు పోషకాహారాన్ని సమకూర్చుటకు ఫుడ్ బాస్కెట్‌లను రూ.40 కోట్లతో ప్రతిపాదిస్తున్నాను. ఐటిడిఎలలో మార్కెటింగ్ మరియు స్టోరేజ్, మౌలిక సదుపాయాల కల్పన మరింత బలోపేతం చేయడానికి రూ.50 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

32. 2014–15 నుండి 2017–18 వరకు ఎస్‌టి ఉపపథకం క్రింద రూ.10,033 కోట్ల కేటాయింపు జరిగింది. గిరిజన నివాసాలలో మౌలిక అభివృద్ధి కోసం ఎస్‌టి కాంపోనెంట్ క్రింద, ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం 1,057 అవాసాలలో రూ.156 కోట్లతో రక్షిత త్రాగు నీటి కొరకు, పల్లె రహదారుల అనుసంధానానికి 2,871 కిలోమీటర్ల మేర 1,534 రహదారుల పనులను రూ.863 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టడమైంది. 2018–19 సంవత్సర ఎస్‌టి కాంపోనెంట్ క్రింద కేటాయింపును 18% పెంచుతూ రూ.3,528 కోట్ల రూపాయల నుండి రూ.4,176 కోట్ల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**అల్పసంఖ్యాక వర్గ సంక్షేమం**

ప్రఖ్యాత ఆంగ్ల చరిత్రకారుడైన జాన్ డాల్బర్గ్–యాక్టన్ ఇలా అన్నారు.

***"The most certain test by which we judge whether a country is really free is the amount of security enjoyed by minorities"***

33. అల్పసంఖ్యాక వర్గాల ఉన్నతికీ, సంక్షేమానికీ మా ప్రభుత్వం శ్రద్ధ

చూపుతుంది. ప్రస్తుత, కొత్త పథకాల ద్వారా ఆర్థిక కార్యకలాపాలలో, ఉద్యోగాలలో వారికి సమానమైన వాటా దక్కేలా చూస్తోంది. స్వయం ఉపాధికి, ఆర్థికంగా నిలదొక్కుకొనడానికి, సాంకేతిక శిక్షణ ద్వారా వారి నైపుణ్యం మెరుగుపరుచుకోడానికి మా ప్రభుత్వం అధిక ఋణాలను మంజూరుచేస్తుంది. విదేశీ విద్య పథకాలు అల్పవర్గాల విద్యార్థులకు, ఒక్కొక్క విద్యార్థికి రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం అందచేస్తోంది. 2018–19కి ఈ పథకం క్రింద కేటాయింపును రూ.5 కోట్ల నుండి రూ.30 కోట్లకు పెంచుతూ ప్రతిపాదిస్తున్నాను. దుల్హన్ పథకానికి రూ.60 కోట్ల నుండి రూ.80 కోట్లకు పెంచుతూ ప్రతిపాదిస్తున్నాను. ఇమామ్స్‌కు, మౌజమ్స్‌కు ప్రోత్సాహకాల కేటాయింపును మూడు రెట్లు వృద్ధితో రూ.24 కోట్ల నుండి రూ.75 కోట్లకు పెంచి ప్రతిపాదిస్తున్నాను. బ్యాంక్‌లతో అనుసంధానం చేస్తూ ఆదాయ వనరులు చేకూరే పథకాలకు బడ్జెట్ కేటాయింపును రూ.100 కోట్ల నుండి రూ.150 కోట్లకు పెంచుతూ ప్రతిపాదిస్తున్నాను. క్రిస్టియన్ మైనారిటీల కేటాయింపును రెట్టింపు చేస్తూ రూ.35 కోట్ల నుండి రూ.75 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. మొత్తంగా అల్పవర్గాల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపును రూ.840 కోట్ల నుండి రూ.1,102 కోట్లకు 31% పెంపును ప్రతిపాదిస్తున్నాను.

**మహిళా, శిశు, వికలాంగులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమం**

డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఇలా అన్నారు.

***"I measure the progress of a community by the degree of progress which women have achieved"***

34. మహిళలు ప్రగతిలోను, అభివృద్ధిలోను, రక్షణలోను, మానవ హక్కుల పొందడంలోను, ఎటువంటి వివక్షకు గురికాకుండా వారి హక్కులను పరిరక్షించటానికి,

వారి అక్కరలను తీర్చడానికి ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటుంది. మానవాభివృద్ధి సూచికల ప్రకారం మహిళల జీవనాన్ని పెంపొందించడానికి మేము కట్టుబడి ఉ న్నాము. ఐసిడిఎస్, ఐసిపిఎస్, ఎస్ఎన్‌పి, ఎవిహెచ్, గిరి గోరు ముద్దలు, సబల వంటి పథకాలను మహిళా శిశు సంక్షేమానికై మా ప్రభుత్వం అమలుచేస్తోంది.

35. పోషకాహార లోపాన్ని సరిద్ధిటానికి ప్రభుత్వం అధిక శ్రద్ధ చూపుతుంది. పోషకాహార లోపంగల పిల్లలకు, తల్లులకు ప్రత్యేక పోషకాహార పథకానికి రూ. 383 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. ఐఎంఆర్, ఎంఎంఆర్, సూచికల తగ్గుదల పరచడానికి అన్న అమృత హస్త పథకాన్ని 107 నుండి అన్ని 257 ఐసిడిఎస్ ప్రాజెక్టులను విస్తృతపరుస్తున్నాము. పోషకాహార పథకం అమలు ప్రసుత్త కేటాయింపును దాదాపుగా రెట్టింపు చేస్తూ రూ. 523 కోట్ల నుండి రూ. 1,016 కోట్ల పెంపుకు ప్రతిపాదిస్తున్నాను.

36. 11 నుండి 18 ఏళ్ళ, కౌమార దశలో బాలికలకు జీవన విధాన నైపుణ్యాలు, పోషకాహార, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమైన అంశాలు. ఈ అంశాలను సబల పథకం పరిపూర్ణ పద్ధతిలో చేపడుతుంది. ప్రస్తుతం, ఈ పథకం నాలుగు జిల్లాలలో అమలు చేయబడుతోంది. ఈ పథకాన్ని శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, ప్రకాశం, కర్నూలు, కడప జిల్లాలకు విస్తరిస్తున్నాము. ఈ పథకానికి నేను రూ. 60 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

37. ఋతుస్రావ సమయంలో కౌమార వయసు బాలికలకు వారి తల్లి దండ్రులకు సంకోచం ఉంటుంది. ఈ సంకోచం సాధారణ కార్యకలాపాలకు, తరగతుల హాజరుకు, ఆటపాటలలో పాల్గొనడానికి అవరోధమవుతుంది. ఇది బాలికల చదువులో వెనుకబాటుతనానికి దారితీస్తుంది. ఈ ఇబ్బందులను అధిగమించడానికి, పరిశు

భ్రతను ప్రోత్సహించేందుకు ఉన్నత పాఠశాలలు మరియు ఇంటర్‌మీడియట్ కళాశాలలోని కౌమార బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమానికై నేను రూ. 27 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. అదేవిధంగా ఎస్‌హెచ్‌జి మహిళలకు మరియు ఇతర కౌమార బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు అందించడానికై రూ. 100 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

38. దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాము. వారికి ఇచ్చే ఉపకార వేతనాలు రెట్టింపు అయ్యాయి. ప్రభుత్వం, వెన్నెముక గాయాల చికిత్సా కేంద్రాన్ని, బధిరుల కోసం కళాశాలలను ఏర్పాటు చేయుచున్నది. కృత్రిమ అవయవాలు ఏర్పాటు చేసే కార్యక్రమానికి ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ. 13 కోట్ల నుండి రూ. 35 కోట్లకు పెంచుటకు ప్రతిపాదించడమైనది. అదేవిధంగా ఆర్థిక పునరావాసానికి, ప్రస్తుతం కేటాయింపు రూ. 9 కోట్లపై మూడు రెట్లుకన్నా ఎక్కువగా రూ. 30 కోట్లు ప్రతిపాదించడమైనది. దివ్యాంగుల సంక్షేమానికి మొత్తం కేటాయింపులను 36% వృద్ధితో రూ. 121 కోట్లకు పెంచుతున్నాను. కుటుంబంలో ఉన్న అందరి దివ్యాంగులకు ఎటువంటి సంఖ్యా పరిమితులులేకుండా పెన్షన్లు ఇవ్వడానికి ప్రతిపాదిస్తున్నాను.

39. హిజ్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి అవగాహన ఉన్నది. వారిలో ఎక్కువ మంది యాచన ద్వారా తమ జీవనాన్ని సాగిస్తున్నారు. హిజ్రాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, వారు గౌరవప్రదమైన జీవనం సాగించటానికి ఒక విధానాన్ని రూపొందించాము. దీనికి మద్దతుగా రూ. 20 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

40. మహిళలు, శిశువులు, దివ్యాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖకు ప్రస్తుతం కేటాయించిన రూ.1,773 కోట్లపై 70% పెంచుతూ రూ.3,008 కోట్లు కేటాయింపు ప్రతిపాదించడమైనది.

**యువజనాభ్యుదయం**

స్వామి వివేకానంద సూక్తిని విన్నవిస్తున్నాను.

***"A brave, frank, clean-hearted, courageous and aspiring youth is the only foundation on which the future nation can be built"***

41. యువకుల శక్తియుక్తులను క్రమపద్ధతిలో నియంత్రిస్తూ వారిని నిర్మాణాత్మక కార్యకలాపాలలో పాల్గొనేటట్లు చేయడానికి, వారి సాధికారితకు, పురోగతికి, ప్రభుత్వం సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ 2029 డాక్యుమెంట్‌కు అనుసంధానిస్తూ యువజన విధానాన్ని రూపొందిస్తోంది. దీనికి నేను రూ.1000 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. అదనంగా యువజన సంక్షేమ పథకాలకు రూ.305 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

42. యువజనాభ్యుదయానికి గత కేటాయింపు రూ.778 కోట్ల పై 68% వృద్ధితో రూ.1,307 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**క్రీడలు**

43. క్రీడలద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని ఏర్పరుచుటకు సమగ్ర క్రీడావిధానం 2017-22 రూపకల్పన మన ముఖ్యమంత్రిగారి ప్రగాఢ ఆకాంక్ష. బాలబాలికలను, యువజనులను క్రీడలపై ఆసక్తికలిగించడానికి, ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి తద్వారా అన్ని విధాల రాష్ట్రంలో ఆనందపు సూచికలు పెంపొందించడానికి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్రాలను

నిర్మిస్తున్నాము. శిక్షణా శిబిరాలు, పోటీలు మరియు ఫిజికల్ డైరెక్టర్లకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ఓరియంటేషన్ కోర్సులు నిర్వహించడానికి ప్రణాళికలు నిర్వహిస్తున్నాము. జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో క్రీడాకారులు అత్యున్నత ప్రమాణాలు చూపడానికి, బాలబాలికలకు ఆరు అకాడమీలు, ప్రతి ఒక్క అకాడమీకి 150 మంది చొప్పున ఏర్పరిచాము. 13 జిల్లాల నుండి ఎంపికచేసిన 303 ప్రభుత్వ పాఠశాలల్లో స్పోర్ట్స్ ఎడాప్టెడెట్ స్కూల్ ప్రొగ్రామ్‌ను ఏర్పాటు చేస్తున్నాము. పి.వి. సింధు, కిడాంబి శ్రీకాంత్, రాగాల వరుణ్, జ్యోతికశ్రీ, సంతోషి వంటి క్రీడాకారులు, వాలీబాల్, బాస్కెట్‌బాల్ జట్లు, రాష్ట్రానికి ఎనలేని కీర్తి ఆర్జించారు. శ్రీ అజయ్ కుమార్ రెడ్డి సారథ్యంలో భారత అంధుల క్రికెట్ జట్టు ప్రపంచ కప్‌ను సాధించింది.

44. ఫిజికల్ లిటరసీ కార్యక్రమాలకు రూ.50 కోట్లు కేటాయిస్తున్నాను.

45. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి 2017-18 కేటాయింపు రూ.211 కోట్ల కంటే 42% అదనంగా రూ.300 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**గృహనిర్మాణం**

46. 2022 నాటికి ప్రతి ఒక్కరికి పక్కాఇల్లు కట్టించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పిస్తోంది. ఫిబ్రవరి 2018 నాటికి 2,70,000 ఇల్లు పూర్తి అయ్యాయి. ప్రధాన మంత్రి అవాస్‌యోజన అనుసంధానంతో ఎన్‌టిఆర్ అర్బన్ హౌసింగ్ క్రింద 1,25,000 ఇల్లు నిర్మాణంలో ఉన్నాయి. మరో 4,50,000 ఇళ్ళు ఎన్‌టిఆర్ రూరల్ హౌసింగ్ క్రింద వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి.

47. ఎన్‌టిఆర్ గృహనిర్మాణ పథకానికి పూర్వం, పూర్తికాని 2,00,000 ఇళ్లకు, ప్రతి ఇంటికి అదనముగా రూ.25,000/- చొప్పున నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం మంజూరుచేసింది. ఇప్పటికి 31,602 ఇళ్ళు పూర్తిచేయడమైనది.

48. 2022 నాటికి పట్టణ ప్రాంతాలలో ప్రతి బీదవానికి పక్కా ఇల్లు ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 9,00,000 ఇళ్ళను నిర్మిస్తుంది. దీనికిగాను ఎపిటిడ్‌కొ సంస్థకు ఋణాలు తీర్చడానికి రూ. 1,000 కోట్లు గ్రాంట్ ప్రతిపాదించడమైనది.

49. అవసరం ఉండి అర్హులైన ప్రతీవారికి ఇళ్ళస్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం దృఢనిశ్చయంతో ఉంది. ఇందుకుగాను నేను రూ. 575 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

50. గత సంవత్సరం కేటాయించిన రూ. 1,452 కోట్లకు మూడురెట్లుపైగా రూ. 4,752 కోట్లను ప్రతిపాదిస్తున్నాను.

**పేదరిక నిర్మూలన**

51. గ్రామీణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం సెర్ప్ ద్వారా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తుంది. ఉన్నతి, ఎస్‌హెచ్‌జి–బ్యాంకు లింకేజ్, చంద్రన్న చేయూత– ఎస్‌హెచ్‌జిలకు వడ్డీ రాయితీ, స్త్రీ నిధి, ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు, చంద్రన్న బీమా, ఎపిఆర్‌ఐజిపి, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం, మొదలైనవి ఈ పథకాలలో ఉన్నాయి. 87 లక్షలు గ్రామీణ, పట్టణ మహిళలను, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లలో సంఘటితపరచి, సామాజిక సంస్థలను బలోపేతం చేయడం జరిగింది. రాష్ట్రమంతటా 3,50,000 సాధికార మిత్రలను, ప్రతిసాధికార మిత్రకు 35 కుటుంబాల చొప్పున ఏర్పరచి వారి ద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడం మరొక విన్నూత్న పథకం.

52. ఎన్‌టిఆర్ పెన్షన్ పథకం క్రింద, రూ. 5 వేల కోట్లు, పట్టణ గ్రామీణ ప్రాంతాలలో ఎస్‌హెచ్‌జి మహిళలకు వడ్డీలేని ఋణాలు పథకం క్రింద రూ. 1,463 కోట్లు, ఎస్‌హెచ్‌జి మహిళలకు క్యాపిటల్ ఇన్‌ఫ్యూజన్ క్రింద రూ. 1,700 కోట్లు, స్త్రీ నిధికి రూ. 100 కోట్ల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

53. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలను బలోపేతం చేయడానికి, కొత్త వ్యవస్థలను ప్రోత్సహించడానికి ఎన్ఆర్ఎల్ఎం క్రింద స్టార్ట్-అప్ విలేజ్ ప్రొగ్రామ్ ఉపకార్య క్రమాన్ని అమలు చేస్తున్నాము. ఇప్పటివరకు రూ.9.15 కోట్ల ఆర్థిక సహాయంతో 2,398 మంది ఎస్హెచ్జి వ్యవస్థాపకులు శిక్షణ పొందారు.

**ఆరోగ్య సంరక్షణ**

54. మా ప్రభుత్వం సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ సాధించడానికి కట్టుబడి ఉంది. నాణ్యతతో కూడిన మెరుగైన సేవలు అందించడానికి పిపిపి విధానంలో ఆరోగ్య సేవలను అందచేస్తున్నాము. సాంకేతిక సూచనలను అందించేందుకు సాంకేతిక సంస్థలను నియమించడమయింది. ఈ విధానం క్రింద అందించే సేవలలో తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, ఎన్టిఆర్ వైద్య పరీక్ష, ఉచిత డయాగ్నస్టిక్ లేబొరేటరీ సేవలు, టెలిరేడియాలజి ఎక్స్‌రే సేవలు, యమ్ఆర్ఐ, సిటి స్కాన్, సేవలు, ఎన్టిఆర్ బేబీకిట్, ఉచిత డయాలసిస్, చంద్రన్న సంచార చికిత్స, ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలు, ముఖ్యమంత్రి ఇ-కంటి కేంద్రం, బయోమెడికల్ ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్ సర్వీసు, ఆసుపత్రి పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, చీడలు, ఎలుకలు నియంత్రణ, పిహెచ్‌సి పారి శుద్ధ్య సేవలు, ఆసుపత్రి లినెన్ మరియు లాండ్రి సేవలు, మహా ప్రస్థానం ఉచిత మందులు వంటివి ఉన్నాయి.

55. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం గ్రామంలో అధికంగా సంభవించిన మూత్రపిండాల వ్యాధులు ప్రభుత్వాన్ని కలవరపరుస్తున్నాయి. బాధితులకు సత్వరం ఉపశమనం కలగచేయడానికి 14 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిశ్చయించింది.

56. మొత్తం మీద ఆరోగ్య రంగానికి 2017–18లో కేటాయించిన రూ.7,020 కోట్ల కేటయింపుపై 21% అదనంగా రూ.8,463 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**మానవ వనరుల అభివృద్ధి**

57. ఆంధ్రప్రదేశ్‌ను ఎడ్యుకేషన్, నాలెడ్జి హబ్‌గా తీర్చిదిద్దడానికి నాలెడ్జిమిషన్‌ను ప్రారంభిస్తున్నాము. బాలికలకు సైకిళ్ళు ఇవ్వడం, పాఠశాలలకు, కళాశాలలకు వెళ్ళేందుకు సదుపాయం కలుగచేయడంకాక సాధికారికతను కూడ కలుగజేస్తుంది. ఇది స్వేచ్ఛాభావాన్ని, బాలికలలో వారి స్వశక్తిపై ధైర్యం కూడా కలుగజేస్తుంది. బడికొస్తా కార్యక్రమాన్ని తొమ్మిదవ తరగతి బాలికలకే కాక ఎనిమిదవతరగతి బాలికలకు 2018–19 విద్యా సంవత్సరం నుండి వర్తింపచేస్తూ ఈ పథకానికి రూ.160 కోట్లు కేటాయింపు ప్రతిపాదిస్తున్నాను.

58. డిజిటల్ తరగతి గదులు కొత్త తరహా బోధనా విధానం, డిజిటల్ సాంకేతిక విధానంతో పల్లెలకు గుణాత్మకమైన విద్య లభిస్తుంది. డిజిటల్ తరగతి గదులు పథకానికి రూ.117 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

59. పాఠశాలలో పారిశుధ్యంలేని మరుగు దొడ్లు ప్రభుత్వానికి దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్య. ఇది విద్యార్థుల ఆరోగ్యం, బాలికల హాజరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మొట్టమొదటిసారిగా పాఠశాలలో పారిశుద్ధ్య మరుగు దొడ్లను నిర్వహించడానికి నేను రూ.100 కోట్లు కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

60. మోడల్ పాఠశాలలను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2015–16 విద్యా సంవత్సరంలో వాటిని నిలిపివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పాఠశాలలను నడపటానికి కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని కోరుతుంది. వారి దగ్గరినుంచి స్పందనకు లోబడి రూ.377 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

61. మధ్యాహ్నం భోజన పథకంలో పోషకాహార విలువలు పెంచడానికి వారానికి 3 కోడిగ్రుడ్లకు బదులుగా 5 కోడిగ్రుడ్లను సమకూరుస్తాము. ఇందుకుగాను రూ.266 కోట్లు ఖర్చు అవుతుంది. పోషకాహార భోజన పథకాన్ని ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం వర్తింపచేయనున్నది. ఈ పథకానికి రూ.23 కోట్ల రూపాయలు కేటాయింపు ప్రతిపాదిస్తున్నాను.

62. సెకండరీ విద్యకు 2017–18 సంవత్సరంలో కేటాయించిన రూ.17,952 కోట్ల రూపాయలకు అదనంగా 20% రూ.21,612 కోట్ల రూపాయల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

63. భావప్రకటన లోపం యువకుల ఉద్యోగావకాశాలకు అవరోధం అవుతుంది. ఉద్యోగావకాశాలను మెరుగుపర్చడానికి డిగ్రీ కళాశాలలో ఆంగ్ల ప్రయోగశాలలను ఏర్పరచే యోచన వుంది. అంతేకాక, డిగ్రీ కళాశాలల మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశలో కొత్త భవనాలను నిర్మించటం, ప్రయోగశాలలను ఆధునీకరించటం, గ్రంథాలయాలలో క్రొత్త పుస్తకాలను చేర్చడం వంటి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం పట్టుదలతో ఉంది.

64. కొత్త విశ్వవిద్యాలయాలన్నింటికీ మౌలిక సదుపాయాలను కలిగించడానికి ప్రభుత్వం నిశ్చయించింది. ప్రతి విశ్వవిద్యాలయానికి రూ.40 కోట్ల చొప్పున రాజమండ్రి, ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయానికి, శ్రీకాకుళం డా॥ బి.ఆర్. ఆంబేద్కర్ విశ్వ విద్యాలయానికి, కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయానికి, ఉర్దూ విశ్వవిద్యాలయానికి, కడప యోగివేమన విశ్వవిద్యాలయానికి, నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి మౌలిక సదుపాయాలను ప్రతిపాదిస్తున్నాను. తిరుపతి,

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి, విద్యార్థినుల హాస్టల్ సౌకర్యం ఏర్పరచటానికి రూ.20 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. కొంతకాలంగా నడుస్తూ నిలదొక్కుకున్న విశ్వవిద్యాలయాలు ఆర్థిక స్వయంసమృద్ధిని సాధించాలని ప్రభుత్వం ఆశిస్తుంది.

65. పాలిటెక్నిక్ కళాశాలలలో మౌలిక సదుపాయాలను, ప్రయోగశాల సదుపాయాలను మెరుగుపరుచుకోవడానికి 2017-18లో ఉన్న రూ.20 కోట్ల కేటాయింపును దాదాపు ఎనిమిది రెట్లు పెంచుతూ రూ.158 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

66. ఉన్నత విద్యాశాఖకు మొత్తం రూ.2,835 కోట్ల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**ఉద్యోగము, శిక్షణ**

67. త్వరిత గతి పారిశ్రామికాభివృద్ధి, వేగవంతమైన పారిశ్రామికీకరణకు ప్రాథమిక సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు అవసరమౌవుతాయి. ఆ అవసరాలను పాలిటెక్నిక్, ఐటిఐలు తీరుస్తాయి. ప్రభుత్వం సాంకేతిక సంస్థల స్థితిగతులను మెరుగుపరచడంపై దృష్టిసారిస్తోంది. పాలిటెక్నిక్ కళాశాలలను, ఐటిఐ ప్రయోగశాలలను ఆధునీకరిస్తున్నాము. ఐటిఐలను నిర్మించడానికి, ప్రయోగశాలలను ఆధునీకరించడానికి 2017-18లో రూ.28 కోట్ల కేటాయింపును ఆరు రెట్లకంటే ఎక్కువగా పెంచుతూ రూ.176 కోట్ల ప్రతిపాదిస్తున్నాను.

68. 2017 అక్టోబరు 2వ తారీకు నుండి ఇతర పథకాలతో కూర్చి చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేస్తున్నాము. ఈ పథకం క్రింద లాభాలేటంటే ప్రమాదాలలో

మరణం లేదా శాశ్వత అంగవైకల్యం కలిగితే శ్రామికులకు రూ.5 లక్షల బీమా, 18-50 సంవత్సరాల మధ్య శ్రామికులకు సహజమరణం సంభవిస్తే రూ.2 లక్షలు, 51-60 వయస్సులో శ్రామికులు మరణిస్తే రూ.30 వేల రూపాయలు, శాశ్వత పాక్షిక అంగవైకల్యానికి రూ.2.5 లక్షలు, రాష్ట్రంలో ఉన్న 2.46 కోట్ల అసంఘటిత శ్రామికులకు లభిస్తుంది. ఇంతేకాక తొమ్మిది, పది, ఇంటర్‌మీడియట్, ఐటిఐలలో చదివే శ్రామికుల పిల్లలకు ఒక్కొక్కరికీ రూ.1,200 రూపాయల చొప్పున స్కాలర్‌షిప్‌ను ఇద్దరు పిల్లలవరకు ఇస్తున్నాము. ఇప్పటివరకు 29,038 అసంఘటిత శ్రామికులకు రూ.392 కోట్లు చెల్లించడమైనది. ఈ పథకానికి నేను రూ.140 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**నైపుణ్యాభివృద్ధి**

69. విద్యార్థుల, నిరుద్యోగ యువత ప్రయోజనం కోసం, నైపుణ్య శిక్షణ ఉద్యోగ ప్రయత్నాలను సులభతరం చేసే కార్యక్రమాలను పెద్ద స్థాయిలో చేపట్టుతున్నాము. 2018-19 సంవత్సరంలో 1 మిలియన్ లబ్ధిదారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విస్తరింపచేసే యోచనవుంది. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన సాంఘిక సంక్షేమ, గిరిజన పాఠశాలలో డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధికలిపించే నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇచ్చి, వారిని ఉద్యోగానికి సంసిద్ధులను చేయడానికి 1000 నైపుణ్య శిక్షణా కేంద్రాలు ప్రారంభకానున్నాయి. జర్మన్ దేశపు కంపెనీ అయిన ప్రధాన సిమెన్స్ భాగస్వామ్యంతో లక్ష విద్యార్థులకు సంబంధిత కోర్సులలో శిక్షణ ఇవ్వడానికి 34 సాంకేతిక నైపుణ్య సంస్థలు, 6 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమాలను ప్రారంభించాయి. నైపుణ్యాభివృద్ధి శాఖకు రూ.300 కోట్ల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**పర్యావరణం అడవులు**

గురుదేవ్ రవింద్రనాథ్‌ఠాగూర్ పర్యావరణ ప్రాముఖ్యాన్ని గురించి చెప్పిన వాక్యాలను నేను ఉదహరిస్తున్నాను.

***"The one who plants trees, knowing that he will never sit in their shade, has started to understand the meaning of life"***

70. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2,141 చదరపు మీటర్లను చెట్లతో, అడవులతో గరిష్టంగా నింపి, దేశంలోనే మొదటిస్థానంలో నిలిచిందని తెలియచేయడానికి నేను సంతోషిస్తున్నాను. ఇది గౌరవ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో హరితాంధ్రప్రదేశ్ స్ఫూర్తితో అడవుల సంరక్షణ కార్యప్రణాళికను ఏర్పరచుకుని, సమర్థవంతంగా అమలు చేయడం వలన సాధ్యపడింది. పర్యావరణ అటవీశాఖకు ప్రస్తుతం కేటాయించిన రూ.364 కోట్ల రూపాయలకు 44% అదనంగా అనగా రూ.524 కోట్ల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

**శీతోష్ణస్థితి స్థితిస్థాపకంగా వ్యవసాయం**

71. వ్యవసాయ రంగంలో ముఖ్య సమస్యలను పరిశీలించి వాటిని అధిగమించడానికి తగు సూచనలు చేస్తూ వ్యవసాయాన్ని లాభసాటి వ్యాపకంగా మార్చడానికి ప్రైమరీ సెక్టార్ మిషన్‌ను ఏర్పరచడమైనది. ఉత్పాదకతను పెంచడానికి ప్రాథమికంగా దృష్టిసారిస్తూ చేపట్టిన ప్రాథమిక కార్యక్రమాలు మంచి ఫలితాలను చూపుతూ పూర్తి స్థాయికి చేరుకోనున్నాయి.

72. 2017-18 మొదటి అర్ధసంవత్సరంలో 17.44% వ్యవసాయ వృద్ధిరేటు నమోదుకాగా, 2016-17 సంవత్సరానికి ఇది 3.69%. మాత్రమే గోదావరి

డెల్టా ప్రాంతాలకు మరియు పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టా ప్రాంతాలకు ముందుగానే కాలువ నీరు వదలడం వలన, తొందరగా నూర్పులు చేపట్టడమే కాకుండా అధిక వరిపంటను పండించడమే కాక తద్వారా 70,000 హెక్టార్లలో అదనంగా పప్పు ధాన్యాలను పండించే అవకాశం కలిగింది.

73. సమగ్ర, దీర్ఘకాలిక సంక్షేమ అభివృద్ధిని సాధించుటకు ప్రతికూల వాతావరణ ప్రభావాల నుండి రక్షించుటకై ప్రభుత్వం జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ ద్వారా రైతులను ప్రోత్సహిస్తుంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 401 క్లస్టర్లు, 334 మండలాలలో, 972 గ్రామాలలో విస్తరించి 1.59 లక్షల రైతులకు 66 వేల హెక్టార్లలో విస్తరించింది.

74. 2017 ఆంధ్రప్రదేశ్ అగ్రిటెక్ సమావేశం నవంబరు 2017లో జరిగింది. రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణకై ప్రపంచ నాయకులు, వ్యాపారవేత్తలు, స్టార్టప్ స్థాపకులు, ప్రముఖ విధాన రూపకర్తలు, సాంకేతిక నిపుణులు, ఈ సమావేశంలో పాల్గొన్నారు. నేల స్వభావాన్ని తెలుసుకోవడానికి నేలను క్రమబద్ధంగా ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ అనే సంస్థతో వినూత్న సాంకేతికను అందిపుచ్చుకోడానికి పనిచేస్తోంది. డిజిటల్ విధానంలో నేలను మ్యాపింగ్ చేయుటకు మరియు ఇతర ఆవిష్కరణలకు రూ.30 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

75. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమును ప్రపంచ విత్తన బాండాగారముగా వృద్ధిచేసేందుకు, రాష్ట్రంలో ప్రతి వ్యవసాయదారునికి తక్కువ వ్యయంతో నాణ్యమైన విత్తనములను అందించుటకు, యుఎస్ఎలోని ఐయోవా స్టేట్ విశ్వవిద్యాలయంతో కలిసి కర్నూలు

జిల్లా తంగడెంచా వ్యవసాయ క్షేత్రంలో మోగాసీడ్ ప్రాజెక్టును ప్రారంభించడం జరిగింది. దీనికై రూ.100 కోట్ల రూపాయలను ప్రతిపాదించడమైనది.

76. 12 లక్షల హెక్టారులలో లోపాలను సరిదిద్దటకై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదటిసారిగా 100% సబ్సిడీతో సూక్ష్మపోషకాలను పంపిణీ చేయడం జరిగింది. వ్యవసాయ యాంత్రికరణకై రూ.250 కోట్లు ప్రతిపాదించడమైనది. ప్రభుత్వానికి ఋణమాఫీ ఎడల ఉన్న నిబద్ధతకనుగుణంగా 2018-19 సంవత్సరానికిగాను వ్యవసాయ ఋణమాఫీకి రూ.4,100 కోట్లు ప్రతిపాదించడమైది. అంతేకాక, రైతులకు వారి పంటలకు సముచిత ధరలు అందజేయడానికి ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్‌వెన్షన్ ఫండ్ ఏర్పాటు చేయడానికి యోచిస్తోంది.

77. గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టిలో ఉద్యానవన పంటల విస్తీర్ణంకై ప్రస్తుతం ఉన్న 40 లక్షల ఎకరాలను 100 లక్షల ఎకరాలకు విస్తరించవలసిఉంది. రాబోయే 5 సంవత్సరాల కాలవ్యవధిలో సూక్ష సేద్యం ద్వారా, సంతృప్తికరమైన పద్ధతులలో మిగిలిన ప్రాంతం కవర్ చేయబడుతుంది. ప్రాథమిక రంగంలో మంచి మార్కెట్ అనుసంధానంనకు మరియు గొలుసుకట్టు అభివృద్ధికి 1 మిలియన్ రైతులను 1 వేయి ఎఫ్‌పిఓలుగా సంఘటితం చేయబడును. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సేద్య ప్రాజెక్టుకై రూ.1102 కోట్ల రూపాయలను సబ్సిడీ పెంచడంద్వారా 49% వృద్ధితో ప్రతిపాదించడమైనది.

78. పట్టు పెంపకం రంగంలో నేడున్న పథకాలతోపాటు, నూలు మద్దతు ధరకై ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.3 కోట్లకు బదులుగా పట్టు పనివార్లకు రూ.42 కోట్లు 2018-19 సంవత్సరంకుగాను ప్రతిపాదించడమైనది.

79. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.7,342 కోట్లను 37% వృద్ధిపరిచి రూ.10,097 కోట్లు వ్యవసాయ మార్కెటింగ్, సహకార, ఉద్యాన మరియు పట్టు పెంపకం విభాగాలకు 2018–19 సంవత్సరానికి ప్రతిపాదించడమైనది. గౌరవ వ్యవసాయ శాఖామాత్యులు వ్యవసాయ బడ్జెట్‌ను సవివిరంగా ప్రతిపాదిస్తారు.

**పశుసంవర్ధక పాడిపరిశ్రమ మరియు మత్స్యశాఖ**

80. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం 9% కంటే ఎక్కువ దోహదం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాలు, మాంసం, గ్రుడ్డుల ఉత్పత్తులలో జాతీయ వృద్ధిరేటు 2.05% ఉన్నప్పటికీ, దేశంలోనే మొదటి మూడు స్థానాలలో ఒకటిగా 2022 సంవత్సరానికి తీసుకురావడానికై, ఈ రంగం 13.68% వృద్ధి నమోదుచేయబడింది. రాష్ట్ర ప్రభుత్వం సంచార పశువైద్యశాలలను ప్రారంభించింది. వర్షాభావం వలన పశుగ్రాసం పూర్తిగా లభించనప్పటికీ, ప్రభుత్వం 10 లక్షల క్వింటాళ్ళ మరియు 5 లక్షల క్వింటాళ్ళ పశుగ్రాస బ్యాంకుల రూపకల్పన చేయడం వలన ఈ కొరతలను అధిగమించగలిగాము. వ్యవస్థాపకుల సహకారంతో భారీ పశుగ్రాస క్షేత్రాల నిర్వహణ చేపట్టాలని ప్రభుత్వం యొక్క ప్రతిపాదన. 2017–18 సంవత్సరంలో రూ.58 కోట్లు కేటాయించినప్పటికీ నేను 2018–19 సంవత్సరానికి పశువైద్యశాలలకు మరియు చికిత్సాకేంద్రాలకు రూ.111 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. క్షేత్రస్థాయి పశు సంవర్ధక సంస్థల మౌళిక సదుపాయాల అభివృద్ధికై 2017–18 లో ఉన్న రూ.25 కోట్లను 2018–19 సంవత్సరంలో రూ.75 కోట్లుగా ప్రతిపాదిస్తున్నాను.

81. 10 లక్షల జంతువులను బీమా చేయుటకై రూ.50 కోట్ల రూపాయలతో కొత్త స్కీమ్‌ని ప్రారంభించుటకు ప్రతిపాదిస్తున్నాను. దీనితో 3 లక్షలమంది రైతులు ప్రయోజనం పొందుతారు.

82. మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో చేపల పెంపకం రంగం ఎంతో వృద్ధిలో ఉండటంమే కాకుండా ఈ రంగంలో ఉద్యోగ అవకాశాలు కూడా మెండుగా ఉండటం ఒక ప్రధానమైన విషయం. జాతీయ వృద్ధిరేటును 13.8% పోలిస్తే మన రాష్ట్ర వృద్ధిరేటు 42.73% ముందజలో ఉంది. ఈ అభివృద్ధికి ముఖ్య కారణం సముద్ర చేపలు, ఉప్పునీటి రొయ్యల ఉత్పత్తి అధికంగా ఉండటం. చంద్రన్న ఆక్వారైతు క్షేత్రాల పథకం క్రింద ఈ రంగంలో అత్యధిక వృద్ధిరేటును సాధించడానికి వ్యవసాయ ఆధారిత చెరువులలో ఆధునిక టెక్నాలజిని ఉపయోగించటం జరుగుతుంది.

83. పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మరియు మత్స్యశాఖకు 2017-18 సంవత్సర కేటాయింపు రూ.1,394 కోట్లుపై 25% పెంపుతో రూ.1,743 కోట్ల కేటాయింపును నేను ప్రతిపాదిస్తున్నాను.

**జలవనరుల శాఖ**

84. మా ప్రభుత్వం నీరు చెట్టు కార్యక్రమంలో భాగంగా చక్కటి నీటి నిర్వాహణ పద్ధతులు అవలంభించడం ద్వారా మన రాష్ట్రాన్ని కరువు నిర్మూలన ప్రాంతంగా తీర్చి దిద్దుటకు, అన్ని ప్రయత్నాలను చేస్తోంది.

85. పోలవరం ప్రాజెక్టు నిర్మాణపు పనులు రాష్ట్రంలో వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టును త్వరితగతిలో పూర్తిచేయడానికి మరియు వీటి ఫలాలను రాష్ట్ర ప్రజలకు వేగంగా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం దృఢనిశ్చయంతో ఉంది. దీనికై, నేను 2018-19 సంంత్సరానికి రూ.9,000 కోట్ల ప్రతిపాదిస్తున్నాను.

86. చురుకుగా నడుస్తున్న మహేంద్ర తనయ, వంశధార, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పురుషోత్తం పట్నం ఎత్తిపోతల పథకం, గోదావరి డెల్టా (ఏలేరుతో

కలిపి) ఆధునీకరణ, చింతలపూడి ఎత్తిపోతల పథకం, కృష్ణా డెల్టా ఆధునీకరణ, పట్టిసీమను అత్యధికస్థాయిలో ఉపయోగించుకోగలగడం, నాగార్జునసాగర్ అధునీకరణ, వెలుగొండ ప్రాజెక్టు, సంగం ఆనకట్ట, నెల్లూరు ఆనకట్ట, సోమశిల ప్రాజెక్టు, సోమశిల స్వర్ణముఖి లింక్ కాల్వ, తెలుగు గంగ ప్రాజెక్టు, జిఎన్ఎస్ఎస్ మరియు దాని అనుబంధ పనులు, హెచ్ఎన్ఎస్ఎస్ మరియు దాని అనుబంధ పనులు – వీటినన్నింటిని త్వరితగతిన పూర్తిచేయాలని మా ప్రభుత్వం భావిస్తుంది. ఎపిఎస్ఐడిసి ద్వారా అమలు చేయబడుతున్న అన్ని ఎత్తిపోతల సాగునీటి పథకాలను పూర్తి చేయుటకు మా ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్ నీటి భద్రతపై దీర్ఘ ప్రణాళికతో రాష్ట్రంలోని ఐదు ప్రధాన నదులైన వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నాలను అనుసంధానం చేస్తూ ఒక మహాసంగమంను రూపొందించుటానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పిస్తుంది.

87. ఈ రంగానికై 2018-19 సంవత్సరానికిగాను 2017-18 సంవత్సరంతో పోలిస్తే (రూ.12,770) 33% వృద్ధి రేటుతో అత్యధికంగా రూ.16,978 కోట్లను ప్రతిపాదిస్తున్నాను.

**ఆహార భద్రత**

88. ఆహార భద్రతలో అత్యున్నత లక్ష్యాలను సాధించుటలో రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టం క్రింద 268 లక్షల పరిమితి దాటడమేకాక మరొక 134 లక్షల యూనిట్ల కవరేజ్‌లు సాధించగలిగింది. 2018 జనవరిలో నిర్వహించిన ఐదవ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా 2,36,000 కొత్త తెలుపు రేషన్ కార్డులను జారీచేయడమైనది. చంద్రన్న కానుక అనుపేరుతో సంక్రాంతి,

క్రిస్టమస్, రంజాన్ పండుగలలో అర్హులైనవారికి ఉచిత బహుమతి ప్యాక్‌లను ఇవ్వడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రిగారు 2017 డిసెంబరు నెలలో విలేజ్ మాల్ పథకం ప్రారంభించారు. మొదటి దశగా 6500 చౌకదుకాణాలను విలేజ్ మాల్స్ స్థాయికి పెంపొందించడం జరుగుతుంది. తద్వారా నాణ్యమైన ఎఫ్ఎంసిజి ఉత్పత్తులు మరియు ప్రధాన ఆహార దినుసులను మార్కెట్ ధరకంటే తక్కువ ధరలకు అందుబాటులోనికి తీసుకురావడం జరుగుతుంది.

89. నిత్యావసర వస్తువుల స్థిరీకరించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందుకుగాను పౌరసరఫరాల కార్పోరేషన్‌కు అదనపు కేటాయింపులను ప్రతిపాదిస్తున్నాను.

90. గౌరవ ముఖ్యమంత్రిగారిచే గిరిజన ఎల్‌పిజి ప్యాకేజ్‌ను గిరిజన ప్రాంతాలలో ఉన్న పేద మహిళలకై ప్రారంభించడమైంది. ఈ ప్యాకేజ్ భాగంగా రూ. 2,480 విలువగల 5 కిలోల ఎల్‌పిజి సిలెండరు కనెక్షను, ఐఎస్ఐ ప్రామాణ్యతగల స్టవ్, రెగ్యూలేటర్, పాస్ పుస్తకము, ఒక పైపు మొదలగులనవి ఉచితంగా ఇవ్వబడును. ఇప్పటివరకు 61,444 గిరిజన కుటుంబాలకు లబ్ధిచేకూరింది. నేను ఈ రంగానికై రూ. 3,495 కోట్లు కేటాయిస్తున్నాను.

**గ్రామీణాభివృద్ధి**

91. రాష్ట్రంలో ఉన్న 56,735 కిలోమీటర్ల అంతర్గత రహదారులలో, 30,546 కిలోమీటర్లు ఇప్పటికే సిమెంట్ పేవ్‌మెంట్ చేయబడ్డాయి. వాడవాడల్లో చంద్రన్న బాట అనే ప్రధాన కార్యక్రమాన్ని చేపట్టడంద్వారా మా ప్రభుత్వం సిమెంట్ రోడ్లు పూర్తి స్థాయిలో వేయుటకై సంకల్పించింది. 2017-18 సంవత్సరంలో 5,102 కిలోమీటర్ల నిడివిగల అంతర్గత రహదారులను సిమెంట్ పేవ్‌మెంట్ ద్వారా వేయడం జరిగింది.

92. ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం క్రింద 103 క్లస్టర్లలో 8000 నివాస యోగ్యాలను కమ్యూనిటీ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ ద్వారా సురక్షిత మంచినీటి సదుపాయాలను ఏర్పాటు చేయడమైంది. అన్ని కుటుంబాలకు కుళాయి సదుపాయం (70 ఎల్‌పిసిడి) కల్పించాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఉన్న మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించుటకై ఆంధ్రప్రదేశ్ త్రాగునీటి సరఫరా కార్పొరేషన్ ఏర్పాటు చేయడమైంది. రూ.22,000 కోట్ల రూపాయల త్రాగునీటి ప్రాజెక్టు ప్రతిపాదనలు బ్యాంకు ఋణాల ద్వారా మరియు యాన్యుటీ మోడ్స్ ద్వారా ప్రతిపాదించడమైనది. ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకానికి రూ.150 కోట్లు కేటాయించడమైనవి.

93. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో లభ్యమయ్యే భూగర్భజలాల వినియోగంతో వ్యవసాయాభివృద్ధిని సాధించుటకై ఎన్‌టిఆర్ జలశ్రీ పథకం క్రింద రూ.100 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం 25,000 బోరుబావులను త్రవ్వించుటకై ప్రతిపాదిస్తోంది. ఎన్‌టిఆర్ జలశ్రీ పథకానికి 2017-18లో రూ.55 కోట్లు కేటాయించడమైనది. దీనికి ఈ బడ్జెట్‌లో రూ.200 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

94. స్వచ్ఛ ఆంధ్ర మిషన్ క్రింద గ్రామీణ ప్రాంతాలలో 71.03 లక్షల కుటుంబాలలో 60.86 లక్షల కుటుంబాలు అనగా 86% ఐహెచ్‌హెచ్‌ఎల్ సదుపాయాలను కలుగచేయడమైంది. రాష్ట్రంలోని 12,854 గ్రామపంచాయితీలలో 6,311 గ్రామపంచాయితీలు బహిరంగ మల విసర్జన రహిత గ్రామపంచాయితీలుగా ఎంపిక చేయడమైంది. అలాగే మొత్తం 13 జిల్లాలలో 6 జిల్లాలు అనగా పశ్చిమ గోదావరి, నెల్లూరు, కృష్ణా, తూర్పు గోదావరి, ప్రకాశం, గుంటూరు జిల్లాలను కూడా బహిరంగ మల విసర్జన రహిత జిల్లాలుగా ఎంపిక చేయడమైనది. మిగిలిన

జిల్లాలు 2018 మార్చి 31 తేదీలోగా బహిరంగ మల విసర్జన రహిత జిల్లాలుగా నిర్ణయించడమగును. ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకం క్రింద ఒక్కొక్క ఇంటికి ఒక్కొక్క మరుగుదొడ్డి నిర్మాణానికై అదనపు సహాయం నిమిత్తం రూ.100 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను. 2017-18 సంవత్సరంలో రూ.515 కోట్లు స్వచ్ఛాంధ్ర పథకం క్రింద కేటాయించగా 2018-19 సంవత్సరానికిగాను రూ.1,450 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

95. ఎంజిఆర్ఎన్ఆర్ఇజిఎస్ పథకం క్రింద ఉత్పాదక ఆస్తులను ఏర్పాటు చేసుకోడానికి వివిధ విభాగాలకు వచ్చే నిధులను సద్వినియోగం పరచుకొనడానికి 2017-18 సంవత్సరంగాను రూ.330 కోట్లుకాగా, 2018-19 సంవత్సరంకుగాను రూ.750 కోట్ల కన్వర్జెన్స్ గ్రాంట్ ప్రతిపాదించడమైనది.

96. 2017-18 సంవత్సరంలో రూ.21,140 కోట్లు కేటాయించగా, పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు బలోపేతం చేయడానికి 11% వృద్ధిరేటుతో 2018-19 సంవత్సరంగాను రూ.23,439 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**పరిశ్రమ మరియు వాణిజ్య రంగం**

97. మా ప్రభుత్వం సమతుల్య, సమానమైన, వికేంద్రీకృత, పారిశ్రామిక అభివృద్ధిని సాధించడానికి కట్టుబడి ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆటోమొబైల్, ఆహార రంగం, వస్త్రాలు, సముద్ర ఉత్పత్తులు, సిమెంట్ రంగాలలో పెట్టుబడులను ఆకర్షిస్తోందని చెప్పడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను.

98. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుతం 18 విభాగాలలో 1,946 పెద్ద మరియు మెగా ప్రాజెక్టుల స్థాపనలకై రూ.13.54 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, 31 లక్ష ఉద్యోగావకాశాలు కల్పించే ప్రతిపాదనలను పరిశీలిస్తుంది. వీటిలో 531 ప్రాజెక్టులు రూ.1.23 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో 2.64 లక్షల ఉద్యోగ అవకాశాలతో కార్యకలాపాలు ప్రారంభించాయి. ఈ మధ్యనే ముగిసిన భాగస్వామ్య సమ్మిట్ 2018లో ప్రభుత్వం రూ.4.39 లక్షల కోట్ల పెట్టుబడి విలువగల మరియు 11 లక్షల ఉద్యోగ అవకాశాలు లభించగల 734 భాగస్వామ ఒప్పందాలు ఖరారు చేసింది. ప్రభుత్వం ప్రజలందరు చూడగలిగే ఒక ఆన్‌లైన్ ఇన్వెస్టుమెంట్ ట్రాకర్ ద్వారా పెట్టుబడులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది. ఇసుజి మోటార్స్, పెప్సి కంపెనీ, మోండలేజ్, ఫాక్స్‌కాన్, బెర్గర్ పెయింట్స్, అరవిందో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, సెల్కాన్, కోల్గేట్ పామోలిన్ వంటి ప్రముఖ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రారంభించాయి. కియా మోటార్స్, గ్రీన్ ప్లై, ఏషియన్ పెయింట్స్ వంటి సంస్థల పెట్టుబడులు రాష్ట్రానికి చేరుతున్నాయి.

99. రూ.11,779 కోట్ల రూపాయల పెట్టుబడులతో, 3.09 లక్షల మందికి ఉపాధితో 26,368 యూనిట్లు సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల రంగంలో ప్రారంభించబడ్డాయి. దీన్ని మరింత అభివృద్ధి పరచుటకై ఎంఎస్ఎంఇ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయబోతుంది. దశలవారిగా 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్లగ్ & ప్లే సదుపాయాలతో ఏర్పాటు చేయబోతున్నాము. ఎంఎస్ఎంఇ రంగానికిగాను రూ.200 కోట్లు రూపాయలు కేటాయించడమైనది.

100. 2016లో ప్రపంచ బ్యాంకు మరియు డిఐపిపి నిర్వహించిన ఒక అంచనా ప్రకారం దేశంలోనే మన రాష్ట్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ వ్యాపార పరంగా అగ్రగామిగా

నిలిచింది. రాష్ట్రంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 24,000 ఆమోదాలు పరిశ్రమల స్థాపన నిమిత్తం అందించబడ్డాయి. 16,792 క్లెయిములకు గాను ప్రభుత్వం రూ.3,061 కోట్ల రూపాయలను పారిశ్రామిక ప్రోత్సాహక మంజూరు చేయడంమైనది. ప్రజాసేవలను త్వరిత గతిని అందించడానికి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ డెలివరీ గ్యారంటీ యాక్ట్ 2017ను తీసుకురావడమైంది. ఈ చట్టం క్రింద 22 విభాగాలలో 74 సేవలను తీసుకురావడమైంది.

101. రెండు అతి పెద్ద కారిడార్‌లైన విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లను ప్రభుత్వం నిర్వహిస్తుంది. విశాఖపట్నం -చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు సంబంధించిన నాలుగు విభాగాలలో రెండు విభాగాలు విశాఖపట్నం, శ్రీకాళహస్తి-ఏర్పేడు విభాగాలు త్వరలోనే పూర్తిఅవుతాయి. చెన్నై బెంగళూరు కారిడార్‌లో భాగమైన కృష్ణపట్నం అభివృద్ధి కార్యక్రమం త్వరలోనే చేపట్టబోతున్నాము. సంభావిత మాస్టర్ ప్లాన్ ఇప్పటికి అమోదించబడినది.

102. 2017-18 సంవత్సరానికి రూ.2,086 కోట్లు కేటాయింపులుగా ఉండగా నేను పారిశ్రామిక, వాణిజ్య విభాగానికి 2018-19 సంవత్సరానికి గాను 47% వృద్ధి రేటుతో రూ.3,075 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

**ఇన్ఫర్మేషన్ టెక్నాలజి**

103. రాష్ట్రంలో ఐటి రంగంలో పెట్టుబడుదారులకు పలు కార్యకాలాపాలను కొనసాగించడానికి ఎన్నో విధి విధానాలను చేపట్టింది. ఎలక్ట్రానిక్స్ తయారీని ప్రోత్సహించడానకి ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్లను పెద్ద ఎత్తులో రూపొందించుటలో ప్రభుత్వం సఫలీకృతమైనది. ఇది ఈ రంగంలో దాదాపు 2 లక్షల ఉపాధి అవకాశాలను

కల్పించనున్నది. తిరుపతిలోనున్న ప్రపంచ స్థాయి ఇంటర్‌నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీ తన కార్యకలాపాలను ఇప్పటికే ప్రారంభించింది. అడ్వాన్సుడ్ డిజిటల్ కోర్సులలో కాబోయే 4 సంవత్సరాలలో 12,500 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం దీని లక్ష్యం. ఆసియాలోనే అతి పెద్దదైన బ్లాక్‌చైన్ సమావేశాన్ని అక్టోబర్ 2017లో మన రాష్ట్రం నిర్వహించింది. ఈ సమావేశానికి 20 దేశాలనుంచి 1,000 మందికిపైగా ప్రతినిధులు హాజరైయ్యారు.

104. మన రాష్ట్రంలో ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ రంగానికి ఉతమిచ్చే స్టార్టప్ వ్యాపార సంస్థలకు ప్రోత్సాహకాలను అందించేందుకు రూ.100 కోట్ల కేటాయింపును ప్రతిపాదిస్తున్నాను.

105. నేను ఈ విభాగమునకు రూ.1,007 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను. ఇది గత సంవత్సరపు కేటాయింపు అయిన రూ.364 కోట్లతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ.

**ఇంధన మరియు మౌలిక సదుపాయాలకల్పన శాఖ**

106. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏవిధమైన విద్యుత్ లోటు లేని రాష్ట్రం. దేశంలోనే నష్టాలబాటలో నడుస్తున్న డిస్కమ్స్‌లలో మన రాష్ట్రంలోనున్న డిస్కమ్స్ అతి తక్కువ నష్టాలతో నడుస్తున్నవి. ప్రస్తుతం ఉన్న 65,000 పంపుసెట్ల స్థానంలో శక్తి సామర్థ్య పంపుసెట్లతో భర్తిచేయడానికి లక్ష్యంగా పెట్టుకుంది. సాంప్రదాయేతర విద్యుత్ శక్తిని వినియోగించకోడానకి ప్రభుత్వం సౌర విద్యుత్ ఉత్పత్తి పంపు సెట్లను పెట్టుకోడానికి ప్రోత్సాహన్నిస్తుంది. ఇంతవరకు 20575 పంపుసెట్లను ఇన్‌స్టాల్ చేయడం జరిగింది. దారిద్ర్య రేఖకు దిగువనున్న ఎస్‌సి/ఎస్‌టి కుటుంబాలకు

అదనంగా రెండేసి లెడ్ బల్బులు పంపిణీ చేయబడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ లైన్లను బలోపేతం చేయడానికి లెడ్ బల్బుల వినియోగం పెంచేందుకు విద్యుత్ లైన్లను బలోపేతంచేస్తుంది.

107. 2017 డిసెంబర్ నెలలో గౌరవనీయులైన రాష్ట్రపతిగారిచే ఆంధ్రప్రదేశ్ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభించడం మనకు గొప్ప గర్వకారణం. రాష్ట్రంలోని 13 జిల్లాలలో ఉన్న 55,000 కిలోమీటర్ల నిడివిగల ఆప్టికల్ ఫైబర్ కేబులల్లో ఇప్పటికే 23,000 కిలోమీటర్లకు పైగా కేబుల్లను వేసింది. ఎపి ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా 1 కోటి గృహాలు, 50,000 పాఠశాలలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, 5,000కు పైగా ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్యకేంద్రాలు, అన్ని పంచాయితీ కార్యాలయాలు, అత్యంత వేగంగా నడిచే ఇంటర్‌నెట్ సదుపాయాన్ని, అద్దె చెల్లించనక్కరలేని టెలిఫోన్ సదుపాయాన్ని, కేబుల్ టివి ప్రసారాలను పొందగలవు. నేను ఎపిఎస్ఎఫ్ఎల్ కొరకు మరియు దాని అనుబంధ రంగాలకు 2018–19 సంవత్సరానికిగాను రూ.602 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను

108. ప్రపంచానికి పోర్టులే ప్రవేశద్వారాలు, మన రాష్ట్రంలో ప్రాధాన్యతలేని పోర్టులే సుమారు 130.6 మిలియన్ మెట్రిక్ టన్నుల వస్తువులను చేర్చడంతో గుజరాత్ మరియు మహారాష్ట్ర రాష్ట్రాల తర్వాత మూడవ స్థానంలో మన రాష్ట్రం ఉంది. ప్రభుత్వ మరియు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిచే ఒప్పందాల క్రింద భావనపాడు తీర ప్రాంతం, కెఎస్ఇజెడ్ తీర ప్రాంతం, మచిలీపట్నం తీర ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాము.

109. నేను ఇంధన మరియు మౌలిక సదుపాయాల విభాగాలకు గత సంవత్సరపు రూ. 4,331 కోట్లుతో పోలిస్తే 18.66% వృద్ధితో 2018–19 సంవత్సరానికి గాను రూ. 5,140 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

**రవాణా, రోడ్లు మరియు భవనాలు**

110. రాష్ట్రం అంతటా కనెక్టివిటీ మెరుగుపరచడానికి ప్రభుత్వం రహదారుల నెట్‌వర్క్‌ను నవీకరిస్తోంది. గ్రామీణ మరియు పట్టణ ఆర్థిక వ్యవస్థలమధ్య వీరు వారధిగా నిలుస్తారు. వివిధ కార్యకలాపాల ద్వారా ప్రభుత్వం నిరంతరం రోడ్ల నాణ్యతను మెరుగు పరుస్తుంది. రోడ్ల ద్వారా అనుసంధానంగాని గ్రామాలను అనుసంధానం చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

111. పల్లెలకు, ప్రత్యేకించి గిరిజన ప్రాంతాలలో ఉన్న గ్రామాలకు బస్సులను నడిపేఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రూ. 200 కోట్ల గ్రాంట్‌గా మంజూరు చేయుటకు ప్రతిపాదించడమైనది. ఈ గ్రాంట్‌తో ఎపిఎస్ఆర్‌టిసి పల్లెవెలుగు బస్సులను కొనుగోలు చేసి పైన తెల్పిన విధంగా బస్సులను నడుపుతుంది. అదేవిధంగా వివిధ వర్గాలకు చెందిన పౌరులకు ఎపిఎస్ఆర్‌టిసి ద్వారా విస్తరించబడిన రాయితీలను పూరించేందుకు రూ. 290 కోట్లు ఎపిఎస్ఆర్‌టిసికి తిరిగి చెల్లించుటకు ప్రతిపాదించడమైనది.

112. గత సంవత్సరం కేటాయించిన రూ. 4,042 కోట్లతో పోలిస్తే ఈ సంవత్సరం 16% వృద్ధితో రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖకు నేను రూ. 4,703 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి**

113. లక్ష్య తేదికి 3 సంవత్సరాల ముందే అక్టోబర్ 2,2016 నాటికే రాష్ట్రంలో నున్న అన్ని 110 యుఎల్‌బిలు ఒడిఎఫ్ స్థాయికి చేరుకున్నాయి. ప్రభుత్వ మరియు ప్రైవేట్ భాగస్వామ్య ఒప్పదం క్రింద అమృత్ పథకం క్రింద నిర్ణయించబడని 78 పట్టణాలలో ఫీకల్ స్లడ్జ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులు అక్టోబర్ 2, 2018 నాటికి రాష్ట్రం ఓడిఫ్ ప్లస్ హోదాకు చేరుకోవడానికి మన రాష్ట్రం ముందంజలో ఉంది. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి జిల్లాలలో, జిల్లాకు ఒక్కటి చొప్పున ప్రభుత్వ మరియు ప్రైవేట్ భాగస్వామ్యం క్రింద మూడు నిర్మాణ మరియు డిమాలిష్ వ్యర్థ ట్రీట్‌మెంట్ ప్రాజెక్టులు లభించాయి. ఇదేవిధంగా ప్రభుత్వ మరియు ప్రైవేట్ భాగస్వామ్యం క్రింద 51 పట్టణ స్థానిక సంస్థలలో పురపాలక వ్యర్థాలను రోజుకు 4,321 టన్నుల వ్యర్థాన్ని శాస్త్రీయ పద్ధతులలో ఇంధన శక్తిగా మార్చుటకు వ్యర్థ పదార్థాలను ఇంధన వనరులుగా మార్చునిమిత్తం 9 ప్రాజెక్టులు లభించాయి.

114. విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, అమరావతిలతోపాటు శ్రీకాకుళం, ఏలూరు, ఒంగోలు, కర్నూలు, అనంతపురం, నెల్లూరులలో కూడా స్మార్ట్ సిటీస్ మిషన్ అమలు చేస్తోంది. స్మార్ట్ సిటీస్ కొరకు రూ.800 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. పట్టణ స్థానిక సంస్థలకు అనుబంధంలోనున్న షెడ్యూల్డ్ కులాల ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు గత సంవత్సరం రూ.260 కోట్లుగా ఉన్న కేటాయింపులను 2018-19 సంవత్సరంగాను రూ.600 కోట్లు ప్రతిపాదించడమైనది. అంతేగాక ప్రస్తుత మురికి నీటి వ్యవస్థను మెరుగుపరడానికి గత సంవత్సరంలో రూ.100 కోట్ల కేటాయింపులను ఈ సంవత్సరం రూ.300 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

115. అన్నా క్యాంటిన్ పథకం క్రింద పట్టణ స్థానిక ప్రాంతాలలో నివసిస్తున్న అత్యంత పేదవారికి సబ్సిడీతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్నాము. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే వెలగపూడి, తుళ్ళూరు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం మరియు యర్రబాలెంలలో నాలుగు అన్నా క్యాంటిన్‌లను ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వం మున్సిపల్ కార్పోరేషన్‌లలోను మరియు మున్సిపాల్టిలలోను అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదిస్తుంది. అన్నా కాంటీన్ పథకానికై ఈ బడ్జెట్‌లో రూ.200 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

116. విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్‌లో ప్రాథమిక మౌలిక సౌకర్యాల అభివృద్ధికి నేను రూ.75 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

117. పురపాలక పాఠశాలలలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి మరియు విద్యానాణ్యతను పెంచడానికి ప్రభుత్వం ఎంతో చొరవచూపుతుంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తమ తోటి విద్యార్థులతో సమానంగా పోటీపడటానికి ఇది ఎంతో దోహదం చేస్తుంది. నేను దీనికై రూ.50 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

118. నగర పంచాయితీలలోను మరియు గ్రేడ్ 3 పురపాలక సంఘాలలోను మౌలిక సదుపాయాలను పెంపొందించుకు నేను రూ.119 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**అమరావతి - ప్రజల యొక్క రాజధాని**

119. అతి తక్కువ వ్యవధిలో రాజధాని అమరావతిని అభివృద్ధిపరుచుటలో మా ప్రభుత్వం సాధించిన ప్రగతి ఎంతో అద్భుతమైనది. ప్రజారాజధాని అయిన అమరావతి నేడు నిర్మాణంలో అతికీలక దశకు చేరుకున్నది. రాబోయే సంవత్సరాలలో అమరావతి

నగరం స్మార్ట్ సిటీ నగరాలలో మొదటి గ్రీన్ ఫీల్డ్ సిటీగా ఉండటమేకాకుండా ఇది మిగిలిన నగరాలకు ఒక సూచికగా ఉంటుందని చెప్పవచ్చు. సిఆర్‌డిఏ ద్వారా రూ. 45,000 కోట్ల విలువగల ఎన్నో నిర్మాణాత్మక పనులు చేపట్టబడుతున్నాయి.

120. గత సంవత్సరపు కేటాయింపులైన రూ. 5,207 కోట్ల రూపాయలతో పోలిస్తే 49% అధికంగా ఈ బడ్జెట్ లో మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖకు మరియు క్యాపిటల్ రీజియన్ డెవలెప్‌మెంట్ అథార్టీకు కలిపి నేను ఈ సంవత్సరం రూ. 7,741 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**పర్యాటక, సాంస్కృతిక మరియు భాషాశాఖ**

121. ప్రపంచంలోనే అత్యంత ఆకర్షిణీయ ప్రదేశాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మలచుటయే మా ప్రయత్నం. దేశీయ పర్యాటకుల ఆకర్షణలో మన రాష్ట్రం దేశంలోనే 3వ స్థానంలో ఉంది. 2017-18 సంవత్సరంలో 2016-17 సంవత్సరంతో పోలిస్తే 8% అధికంగా పర్యాటకులను ఆకర్షించగలిగాము. పర్యాటక రంగాన్ని సామర్థ్య నిర్మాణం మరియు నైపుణ్యాతాభివృద్ధితో బలోపేతం చేయటానికి పర్యాటక, ఆతిథ్య రంగాలలో 2,400 మందికి శిక్షణను ఇవ్వడం జరిగింది. గ్రామీణ పర్యాటక రంగాన్ని అభివృద్ధిచేయుటకు కళలు, సంస్కృతి, హస్తకళలు, కళంకారి, మరియు చేనేతలలో నైపుణ్యం కలిగిన 12 గ్రామాలలో ప్రాజెక్టు సంస్కృతి పథకాన్ని ప్రారంభించడం జరిగింది.

122. మన సంస్కృతిని అభివృద్ధిపరిచే దిశలో కళలు, సంగీతం, చరిత్ర మరియు విజ్ఞాన శాస్త్రం అభివృద్ధికై ప్రభుత్వం 7 అకాడమీలను మంజూరు చేసింది. 2018-19 సంవత్సరం నుండి ఈ అకాడమీలు పనిచేయడం ప్రారంభిస్తాయి. ప్రభుత్వం 6,746

వృద్ధ కళాకారులకు సహాయంచేసే నిమిత్తం వృద్ధ కళాకారులకు పెన్షన్ అందిస్తోంది. స్థానిక కళాకారుల ప్రాతినిధ్యంతోపాటు స్థానిక కళారూపాలను ప్రోత్సహించే నిమిత్తం, మరియు పునరుజ్జీవింపచేసే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంతటా ప్రాంతీయ పండుగలను, జాతరలను జరుపుకునే దిశలో సాంస్కృతిక సంబరాలను మొదలుపెట్టింది.

123. పర్యాటక, సాంస్కృతిక శాఖకు నేను ఈ బడ్జెట్‌లో రూ.290 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**ఉద్యోగ సంక్షేమం**

124. అన్ని కేడర్ల మరియు వర్గాల ఉద్యోగుల ప్రతి విషయానికి మా ప్రభుత్వం మద్దతునిస్తుంది. మేము ఎల్లప్పుడు ఉద్యోగస్తుల యొక్క సహేతుకమైన, సమంజసమైన కోర్కెలను సానుభూతితో పరిశీలిస్తాము. మేము అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళ నుండి ఉద్యోగుల సమస్యల పరిష్కృతికి పలుచర్యలు చేపట్టడమైనది. తీవ్రమైన ఆర్థిక వనరుల కొరత ఉన్నప్పటికినీ ఉద్యోగుల సహేతుకమైన హక్కుగా భావించి వారి రిటైర్మెంట్ వయస్సును 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు పెంచడమైనది.

125. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన స్థాయిలను పదవ వేతన సవరణ సంఘం సిఫార్సులమేర 29% ఫిట్మెంట్ బదులు ఉదారంగా 43% ఫిట్మెంట్‌తో స్థిరీకరణ చేయడమైనది. వేతన సవరణలను స్వయంప్రతిపత్తి గల సంస్థలకు, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా వర్తింపచేశాము. తాజాగా విడుదల చేసిన జనవరి 1, 2017 కిస్తుతో కలిపి ఏడుకిస్తుల కరువు భత్యాన్ని విడుదల చేశాము. మరో

విడత కరువుభత్యాన్ని త్వరలోనే విడుదల చేస్తాము. భవిష్యతులో చెల్లించవలసిన కరువు భత్యం కిస్తులను తగు సమయంలో విడుదలచేస్తాము.

126. అంతేకాకుండా మేము పొరుగుసేవల ఉద్యోగులకు, ఒప్పంద ఉద్యోగులకు, పూర్తికాల, పాక్షికంగా పనిచేస్తున్న కంటింజంట్ ఉద్యోగులకు, అంగనవాడి కార్యకర్తలకు, సహాయకులకు, నైపుణ్యం లేని కార్మికులకు, పురపాలక సంఘ కార్మికులకు, సెర్ప్, హెచ్ఆర్ ఉద్యోగులకు, వేతన పెంపుదల చేసామన్న విషయం గుర్తుచేస్తున్నాను.

127. సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులకు వారు ఆందోళనలో ఉన్న రోజుల సంఖ్యకు సమానమైన రోజులను ప్రత్యేక సాధారణ సెలవుగా ఇవ్వబడినది. ఉద్యోగులు ఈ సందర్భంగా ఉపయోగించుకున్న సెలవును ఆమేరకు పునరుద్ధరించడమైనది. ఈ అవకాశాన్ని ఎపిఎస్ఆర్టిసి ఉద్యోగులకు కూడా వర్తించడమైనది.

128. కొత్త పెన్షన్ పథకం (ఎన్పిఎస్) ప్రకారం పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ మంజూరు చేయడమైనది. అంతేకాకుండా ఈ పథకం క్రింద మరణించిన ఉద్యోగస్తుల కుటుంబాలనుండి అర్హులైన సభ్యులకు కుటుంబ పింఛను, గ్రాట్యుటీ మంజూరు చేయడమైనది. గ్రామ సహాయకులకు పింఛను మంజూరు చేయడమైనది. ఈ సదుపాయం వారి జీవిత భాగస్వాములకు కూడా వర్తింపజేయడమైనది.

129. జిల్లాపరిషత్, పురపాలక సంఘాలలో పనిచేయుచున్న భాషాపండితులను, పి.ఇ.టిలను పాఠశాల సహాయకులుగా అప్గ్రేడ్ చేయడమైనది. రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరకు ఏకీకృత సేవానియమావళిని అమలు చేయడమైనది.

130. ప్రభుత్వం గత సంవత్సరం ఇచ్చిన మహిళా, పురుష ఉద్యోగుల, వసతి గృహ-భోజన సదుపాయాన్ని ఈ సంవత్సరం కూడా పొడిగించడమైనది. అదేవిధంగా హైదరాబాద్ నగరంలో వర్తించే ఇంటి అద్దె భత్యాన్ని, నగర పరిహార భత్యాన్ని ఈ సంవత్సరం కూడా పొడిగించడమైనది. ఉద్యోగస్తుల పిల్లలకు విద్యా ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడం కోసమై వారికి స్థానిక హోదా ఇవ్వడం జరిగింది. కొందరు ప్రభుత్వ ఉద్యోగులకు హైదారాబాద్ పట్టణంలో గల గచ్చిబౌలి, జవహర్ నగర్, నెక్నాంపూర్‌లలో ఇళ్ళ స్థలాలు ఇవ్వబడ్డాయి. వారు నూతన రాజధానికి తరలి రావలసి వచ్చినది. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ పట్టణంలో గృహనిర్మాణ నిమిత్తం అదనపు గృహ నిర్మాణ అడ్వాన్సు క్రింద రూ.10 లక్షలు మంజూరు చేయడమైనది. మహిళా ఉద్యోగస్తులకు పిల్లలతో వారికున్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకొని 60 రోజులు పిల్లల సంరక్షణ సెలవును మంజూరు చేయడమైనది. ఉద్యోగుల ఆరోగ్య పథకం క్రింద చికిత్సా కార్డులు జారీచేయడమైనది.

131. ప్రభుత్వం పదవ వేతన సవరణ బాకీలను ఉద్యోగులకు చెల్లించే విషయాన్ని పరిశీలిస్తుంది.

**ఆర్థిక నిర్వాహణ**

132. గత బడ్జెట్ ప్రసంగంలో ఎస్.ఎ.పి. ప్లాట్ ఫారంపై కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మెనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఎండ్ సర్వీసెస్‌ను ప్రారంభింపజేస్తుందనే ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియచేసిన విషయం గౌరవ సభ్యుల దృష్టికి తెస్తున్నాను. ఆర్థిక శాఖ నియంత్రణలో పనిచేస్తున్న స్పెషల్ పర్పస్ వెహికల్ ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ ఎండ్ సర్వీసెస్ బడ్జెట్ రిసీట్స్ మాడ్యూల్స్‌ను ప్రారంభించిందని

తెలియచేయడానికి నేను చాలా ఆనందిస్తున్నాను. ఇవి విజయవంతంగా నడుస్తున్నాయి. త్వరలోనే ఎక్స్‌పెండిచర్, ఎకౌంటింగ్, హెచ్ఆర్ మాడ్యూల్స్ కూడా ప్రారంభమవుతాయి. ఈ టీమ్ సభ్యులను వారి కృషికి దీర్ఘకాలంగా సాగుతున్న స్వప్నాన్ని నిజం చేసినందుకు వారి పట్టుదలను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

133. సిఎఫ్ఎంఎస్ రిసీట్స్ మాడ్యూల్ ద్వారా పౌరుడు, వ్యాపారి లేదా ఉద్యోగి ప్రభుత్వంతో ఆన్‌లైన్‌లో ఎండ్ టు ఎండ్ వ్యవహారాలను జరిపే అవకాశం ఉంది. ఇంటినుంచిగాని, కార్యాలయంనుంచిగాని వెబ్/మొబైల్/టాబ్లెట్ ద్వారా ఆన్‌లైన్‌లో వ్యవహారాలు తేలికగా జరపగలగడం ప్రధాన మార్పు. నెట్ బ్యాంకింగ్, డెబిట్‌కార్డ్, క్రెడిట్ కార్డ్ వంటి బహుళ చెల్లింపు మాద్యాలతో పేమెంట్ ఏగ్రిగేటర్ ద్వారా సేవలు పొందటానికి వీలుంది. ఆన్‌లైన్‌తోపాటు, రాష్ట్రంలో స్టేట్‌బ్యాంక్‌లో ఏ శాఖ నుండైనా చెల్లింపులు జరపవచ్చు. ఈ విధానం ఏమాత్రం కష్టతరంకాని ఆటోరికన్సిలేషన్ జరిగి పూర్తి రెవిన్యూ రియలైజేషన్ సైకిల్ మెరుగై తద్వారా ఆదాయాన్ని ముందుగా రాష్ట్ర రాబడిని సరిగా అంచనావేసుకోవడానికి తద్వారా రాబడిలోటును సరిచూసుకోవడానికి తోడ్పడుతుంది.

134. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కి లక్ష్యాలను పూర్తిగా సాధించే క్రమంలో హేతుబద్ధమైన క్రమబద్ధీకరణ, సరళీకరణ కావించుకొని ఇఆర్‌పి అప్లికేషన్‌ను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రంగా మన రాష్ట్రం నిలిచింది. రిజర్వుబ్యాంక్ వారి ఇ-కుబేర్ 2.0 ను వినియోగించుకుంటూ బిల్లుల సమర్పణ, పరిశీలన, చెల్లింపుల క్రయలను కాగిత రహితంగా పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించే విధానాన్ని ప్రవేశపెట్టిన మొట్టమొదటి ప్రభుత్వం మనదే. ఈ క్రొత్త విధానాన్ని సరియైన మౌలిక సదుపాయాలు మరియు నెట్‌వర్క్‌లతో మద్దతు నెలకొల్పేందుకు మా ప్రభుత్వం తగిన చర్యలు,

కేటాయింపులు ప్రతిపాదిస్తుంది.

**రెవిన్యూ**

135. పన్ను పరిపాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఎన్నో ఉత్తమ అభ్యాసాలను అమలు చేస్తోంది. రూ.20 లక్షలు దాటి వ్యాపారకార్యకలాపాలను నిర్వహిస్తున్న వ్యాపార సంస్థలు ఇప్పటివరకు నమోదుకానట్లయితే, వీటిని ఈ పరిధిలోనికి తీసుకురావడానికి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించబడ్డాయి. జిఎస్‌టి వినియోగ ఆధారిత పన్ను. ఒకవేళ ఇన్వాయిస్‌లు జారీచేయబడనట్లైన ప్రభుత్వం తనకు రావలసిన పన్ను కొల్పోవలసివస్తుంది. కాబట్టి వ్యాపార సంస్థలకు వినియోగదారులకు పన్ను ఇన్వాయిస్‌లు జారీచేయడం చాలా ముఖ్యమైన పని.

**రిజిస్ట్రేషన్ మరియు స్టాంపులు**

136. ఆస్తి యజమానుల యొక్క ప్రయోజనాలను సురక్షితంగా ఉంచటానికి మరియు రిజిస్ట్రేషన్ సేవలలో పారదర్శకతను మెరుగుపరచేందుకు మా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. 2018 జనవరి 1వ తారీఖు నుండి పౌరులకు రిజిస్ట్రేషన్ ఉచితంగా సేవలను అందించే క్రమంలో ఎన్‌కంబరెన్స్ సర్టిఫికేట్స్, ఇతర సర్టిఫైడ్ కాపీలను ఆన్‌లైన్ ద్వారానే జనవరి 2018 నుండి ఉచితంగా పొందగలిగే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. పౌరులు చెల్లించే స్టాంపు డ్యూటీని స్టాక్ హోల్డింగ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఇ-స్టాంపు సదుపాయం ద్వారా చెల్లించేందుకు వీలుగా చర్యలు ప్రారంభించబడ్డాయి.

137. మండల రెవిన్యూ కార్యాలయాలు మరియు రెవిన్యూ డివిజనల్ కార్యాలయాలకు మంచి మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం ఎంతో

ఆశక్తి కలిగి ఉంది. రెవిన్యూ విభాగపు భవనాల నిర్మాణాలకై గత సంవత్సరంలో కేటాయించబడిన రూ.10 కోట్లు కంటే ఈ బడ్జెట్‌లో రూ.50 కోట్లు ప్రతిపాదిస్తున్నాను. అలానే ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు అంతే బడ్జెట్ ప్రతిపాదిస్తున్నాను.

**హోమ్**

138. అనంతపురం, కడప జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మహిళలకు మరియు పోలీస్‌లకు మధ్య అనుసంధానంగా వ్యవహరించడానికి, మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు, ఇబ్బందులలో ఉన్న మహిళలకు ఆసరాగా ఉండేందుకు మహిళా పోలీస్ వాలెంటీర్‌లను నియమించడం జరిగింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో ఉన్న 30 మోడల్ పోలీస్ స్టేషన్ భవనాలకు నిధులు మంజూరు చేయడం జరిగింది. ఇక్కడ పనులు ఎంతో పురోగతిలో ఉన్నాయి. అలానే అగ్నిమాపక మరియు విపత్తు నివారణ విభాగమునకు పటిష్టపరచుటకై గత సంవత్సరంకంటే ఈ సంవత్సరం బడ్జెట్‌ను ఎక్కువ ప్రతిపాదిస్తున్నాను.

139. 2017-18లో సంవత్సరంలో కేటాయించబడిన 5,221 కోట్ల రూపాయల కంటే 19.25% వృద్ధి రేటుతో రూ.6,226 కోట్ల రూపాయలను హోమ్ డిపార్ట్‌మెంట్‌కు ప్రతిపాదిస్తున్నాను.

**న్యాయశాఖ**

140. సబార్డినేట్ జ్యుడిషియరీ చెందిన న్యాయాధికారుల కోర్టు భవనాలు, గృహావసరాలకు నిర్మాణాలు చేయడం ప్రభుత్వ కార్యక్రమాలలో ఒకటి. 86 కోర్టు భవనాలను, 21 వసతి గృహాలను నిర్మించే 45 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి నేను రూ.95 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

141. పెడింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు అవసరాన్ని బట్టి న్యాయాధికారుల నియామకం ప్రభుత్వం చేబడుతుంది.

142. న్యాయశాఖకు నేను రూ.886 కోట్లు ప్రతిపాదిస్తున్నాను.

**ఆర్థిక వ్యవస్థ**

143. సమస్యకోర్చి నిలవాలనే రాష్ట్ర ప్రభుత్వ దృఢసంకల్పం సమస్యలనుండి బయటపడాలని విశిష్ఠ వ్యూహాలు రెండంకెల పరిపూర్వక అభివృద్ధి సాధన దిశలో విజయవంతమైన ఫలితాలిచ్చాయి. నిరంతర పరిపూరక రెండంకెల అభివృద్ధిని పదిహేను సంవత్సరాలపాటు సాధించే లక్ష్యంతో రాష్ట్రం సాగుతోంది. పయనం ఇప్పటికి ప్రోత్సాహకరంగా ఉంది. మనకు శుభారంభం చేకూరింది. గత మూడు సంవత్సరాల సాధన గణాంకాల ఆర్థికవ్యవస్థ అభివృద్ధిమార్గంలో నడుస్తున్నట్లు సూచిస్తున్నాయి.

144. 2014-15 సంవత్సరానికి రాష్ట్రం 9.2% అభివృద్ధి సాధించింది. దేశ వృద్ధిరేటు 7.4% గా నిలిచింది.

145. 2015-16 సంవత్సరంలో రాష్ట్రం గణనీయంగా 10.60% సాధించి దేశంలోనే రెండవ స్థానంలో నిలిచింది. దేశ వృద్ధిరేటు 8.2% గా నిలిచింది.

146. 2016-17 సంవత్సరంలో రాష్ట్రం రెండంకెల ప్రగతిని కొనసాగిస్తూ 11.01% అభివృద్ధిని సాధించగా యావత్భారత దేశం 7.1% ప్రగతిని సాధించింది.

147. నిరంతర అభివృద్ధి, సంతోషకరమైన సమాజానికి దోహదం చేసేది, ఆకట్టుకొనే ఆర్థికాభివృద్ధి రేటును కొనసాగించడం అనేది అత్యావశ్యం అనే విషయాన్ని

ప్రభుత్వం గుర్తించినది. వ్యవసాయ, పరిశ్రమ రంగాలపై దృష్టి పెట్టడమే కాకుండా ప్రభుత్వం ముఖ్యమైన ఉపరంగమైనటువంటి సేవా ఆర్థిక వ్యవస్థపైకూడా దృష్టి సారించుచున్నది. సేవారంగం ఆర్థికాభివృద్ధిరేటు పెంపుదలకు దోహదం చేస్తుందన్నది గుర్తించవలసిన విషయం. అలుపెరగని ప్రయత్నాలు, వినూత్న విధానాలతో ప్రభుత్వం 2017-18 సంవత్సరానికి మందస్తు అంచనాల ప్రకారం 11.22% వృద్ధిరేటు సాధించగా దేశాభివృద్ధిరేటు 6.6%గా ఉంది. మన రాష్ట్రం వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ రంగాలలో అత్యధికంగా 17.76% వృద్ధిరేటు సాధించగా జాతీయ వృద్ధిరేటు 3% వుంది. ఇది నీటివనరులను సరైనతీరులో ఉపయోగించడం వలన సాధ్యమైనది.

148. 2017-18 ముందస్తు అంచనాల ప్రకారం జీవన ప్రమాణానికి సూచికలుగా నిలిచే తలసరి ఆదాయం వృద్ధి కనబడుతుంది. 2016-17లో రూ.1,23,664 నుండి 14.87% వృద్ధిరేటు చూపుతూ రూ.1,42,054 తలసరి ఆదాయం పెరిగింది.

**2016-17 ఖాతాలు**

149. ఆంధ్రప్రదేశ్ అకౌంటెంట్ జనరల్ పరిష్కరించిన ఆర్థిక ఖాతాల ప్రకారం 2016 ఏప్రిల్ 1 నుండి 2017 మార్చి 31 మధ్య కాలానికి రూ.17,193.72 కోట్ల రెవెన్యూ లోటు, రూ.30,908.82 కోట్ల ఆర్థిక లోటు కనిపిస్తున్నది. 2016 ఏప్రిల్ 1 నుండి 2017 మార్చి 31 మధ్య కాలానికి రెవెన్యూ లోటు, ఆర్థికలోటు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వరుసగా 2.52 శాతం 4.52 శాతంగా ఉన్నాయి.

**సవరించిన అంచనాలు 2017-18**

150. సవరించిన అంచనాల ప్రకారం రెవన్యూ వ్యయం రూ.1,27,272.02 కోట్లు కేపిటల్ వ్యయం రూ.22,875.28 కోట్లు 2017–18 సంవత్సరానికి రెవిన్యూ లోటు దాదాపు రూ.4,018 కోట్లుకాగా ఆర్థికలోటు దాదాపు రూ.27,603.27 కోట్లు. ఇవి రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వరసగా 0.51% మరియు 3.48%

**బడ్జెటు అంచనాలు 2018-19**

151. 2018–19 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,91,063.61 కోట్ల వ్యయాన్ని నేను ప్రతిపాదిస్తున్నాను. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.1,50,270.99 కోట్ల మేరకు అంచనా వేయబడగా, క్యాపిటల్ వ్యయం రూ.28,678.49 కోట్లకు అంచనా వేయబడింది. 2017–18 బడ్జెటు అంచనాల కన్నా 2018–19 బడ్జెటు అంచనాలు మొత్తం మీద 21.69 శాతం పెరుగుదలను చూపిస్తున్నాయి. రెవెన్యూ వ్యయం సుమారు 19.35 శాతం పెరగనుండగా, కాపిటల్ వ్యయం 2017–18 ఆర్థిక సంవత్సరం కన్నా 30.60 శాతం ఎక్కువ కానుంది. రెవెన్యూ మిగులు రూ.5,235.24 కోట్ల మేరకు ఉండగలదని అంచనా వేయగా, ఆర్థిక లోటు సుమారు రూ.24,205.21 కోట్ల మేరకు ఉండగలదని అంచనా. ఆర్థిక లోటు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 2.78 శాతం ఉండగా, రెవెన్యూ మిగులు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 0.60 శాతం ఉండగలదు.

152. నా ఈ ప్రతిపాదనలు రాష్ట్రంలో ప్రతి పౌరుడు ఆనందంగా ఉండడానికి దోహదపడతాయని ప్రగాఢంగా నమ్ముతున్నాను. మరో మాటలో చెప్పాలంటే ఆనందదాయకమైన సమాజం స్థిరమైన సమసమాజ ఆర్థికాభివృద్ధి, పర్యావరణ

మరియు సాంప్రదాయ పరిరక్షణ అన్నింటికీ మించి సుపరిపాలన అనే మూలస్థంబాలపై ఆధారపడి ఉంటుంది.

153. మనం ప్రారంభించిన ఈ కఠిన ప్రయాణంలో ఎదురయ్యే ఒడిదుడుకులను నివృత్తి చేయలేకపోయినా, ఈ ప్రయాణ ఆశయాలయిన విజ్ఞానాధారిత భవిష్యత్ జీవావరణవ్యవస్థను ఏర్పాటు చేయగల శక్తియుక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకానికి మాత్రమే కలవని నా ప్రగాఢ విశ్వాసం. స్వావలంబమైన సమసమాజాన్ని నిర్మించడానికి మన రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు పూరించిన శంఖరావాన్ని అందిపుచ్చుకొని శాంతిసామరస్యాలతో కూడిన మెరుగైన ఆనంద సూచికల సాధన కొరకు ఈ రాష్ట్ర యువత అంతా ముందుకు రావాలని నేను కోరుకుంటున్నాను.

ఈ సందర్భంగా, స్వామి వివేకానందగారి స్ఫూర్తిదాయకమైన మాటలను గుర్తుచేసుకుంటూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

***"We are what our thoughts have made us; so take care about what you think. Words are secondary. Thoughts live; they travel far"***

154. అధ్యక్షా, ఈ మాటలతో నేను 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఈ సంక్షేమ ప్రజా బడ్జెట్‌ను గౌరవ సభ ఆమోదం కోసం సమర్పిస్తున్నాను.

– జై హింద్ –

జై ఆంధ్రప్రదేశ్

జై జన్మభూమి

# 2018-19 వ్యవసాయ బడ్జెట్ ప్రసంగము

**గౌరవ అధ్యక్షుల వారికి మరియు గౌరవ సభ్యులకు ముందుగా నా నమస్కారములు.**

తమరి అనుమతితో 2018-19 సంవత్సరానికి నేను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నాను. ఈ సందర్భంగా మన ప్రియతమ ముఖ్యమంత్రి గౌరవనీయులైన **శ్రీ నారా చంద్రబాబు నాయుడు** గారికి ఈ ప్రతిష్ఠాత్మక శాసనసభలో 5వ వార్షిక వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టే భాగ్యము కల్పించినందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

రైతు సంక్షేమం కోసం, **"రైతే ముందు"** నినాదంతో సాగు ఖర్చులు తగ్గించి, పంటల ఉత్పాదతకను పెంచడం ద్వారా అధిక నికర ఆదాయం సాధించి, రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయుటకు మరియు వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి వ్యవసాయరంగంలో ఉన్న అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మన ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు రూపొందించి అమలు చేయుచున్నది.

## ప్రాథమిక రంగ అభివృద్ధి :

ప్రాథమిక రంగంలో 2017-18 మొదటి అర్ధ సంవత్సరానికి గాను 25.60% వృద్ధి రేటు సాధించగా ఇది 2016-17లో 24.44%గా ఉంది. ఈ రంగంలో ముఖ్యంగా మొదటి అర్ధ సంవత్సరానికి మత్స్యశాఖ ద్వారా 42.73%, ఉద్యానశాఖ ద్వారా 18.62%, వ్యవసాయశాఖ ద్వారా 17.44% మరియు పశుసంవర్ధకశాఖ ద్వారా 13.68% వృద్ధి రేటు సాధించింది. 2016-17 సంవత్సరానికి ప్రాథమిక రంగ వృద్ధిరేటు దేశంలో 7.11% కాగా రాష్ట్రంలో 14.03% ఉంది.

**చుక్కపొద్దున లేచి.. నాగలికి నమస్కరించి...**
**పొలానికి ప్రణమిల్లి.. చెమట చుక్కలతో పంటను తడిపి...**
**ఏపుగా పెరిగిన పంటను బిడ్డగా భావించి, గుండెకు హత్తుకొని...**
**నిలువెల్లా పరవశించిపోయే సంతోషి కర్షకుడు...**
**నిత్యం ప్రతీ రైతులో ఈ సంతోషాన్ని చూడాలన్నదే మన చంద్రన్న సంకల్పం.**

**వ్యవసాయశాఖ :**

ఖరీఫ్ 2017 సీజన్‌లో 36.70 లక్షలహెక్టార్లలో వివిధ పంటలు సాగు అవ్వగా, ఇది సాధారణ విస్తీర్ణంలో 91 శాతం. కానీ, రబీ 2017-18లో 42 శాతం తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ, సాధారణ విస్తీర్ణంలో 96 శాతం (22.87లక్షలహెక్టార్లు) ఇప్పటివరకు సాగైనది.

రెండవ ముందస్తు అంచనాల ప్రకారం 2017-18సం॥లో 157.59 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తిని అంచనా వేసాం. ఇది 2016-17సం॥లో సాధించిన ఉత్పత్తి 149.16 లక్షల మెట్రిక్ టన్నుల కంటే 6 శాతం అధికం. వరి విస్తీర్ణం గత సంవత్సరంతో పోల్చితే 3 శాతం తగ్గినప్పటికీ, ఖరీఫ్‌లో సరాసరి వరి దిగుబడి హెక్టారుకు 5176 కిలోలు రావటం వలన ఈ ఉత్పత్తి సాధించగలిగాం. 21.43 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి గత సంవత్సరంతో పోలిస్తే 29 శాతం అధికంగా నమోదయింది. ఖరీఫ్ 2017లో ఈ పంట ఉత్పాదకత గత సంవత్సరాలలో ఎన్నడు లేని విధంగా అత్యధికంగా హెక్టారుకు 4587 కిలోలుగా నమోదయింది. పప్పుధాన్యాల ఉత్పత్తి 2017-18 సంవత్సరంలో 11.44 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా వేయగా, ఇది గత సంవత్సరం నమోదైన 9.31లక్షల మెట్రిక్ టన్నుల కంటే 23 శాతం అధిక ఉత్పత్తిని అంచనా వేసాం.

వేరుసెనగ పంటలో 31 శాతం విస్తీర్ణం తగ్గినప్పటికీ 2017 ఖరీఫ్‌లో ఉత్పాదకత హెక్టారుకు 1238 కిలోలకు అనగా గత సంవత్సరం కంటే 195 శాతం అధికంగా నమోదవడంవల్ల 8.02 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని సాధించాం.

భారతదేశంలో మన రాష్ట్రం పంటల ఉత్పాదకతలో మొక్కజొన్న ద్వితీయ స్థానములో, వరి మూడవ స్థానంలో, ప్రత్తి మరియు చెఱకు పంటలు నాల్గవ స్థానంలో నిలిచాయి. ఇదేవిధంగా ఉత్పత్తిలో, మన రాష్ట్రం వరి, మొక్కజొన్న మరియు వేరుసెనగ పంటలలో రెండవ స్థానంలో ఉంది.

గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాలతో, దేశంలోనే అత్యధిక వ్యవసాయ ఉత్పాదకత సాధించే లక్ష్యంతో, రాష్ట్రంలోని ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని అమలు చేస్తున్నాము.

పట్టిసీమ ద్వారా ముందస్తుగా (జూన్17న) కృష్ణా డెల్టాకు నీరు విడుదల చేయుట ద్వారా 11 లక్షల ఎకరాల విస్తీర్ణం స్థిరీకరించటమే గాకుండా, రైతాంగం సుమారు రూ.3416 కోట్ల విలువ గల వరి పంట దిగుబడులను సాధించారు. అంతేగాకుండా ముందస్తు నీటి విడుదల ద్వారా గత సంవత్సరం కంటే రబీలో అదనంగా 75 వేల ఎకరాలలో వివిధ పంటల సాగు చేయుటకు వీలు కలిగింది.

## గోదావరి డెల్టా:

గోదావరి డెల్టాకు జూన్ 1వ తేదిన నీటిని విడుదల చేయటం వలన ఖరీఫ్ పంట దిగుబడులు గణనీయంగా పెరిగాయి. రబీ పంట చివరి దశలో వచ్చే నీటి ఎద్దడిని కూడా సమర్థవంతంగా నివారించుటకు మార్గం సుగమమైనది. మూడవ పంటగా వేసవి అపరాల సాగు విస్తీర్ణం పెంచటమే గాకుండా పచ్చిరొట్ట పైరులు సాగు చేయటానికి వీలు కలిగింది.

## నాగార్జున సాగర్ ఆయకట్టు:

రాష్ట్ర విభజన తరువాత నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా మన రాష్ట్ర నీటివాటా 132 TMCలు మాత్రమే. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులకు సమగ్ర పంటల విధానాలను సూచించటం ద్వారా రైతుల ఆదాయాన్ని సుస్థిర పరిచాం. ఎక్కువ విస్తీర్ణంలో రబీ పంటల సాగుకు మరియు అధిక ఉత్పాదకతను సాధించటానికి NSP ద్వారా 40 TMCల నీటిని విడుదల చేసాం.

**అధ్యక్షా!**

**భూసార పరిరక్షణ :**

ప్రతీ రైతుకు భూసార విశ్లేషణా పత్రాన్ని అందించే లక్ష్యంగా మొదటి విడతలో మూడు దశలలో 54.27 లక్షల భూసార పరీక్షా ఫలితాల పత్రాలను రైతులకు అందజేసాం. ఈ పథకం అమలులో భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది.

2018-19 సంవత్సరానికి భూసార పరీక్ష ఫలితాల పత్రాల పంపిణీ లక్ష్యం 35.58 లక్షలుగా నిర్ణయించాం. సాంప్రదాయ పద్ధతి అత్యంత వ్యయ ప్రయాసలతో కూడుకొని ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వం బిల్ & మిలిందా గేట్స్ ఫౌండేషన్ (Bill & Melinda Gates Foundation ) తో ఒప్పందం కుదుర్చుకొని, డిజిటల్ సాయిల్ మ్యాపింగ్ (Digital Soil Mapping) అనే వినూత్న విధానమును ఆచరించి, రైతాంగానికి వారి యొక్క క్షేత్ర పోషకాల స్థాయిని తెలియ చేయుచూ ఎరువుల యాజమాన్యంపై సూచనలు చేస్తాం.

**రైతులకు 100% రాయితీతో సూక్ష్మపోషకాల పంపిణీ:**

భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా మన రాష్ట్రంలో భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా 100% రాయితీతో సూక్ష్మపోషకాల ఎరువులను రైతులకు పంపిణీ చేసాం. ఇందు కొరకు 2017-18 సం॥లో రూ.86.50 కోట్లు ఖర్చు చేసాం. తద్వారా వివిధ పంటలలో 10 నుండి 15 శాతం అధిక దిగుబడులు సాధించాం. వివిధ పంటలలో రూ.719.98 కోట్లు విలువ గల అధిక రాబడిని సాధించాం.

**విత్తనాల సరఫరా:**

సకాలంలో నాణ్యమైన విత్తనాలను రాయితీపై పారదర్శకంగా రైతులకు సరఫరా చేయుటకు ఆధార్ అనుసంధానంతో బయోమెట్రిక్ విధానం ద్వారా రూ.419 కోట్లు సబ్సిడీ విలువగల 10.07 లక్ష క్వింటాళ్ళ విత్తనాలు రైతులకు పంపిణీ చేసాం. ఈ విత్తన పంపిణీ విధానమునకు రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక CSI - Nihilent e- Governance Project Excellence జాతీయ స్థాయి అవార్డు లభించింది.

మన ప్రభుత్వ నిర్ణయానుసారం దీర్ఘకాల బెట్ట పరిస్థితులు, కరువును ఎదుర్కొంటున్న రాయలసీమ జిల్లాలకు , రూ. 25.31 కోట్లు విలువ చేసే 31,595 క్వింటాళ్ళ ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను **100% రాయితీతో** రైతులకు సరఫరా చేసాం.

అంతేగాకుండా గిరిజన ప్రాంత రైతులకు విత్తనాల రాయితీని 33% నుంచి 50% పెంచి, వేరుసెనగ విత్తనాలను 90% రాయితీపై సరఫరా చేసాం.

## మెగాసీడ్ పార్క్ ఏర్పాటు:

రాష్ట్రాన్ని ప్రపంచ **"విత్తన హబ్"**గా తీర్చి దిద్ది ప్రతీ ఒక్కరైతుకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలనే ఉద్దేశ్యముతో రాష్ట్ర ప్రభుత్వం, కర్నూలు జిల్లాలోని తంగడంచ గ్రామంలో 627ఎకరాలలో ఉన్న వ్యవసాయ విత్తన క్షేత్రములో, రూ. 650కోట్ల అంచనాతో, ప్రపంచములో విత్తన పరిశోధనలో ప్రఖ్యాతిగాంచిన అయోవా విశ్వవిద్యాలయము, అమెరికా వారి విజ్ఞాన మరియు సాంకేతిక భాగస్వామ్యంతో ఈ మెగాసీడ్ పార్క్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా ఏర్పాటు చేసాం. దీనిలో రాష్ట్ర వ్యవసాయశాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయము, ఉద్యానశాఖ, ఉద్యాన విశ్వవిద్యాలయము, ఎన్.జి.ఓలు, ప్రైవేటు విత్తన సంస్థలు మరియు అభ్యుదయ రైతులు (FPOs) భాగస్వాములుగా ఉంటారు.

దేశంలోనే మొట్టమొదటిదైన ఈ మెగా సీడ్ పార్క్, దేశ విదేశాలలోని ప్రముఖ విత్తనోత్పత్తి సంస్థల సహకారంతో నాణ్యమైన మరియు నూతన వంగడములు అభివృద్ధి చేయుటకు కావలసిన అన్ని మౌళిక సదుపాయాలను సమకూరుస్తాం. విత్తనోత్పత్తి మరియు ప్రాసెసింగ్ రంగాలలో పరిశోధన మరియు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించుటకు ఈ పార్క్ ఉపయోగపడుతుంది.

## రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించుట:

గౌరవ ముఖ్యమంత్రి గారి చొరవతో, అంతర్జాతీయ స్థాయిలో వ్యవసాయంలో అమలవుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంలోని రైతాంగానికి అందించుటకు, "అగ్రిటెక్ శిఖరాగ్ర సమావేశాన్ని" నవంబరు 2017లో విశాఖపట్నంలో నిర్వహించాం.

ఈ సందర్భంగా పోటీ ఏర్పాటు చేసి (పిచ్‌కాంపిటీషన్) వివిధ వినూత్న సాంకేతిక పద్ధతులను తెలియజేసిన 5 సంస్థలను ఎంపిక చేసాం. దీని ద్వారా రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల దృష్ట్యా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివిధ జిల్లాలో వినియోగిస్తాం. ఇందులో భాగంగా ఇన్‌ఫీనియం సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (Infinium Solutions Pvt.Ltd), శాట్‌సూర్ ఎనలైటిక్స్ ఇండియా (Satsure analytics India), కిసాన్ నెట్‌వర్క్ (Kisan Network), క్రిషిస్టార్ (Krishi Star), బిగ్‌హాట్ అగ్రోప్రైవేట్ లిమిటెడ్ (BigHaat Agro Pvt.Ltd) వంటి సంస్థలతో వివిధ సాంకేతిక పరిజ్ఞానాలపై ఒప్పందం కుదిరింది.

## ఉత్తరాంధ్ర జిల్లాలలో దిగుబడుల వృద్ధికి చర్యలు:

ఉత్తరాంధ్ర జిల్లాలలో వివిధ పంటలలో తక్కువ దిగుబడులు రావటం గమనించాం. దీనిని పరిష్కరించుటకు రైతులతో, విస్తరణాధికారులతో మరియు శాస్త్రవేత్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాం. ఫలితంగా ఆయా జిల్లాలలో లోటుపాట్లను గమనించి 50 శాతం రాయితీపై విత్తనాలు, కలుపు మందులను సరఫరా చేసాం. తద్వారా ఖరీఫ్‌లో అదనంగా లక్ష ఎకరాలలో వరి నేరుగా విత్తుకొనే విధానాన్ని ప్రోత్సహించి అధిక దిగుబడిని సాధించాం. శ్రీకాకుళం జిల్లాలో రబీ 2017-18 కాలంలో అదనంగా 1.75 లక్షల ఎకరాల్లో పంటల విస్తీర్ణం పెరిగింది.

## ఎరువుల యాజమాన్యం:

మన రాష్ట్రం రసాయనిక ఎరువుల వాడకంలో దేశంలోనే 6వ స్థానంలో ఉంది. ఈ వాడకాన్ని మరింత తగ్గించే దిశగా, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం, సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్ని ప్రోత్సహించడం ద్వారా, ఖరీఫ్ 2017 సీజన్‌లో 1.57 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగాన్ని తగ్గించగలిగాం. తద్వారా రైతులకు రూ. 223 కోట్లు ఆదా అవ్వగా కేంద్ర ప్రభుత్వానికి రూ. 152 కోట్లు సబ్సిడీని ఆదా చేయగలిగాం. భారత ప్రభుత్వ విధానాలను

అనుసరించి, పారదర్శక పంపిణీ కొరకు e-Pos యంత్రాలను ఉపయోగించి DBT విధానం ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నాం.

## ప్రకృతి వ్యవసాయం:

గౌరవ ముఖ్యమంత్రి గారి దూరదృష్టికి అనుగుణంగా రైతాంగం యొక్క ధీర్ఘకాలిక సంక్షేమం, వాతావరణ మార్పుల పరిణామాల నుండి సంరక్షణ కొరకు రాష్ట్రాన్ని ఒక "ఆర్గానిక్ హబ్"గా మార్చుటకు ప్రపంచ దేశాలకు ప్రకృతి స్నేహపూర్వక వ్యవసాయ విధానాలు అమలుపరచే క్రమంలో మన రాష్ట్రం కేంద్ర బిందువుగా, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్ని ప్రోత్సహిస్తున్నాం. 2022 నాటికి 5 లక్షల హెక్టార్లలో, 5 లక్షల మంది రైతులచే అన్ని మండలాల్లో చేపట్టుటకు ప్రణాళికను నిర్దేశించాం. ఇప్పటివరకు రాష్ట్రంలో 66,930 హెక్టార్లలో, 1.63 లక్షల రైతులు వివిధ పంటలలో ఈ విధానాన్ని అవలంబించుచున్నారు.

ఇందుకొరకు అజీమ్ ప్రేమ్‌జీ ఫిలాంత్రఫిక్ ఇనిషియేటివ్‌తో రూ. 100 కోట్లతో మన ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకొన్నది.

UNEP, FAO, CGIAR, C-AGG వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు శాస్త్ర సాంకేతిక పరంగా తోడ్పాటు అందించడానికి ఆసక్తి కనపరచాయి.

**అధ్యక్షా!**

## వ్యవసాయ యాంత్రీకరణ :

వ్యవసాయం ఖర్చు తగ్గించి, సకాలంలో వ్యవసాయ పనులు చేపట్టి అధిక ఉత్పాదకత సాధించుటకు యాంత్రీకరణపై మన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఉభయ గోదావరి జిల్లాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్ల (CHCs)ను ఏర్పాటు చేసి సన్న, చిన్నకారు రైతులకు కూడా అధిక విలువగల యంత్రపరికరములు లభ్యమయ్యే విధంగా వివిధ కంపెనీలతో అవగాహన ఒప్పందం

కుదుర్చుకున్నాం. వరి సాగులో నేల చదును మొదలుకొని పంటకోత మరియు నూర్పిడి వరకు కావలసిన అన్ని పరికరాల్ని రైతులకు అందించాం. ఈ పథకం 2018-19 సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించాం.

రైతుల వద్ద ఉన్న వ్యవసాయ యంత్ర పరికరాలను సమర్థవంతంగా వినియోగించుటకు "ఉబరైజేషన్" (Uberisation) విధానం ద్వారా యంత్ర పరికరాలు అనుసంధానం చేయబడి చరవాణి అప్లికేషన్ ద్వారా రైతులు తమకు కావలసిన పరికరాన్ని ఎంపిక చేసుకొని వాడుకొనే విధంగా పైలెట్ పద్ధతిలో తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా మరియు గుంటూరు జిల్లాలలో ప్రారంభించాం. దీని సత్ఫలితాల దృష్ట్యా రాష్ట్రం మొత్తంలోరాబోయే పంట కాలంలో అమలు చేయటానికి అన్ని చర్యలు తీసుకున్నాం.

## రైతు రథం పథకం :

రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పెద్ద ట్రాక్టర్లు మరియు రోటోవేటర్ల పంపిణీని **"రైతు రథం"** పథకం ద్వారా రైతులకు గరిష్ఠంగా రూ. 2.5 లక్షల రాయితీతో 12,670 ట్రాక్టర్లను సరఫరా చేయుట లక్ష్యంకాగా, ఇప్పటివరకు 11,900 ట్రాక్టర్లను రైతులకు మంజూరు చేసాం.

## జలవనరులశాఖ ద్వారా సమన్వయం:

జలవనరుల శాఖ ద్వారా నీటి ప్రణాళికను తయారు చేసుకొని సమర్థవంతంగా నీటి వినియోగం చేయడం ద్వారా అధిక ఉత్పాదకతను సాధించాం. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, నీటి ఎద్దడికి గురౌచున్న ప్రాంతాలను ముందుగానే అంచనా వేసి పంటలను జల ఫిరంగులను ఉపయోగించి రక్షక తడులు ఇవ్వడం ద్వారా సుస్థిర దిగుబడి స్థాయిలను సాధిస్తున్నాం.

## వ్యవసాయ ఋణాలు:

రైతులు సకాలంలో పెట్టుబడులు సమకూర్చుకొనుటకు 2017-18 సంవత్సరానికి పంట ఋణాల లక్ష్యం రూ. 63,106 కోట్లకుగాను రూ. 60,616 కోట్లు (96%) మరియు

దీర్ఘకాలిక ఋణాల లక్ష్యం రూ. 24,365 కోట్లు కాగా, రూ. 17,678 కోట్ల (73%)ను ఇప్పటివరకు రైతులకు అందచేసాం.

రాష్ట్రంలో కౌలు రైతుల ఆర్థిక ఇబ్బందుల వలన సకాలంలో వివిధ ఉపకరణాలు సమకూర్చుకోలేక పోవడం, పంటల ఉత్పాదకత మీద గణనీయ ప్రభావం చూపుతుంది. దీనిని పరిష్కరించుటకు భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా పంట సాగు ధృవీకరణ పత్రం అందచేసి, తద్వారా కౌలు రైతులకు ఋణ సౌకర్యం కల్పించిన ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్. ఇప్పటివరకు 7.25 లక్షల కౌలు రైతులకు రూ. 2346 కోట్లు ఋణాల పంపిణీ చేసాం.

## రైతు ఋణ ఉపశమన పథకం:

గౌరవ ముఖ్యమంత్రి గారు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం, స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి సారిగా రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుండి రూ. 24 వేల 500 కోట్లు కేటాయించి వ్యవసాయ ఋణ ఉపశమన పథకం క్రింద మొదటి రెండు విడతలలో 54.98 లక్షల రైతులకు రూ. 10,867 కోట్లు రైతుల ఖాతాలలో జమచేసాం. మూడవ విడతగా 2017-18 సంవత్సరములో 10 శాతం వడ్డీతో కలిపి రూ. 3,629 కోట్లు 26.23 లక్షల ఖాతాలకు కేటాయించగా, ఇప్పటివరకు రూ. 3069.83 కోట్లు 26.23 లక్షల రైతు ఖాతాలలో జమచేసాం.

ఋణ ఉపశమన పథకముపై రైతులనుండి ఎటువంటి ఫిర్యాదులనైనా స్వీకరించి, అర్హత ఉన్న ప్రతీ రైతుకి ఋణ ఉపశమనం అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

## చంద్రన్న రైతు క్షేత్రాలు:

చంద్రన్న రైతు క్షేత్రాల ద్వారా సాగు ఖర్చులను తగ్గించి అధిక దిగుబడులను సాధించుటకు ఉత్తమ సాంకేతిక యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. 2017-18 సం॥లో 3500 చంద్రన్న రైతు క్షేత్రాలు ఏర్పాటు చేసాం. వివిధ పంటలలో

ఈ క్షేత్రాల ద్వారా వేరుసెనగలో 25 నుండి 30%, వరిలో 15 నుండి 20% అధికంగా ఉత్పాదకతను సాధించి మిగతా రైతులు పాటించే విధంగా చర్యలు చేపడుతున్నాము.

**బాహ్య సహాయక ప్రాజెక్టులు** (Exernally Aided Projects):

1. **ఆంధ్రప్రదేశ్ కరువు నివారణ ప్రాజెక్టు :**

కరువు బారి నుండి రైతులను విముక్తి చేయుటకు మరియు వారి ఆదాయాన్ని మెరుగుపరచుటకు ఆంధ్రప్రదేశ్ కరువు నివారణ ప్రాజెక్టు (APDMP)ను అమలు చేస్తున్నాం. కరువు నివారణ ద్వారా అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు మరియు ప్రకాశం జిల్లాల్లోని 1.65 లక్షల రైతు కుటుంబాలను 5సం॥లలో ఈ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం సుమారు రూ.1042 కోట్లు కాగా, అందులో రూ.528.24 కోట్లు అంతర్జాతీయ వ్యవసాయాభివృద్ధి నిధి (IFAD) నుండి సమకూరుస్తాం.

2. **ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అండ్ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్ :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 1600 కోట్లతో 2 లక్షల మంది రైతు కుటుంబాలకు 1211 చెరువు ఆయకట్టు ప్రాంతాల్లోని 1.47 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమికి లబ్ధి చేకూరేలా ప్రాజెక్ట్‌ను ప్రపంచ బ్యాంక్ నిధులతో 6 సంవత్సరాలలో అమలు పరిచేలా చర్యలు చేపడుతుంది. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.450 కోట్లు కేటాయించాం.

3. **జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) :**

జైకా ప్రాజెక్ట్ క్రింద రూ. 2 వేల కోట్లు నీటిపారుదల, వ్యవసాయ మరియు అనుబంధ శాఖలకు కేటాయించాం. రూ.420 కోట్లతో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత నిస్తుంది. ఈ ప్రాజెక్ట్ వ్యవసాయ యంత్రాల శిక్షణా కేంద్రాలు స్థాపించి సమగ్ర జీవనాధార అభివృద్ధికి ప్రణాళికను ప్రతిపాదించాం.

ఈ శిక్షణా కేంద్రాలు గ్రామీణ యువతకు, రైతులకు అన్ని రకాల వ్యవసాయ యంత్రాల నిర్వహణపై శిక్షణ నిస్తాయి. 20 రైతు ఉత్పాదకత సంఘాలు మరియు 921 గ్రామ స్థాయి సంఘాల ఏర్పాటుకు ఈ ప్రాజెక్ట్ ప్రోత్సహిస్తోంది.

## అగ్రి బిజినెస్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్ :

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు చాలా వరకు రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రంలోనే కేంద్రీకృతమై ఉన్నందున వారు అందించే వివిధ వ్యవసాయ ఉపకరణాలు రైతులకు సకాలంలో అందకపోవడం వలన కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవటాన్ని గమనించాం. అందువలన మన రాష్ట్రంలో అటువంటి పరిశ్రమలను నెలకొల్పటానికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తగిన పోత్సాహకాలు అందించి, నియమ నిబంధనలను అత్యంత సరళీకృతం చేసి, రాష్ట్రంలో అనువైన జిల్లాల్లో వారు పరిశ్రమల స్థాపన చేసుకొని, రైతాంగానికి చేయూత నివ్వటమే గాకుండా వాటి ద్వారా ఉద్యోగ కల్పనావకాశలు మెరుగుపరిచేలా చేస్తాం. 31.01.2018 తేదిన విజయవాడలో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో 2 వ్యవసాయ ఆధారిత సంస్థలు వారి యొక్క కర్మాగారాలను నెల్లూరు జిల్లాలో నెలకొల్పుటకు రూ. 275 కోట్ల పెట్టుబడితో 1200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించటానికి ముందుకు వచ్చాయి.

అదేవిధంగా సూక్ష్మ సేద్య పథకానికి (Micro Irrigation Project) సంబంధించిన బిందు మరియు తుంపర సేద్య పరికరాలు ఉత్పత్తి చేసే సంస్థలు ఉత్తర భారతదేశంలోనే ఉన్నాయి. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయబోయే ప్లాస్టిక్ పార్క్ హబ్ నందు 11 సంస్థలు వారి యొక్క ఉత్పత్తి కేంద్రాలను రూ. 148కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయుటకు MOU చేసుకొన్నాం. దీని ద్వారా 1100 మందికి ప్రత్యక్షంగా మరియు 2000 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు కల్పించేలా చూస్తాం. వీటి ద్వారా బిందు మరియు తుంపర సేద్య పరికరాలు రాష్ట్రంలోనే త్వరితంగా ఉత్పత్తి జరిగి సకాలంలో రైతులకు అందిస్తాం.

## పంటల బీమా పథకం :

2016-17సంవత్సరంలో బీమా చేసుకొని పంట నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ కంపెనీలు రూ.809.60 కోట్లు మంజూరు చేసి, 7.89 లక్షల రైతుల ఖాతాలకు జమ చేసాం. 2017-18 సంవత్సర కాలంలో మొత్తం 16.85 లక్షల రైతులు ఇప్పటివరకు పంటల బీమా చేసుకొనియున్నారు.

## ప్రకృతి వైపరీత్యాలు :

రాష్ట్రంలో సంభవించే ప్రకృతి వైపరీత్యాల వలన రైతాంగం పంటలను తరచుగా నష్టపోవడం జరుగుతుంది. కేంద్రప్రభుత్వం నిర్ణయించిన పెట్టుబడి రాయితీ తక్కువగా ఉన్న విషయం దృష్టిలో ఉంచుకొని ఈ రాయితీని మన గౌరవ ముఖ్యమంత్రి గారి చొరవతో గణనీయంగా పెంచాం. ఇప్పటివరకు వివిధ ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన మొత్తం 16.38 లక్షల రైతులకు రూ.1904.63 కోట్ల పెట్టుబడి రాయితీని వారి ఖాతాలలో నగదు బదిలీ పథకము (Direct Benefit Transfer) ద్వారా జమ చేసాం.

**అధ్యక్షా!**

## 2018-19 బడ్జెట్ ప్రతిపాదనలు :

2018-19లో మొత్తము వ్యవసాయ బడ్జెట్ **రూ.7607.49 కోట్లు** కాగా, రెవెన్యూ వ్యయం **రూ.7372.49 కోట్లు** మరియు పెట్టుబడి (Capital) వ్యయం **రూ.235 కోట్ల**ను ప్రతిపాదించాము.

సకాలంలో నాణ్యమైన విత్తనాలు రాయితీపై రైతులకు అందించటానికి గాను రూ.220 కోట్లను ప్రతిపాదించాము.

రాష్ట్రంలో మెగాసీడ్‌పార్క్ కంపెనీ లిమిటెడ్ నిర్వహణ కొరకు ఈ బడ్జెట్‌నందు **రూ. 100 కోట్లను** ప్రతిపాదించాము.

సూక్ష్మ పోషక లోపాల సవరణ ద్వారా వివిధ పంటల్లో సాధించిన అధిక ఉత్పాదకత దృష్ట్యా 2018-19 సంవత్సరానికి ఈ పథకం కోసం రూ.59.87 కోట్లను కేటాయించాము.

పంటలలో సుస్థిర దిగుబడిని సాధించుటకు వివిధ భూసార మరియు నీటి సంరక్షణ పద్ధతులను అమలు చేయట కొరకు, ఇందుకోసం రూ. 5.20 కోట్లను ప్రతిపాదించాము.

పెరుగుతున్న వ్యవసాయ యంత్రాల అవసరాన్ని తీర్చేందుకు వ్యవసాయ యాంత్రీకరణ కొరకు **రూ.258.16** కోట్లను కేటాయించాము.

క్షేత్రస్థాయి శిక్షణ మరియు నైపుణ్య సామర్థ్య అభివృద్ధిపై మా ప్రభుత్వం దృష్టి పెట్టడం పెట్టింది. దీని కోసం **రూ.81.77 కోట్ల**ను పొందుపరిచాము.

వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని **"పొలం పిలుస్తోంది"** మరియు **"చంద్రన్న రైతు క్షేత్రాల"** ద్వారా రైతులను చైతన్య పరిచే కార్యక్రమ నిర్వాహణ కొరకు రూ.12.58 కోట్లను ప్రతిపాదించాము.

వ్యవసాయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి క్రాప్ బుకింగ్, పంటలు మరియు వాతావరణ సలహాలు, మార్కెటింగ్ అనుసంధానం కొరకు, ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. ఇందుకు గాను రూ.34.84 కోట్లను కేటాయించాము.

ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను నిల్వచేస్తూ పంట సమయంలో అవసరమైన ఎరువులను సకాలంలో కొరతలేకుండా సరఫరా చేయుటకు,రూ.40 కోట్లను పొందుపరచాము.

మండల, జిల్లాస్థాయిలలో కార్యాలయ భవనముల ఏర్పాటు చేయుట కొరకు రూ.5 కోట్లను ప్రతిపాదించాము.

## వడ్డీలేని ఋణాలు :

లక్ష రూపాయల వరకు తీసుకున్న పంట ఋణం సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే రైతులకు వడ్డీలేని పంట ఋణ సౌకర్యాన్ని కల్పించాం. దీనికొరకు రూ.172 కోట్లను ప్రతిపాదించాము.

**పావలా వడ్డీ :**

ఒక లక్ష రూపాయల నుండి 3 లక్షల రూపాయల వరకు పంట ఋణాలు పొందిన రైతులు సకాలంలో ఋణం తిరిగి చెల్లించినట్లయితే పావలా వడ్డీతో పంట ఋణాలు పొందే సౌకర్యాన్ని కల్పించాం. దీనికొరకు రూ. 5.44కోట్లను ప్రతిపాదించాము.

పంటల బీమా పథకమును ఎక్కువమంది రైతులకు వర్తించుటకు విధి విధానాలను తదనుగుణంగా మార్పు చేస్తూ కనీసం 50% రైతులకు చేరే విధంగా "ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన" పథకాన్ని అమలు చేయుచున్నాం. దీనికొరకు రూ. 485 కోట్లను కేటాయించాము.

**ఋణ ఉపశమనము**

రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానానికి అనుగుణంగా రైతులను ఆదుకొనేందుకు ఋణ ఉపశమనము 4వ విడతగా రూ. 4100 కోట్లను ప్రతిపాదించాము.

రాయలసీమ మరియు ప్రకాశం జిల్లాలలో కరువు నివారణ (IFAD Project) కొరకు రూ. 100 కోట్లు కేటాయించాము.

**ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం :**

ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 1) రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, 2) వ్యవసాయాన్ని వాతావరణ అనుకూలంగా మార్చి భావితరాలకు వీలైన వృత్తిగా మార్చడం, 3) విద్యార్థులను, 'ఉద్యోగాలు ఆశించడం' నుండి 'ఉద్యోగాలను సృష్టించేలా' తీర్చిదిద్దడం మరియు 4) పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించి, ఆహార మరియు పోషక భద్రతను సాధించడం అనే అంశాలపై దృష్టి సారిస్తుంది.

**'వ్యవసాయాన్ని లాభసాటి చేయడమ'**నే ముఖ్య లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 13 జిల్లాలలో వ్యవసాయం, వ్యవసాయ ఇంజనీరింగ్ మరియు గృహ విజ్ఞాన శాస్త్రాల్లో విద్య, పరిశోధన మరియు విస్తరణ కార్యక్రమాల్ని విశ్వవిద్యాలయం చేపడుతున్నది. విశ్వవిద్యాలయం హెడ్ క్వార్టర్స్ భవనాలు మరియు ఇతర సదుపాయాలను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

విశ్వవిద్యాలయం ఐదవ డీన్స్ కమిటీ సిఫార్సుని అనుసరించి దేశంలోనే మొదటిసారిగా వివిధ డిగ్రీ ప్రోగ్రాంల పాఠ్య ప్రణాళికను సవరించినది. ఈ విశ్వవిద్యాలయం నుంచి పట్టా అందుకున్న విద్యార్థులు, ఉన్నత విద్యాభ్యాసం మరియు ఉద్యోగ అవకాశాలను దేశ విదేశాలలో పొంది, బాగా స్థిరపడ్డారు. విశ్వవిద్యాలయం యొక్క అడ్వాన్స్డ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్, గుంటూరు, ప్రత్యేకమైన మరియు సమగ్రమైన పి.జి. మరియు పి.హెచ్.డి. కోర్సులు అందజేస్తుంది. అలాగే, తిరుపతిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ ఎం.బి.ఎ. (అగ్రి బిజినెస్) కోర్సును అందిస్తున్నది.

2017-18 సం॥లో వరి రకం 'సమృద్ధి' (ఎమ్.టి.యు. 1155)ని జాతీయ స్థాయిలో విడుదల చేసాం. వరి, వేరుసెనగ, రాగి మరియు జొన్నలలో 17 అభివృద్ధి చేయబడిన రకాలు రాష్ట్ర స్థాయిలో విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాయి.

బ్రీడరు విత్తనం 14,443 క్వింటాళ్ళు మరియు మూల విత్తనం 10,297 క్వింటాళ్ళ ఉత్పత్తి చేసి, వాటిని విత్తన సంస్థలకు మరియు రైతులకు సరఫరా చేసాం. అంతేగాకుండా, 370 టన్నుల జీవన ఎరువులు (335 టన్నులు పొడరు రూపంలో, 35 టన్నులు ద్రవ రూపంలో) ఉత్పత్తి చేసి సరఫరా చేసాం.

2017-18 సం॥లో విజయరాయి (పశ్చిమ గోదావరి జిల్లా) లో ప్రత్యేకంగా మొక్కజొన్న పరిశోధనా కేంద్రం, గుంటూరు, లాం లో జియో స్పేషియల్ టెక్నాలజీ సెంటర్; వరి, అపరాలు, పసుపు మరియు మిరప కొరకు బాపట్లలో మోడల్ అగ్రో ప్రాసెసింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేసాం. ఇవే గాకుండా, "ఆంగ్రూ ఫుడ్స్" అనే 'బ్రాండ్ నేమ్'తో పదార్థాలను తయారు చేయడానికి "ఫుడ్ ప్రాసెసింగ్ మరియు వాల్యు ఎడిషన్ యూనిట్‌ను" ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాంలో అంకుర పరిశ్రమ (స్టార్టప్)గా ఏర్పాటు చేసాం.

"ఆంగ్రూ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ సిస్టిమ్ (ఎ.ఆర్.ఎమ్.ఎస్.) మరియు సమాచార ప్రసార టెక్నాలజిలైన మొబైల్ ఆప్స్‌లను ఉపయోగించి రైతులకు సకాలంలో సమాచారం చేరవేస్తున్నాం.

ఇటీవల విశ్వవిద్యాలయం కొన్ని పాలనాపరమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. విశ్వవిద్యాలయంలో విద్య, పరిశోధన మరియు విస్తరణ సంస్థలకు ఒకే విధమైన సాధారణ పనివేళలు నిర్ణయించింది. సమగ్ర విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ వ్యవస్థ; విద్యావాన్ పోర్టల్‌తో యూనివర్శిటి సిబ్బంది మరియు విద్యార్థుల హాజరు అనుసంధానం; జిల్లా ఏరువాక కేంద్రాలను వేరుగా కాకుండా, కె.వి.కెలు లేదా పరిశోధనా స్థానాలలో ఏర్పాటు చేయడం ద్వారా పని తీరును సమర్ధవంతంగా నిర్వహించడం జరుగుచున్నది.

2018–19లో మొత్తము బడ్జెట్ రూ. 395 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయము రూ. 355 కోట్లు మరియు పెట్టుబడి (Capital) వ్యయము రూ. 40 కోట్లను ప్రతిపాదించాం.

**ఉద్యానశాఖ:**

ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యాన పంటల విస్తీర్ణం 39.78 లక్షల ఎకరాలు కాగా ఉత్పత్తి 246.98 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ మిరప, కోకో, నిమ్మ, ఆయిల్ పామ్, బొప్పాయి మరియు టమోటా ఉత్పత్తిలో ప్రధమ స్థానంలోను, జీడిమామిడి, మామిడి మరియు బత్తాయి ఉత్పత్తిలో ద్వితీయ స్థానంలోను ఉంది. 2016–17 నందు సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో నిలిచింది.

సాధారణంగా వ్యవసాయ పంటల కంటే ఉద్యాన పంటలలో రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అందువలన, గౌరవ ముఖ్యమంత్రి వర్యులు రాబోవు సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌ను హార్టికల్చర్ హబ్‌గా తీర్చి దిద్దాలనే సంకల్పంతో ఉన్నారు. దానికి అనుగుణంగా 40 లక్షల ఎకరాలుగా ఉన్న ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని కోటి ఎకరాలకు పెంచటానికి పంటవారీ కార్యాచరణ ప్రణాళికను ఉద్యానశాఖ తయారు చేయుచున్నది.

ప్రధాన మంత్రి కృషి శించాయి యోజన పథకం (PMKSY) క్రింద సూక్ష్మ సేద్య పథకాన్ని (MIP)పెద్ద ఎత్తున అమలు చేస్తూ, ఆంధ్రప్రదేశ్ దేశంలోని అగ్ర రాష్ట్రాలలో ఒకటిగా ఉంటూ 2017–18 సం॥లో 5,16,750 ఎకరాల లక్ష్యానికి గాను ఫిబ్రవరి–

2018 నాటికి 3,46,260 ఎకరాల్లో ఈ పథకాన్ని అమలు పరచింది. అంతేగాక, 2018-19 సం॥నికి గాను 6.25 లక్షల ఎకరాలను లక్ష్యంగా నిర్దేశించాం.

అధిక విలువ కలిగిన పూలు మరియు కూరగాయల ఉత్పత్తి కొరకు ప్రతీ సంవత్సరం 4.5 లక్షల చదరపు మీటర్లలో రక్షిత సేద్యం (పాలీహౌసెస్ & షేడ్ నెట్ హౌసెస్) చేపట్టటమేకాక, పందిళ్ల ద్వారా తీగజాతి కూరగాయలు, ట్రెల్లీస్ ద్వారా టమాట, మల్చింగ్ ద్వారా కూరగాయల సాగు వంటి నూతన పద్ధతులతో ఉత్పత్తిని 30 శాతం, అలాగే రైతుల యొక్క నికర ఆదాయాన్ని 35 శాతం పెంచగలిగాం.

కోత అనంతర నష్టాన్ని తగ్గించుటే గాకుండా పంట నాణ్యతను పెంచడానికి 45వేల టన్నుల సామర్థ్యం కలిగిన శీతల గిడ్డంగులు, 48 వేల టన్నుల ప్యాకింగ్ సామర్థ్యం కల్గిన ప్యాక్ హౌస్‌లు, 24 వేల టన్నుల సామర్థ్యం కలిగిన పండ్లు మాగబెట్టు గదులు మరియు 4200 టన్నుల సామర్థ్యం కలిగిన మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసాం.

కరువు నివారణ చర్యల్లో భాగంగా నీటిని నిల్వ చేసి అవసరమగు సమయాల్లో పండ్ల తోటలకు నీటి తడుల్ని అందించి తద్వారా తోటలను కాపాడుకొనుటయే గాక మంచి దిగుబడులను పొందుటకు 790 వ్యక్తిగత నీటి కుంటలు మరియు 16 సామాజిక నీటి కుంటలను ఏర్పాటు చేసాం.

రాష్ట్ర ప్రభుత్వం దేశీయ మరియు విదేశీ మార్కెట్ పెంపొందించుకొనడానికి కావల్సిన నాణ్యతా ప్రమాణాలను సాధించడానికి అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (APEDA) మరియు ఇతర కార్పొరేట్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం.

సేంద్రియ వ్యవసాయంలో భాగంగా కూరగాయలు, పసుపు, మామిడి పంటల నాణ్యతా ప్రమాణాలు పెంచటానికి మరియు సర్టిఫికేషన్ కొరకు ఉద్యానశాఖ, ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ (ICCOA) మరియు సిక్కిం మార్కెటింగ్ ఫెడరేషన్ (SIMFED) సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని 21,250 ఎకరాల్లో సేంద్రీయ సాగును చేపట్టాం.

రాష్ట్రంలో క్రొత్తగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు మంజూరు కావడంలో రాష్ట్ర ప్రభుత్వం కీలకపాత్ర పోషించింది. అందులో భాగంగా రీజనల్ రీసెర్చ్ స్టేషన్ ఆఫ్ ఫ్లోరికల్చర్- కడియం, సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ - సామర్లకోట, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ - విజయవాడ మరియు ఉద్యాన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 2 ప్రభుత్వ మరియు 4 ప్రైవేట్ హార్టికల్చర్ కళాశాలలను ఏర్పాటు చేసాం.

కృష్ణా జిల్లా గన్నవరం నందు 12 ఎకరాల్లో ఇండియన్ ఇన్సిట్యూట్ అఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (IIPM) సెంటర్ నెలకొల్పుటకు గాను రూ. 23.00 కోట్లు మంజూరు చేసి రాష్ట్ర వాటాగా రూ. 10.00 కోట్లను విడుదల చేసాం.

**ఆంధ్రప్రదేశ్ రైతు - ఉత్పత్తిదారుల సంఘ పాలసీ 2016** ద్వారా రైతులు తమ సంఘం యొక్క కార్యక్రమాలను స్వంతంగా నిర్వహించుకొనుటకు అవకాశం కల్పించాం. రాబోవు మూడు సంవత్సరాలలో 1000 కి పైగా రైతు-ఉత్పిత్తిదారుల సంఘాల (FPO) ఏర్పాటుకు కృషి జరుగుతుంది. దీనిలో భాగంగా 10 లక్షల రైతులను రైతు-ఉత్పత్తిదారుల సంఘాలలో భాగస్వాములుగా చేయుటకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఉద్యాన శాఖ ద్వారా నేటికి 100 FPO లను ఏర్పాటు చేసాం.

ఉద్యానశాఖ, కార్పొరేట్ కంపెనీలు మరియు రైతు- ఉత్పత్తిదారుల సంఘాల భాగస్వామ్యంతో PPP-IHD (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్- ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్) అమలు చేస్తూ ఉత్పత్తి మరియు నాణ్యతా ప్రమాణాలు పెంచడానికి అలాగే ప్రత్యేక మార్కెట్ సౌకర్యాల కల్పన కోసం కృషి చేస్తోంది. ప్రస్తుతం రూ. 385.55 కోట్ల ప్రాజెక్ట్ విలువతో కూడిన 19 PPP-IHD ప్రతిపాదనలు అమల్లో ఉన్నాయి.

ప్రాథమిక రంగ మిషన్ (రైతుకోసం) ద్వారా రెండంకెల వృద్ధి రేటు సాధించటంలో ఒక ముఖ్యమైన వృద్ధి యంత్రం (Growth Engine)గా ఉద్యానశాఖను గుర్తించి తగిన ప్రాముఖ్యతను కల్పిస్తున్నాం.

**అధ్యక్షా!**

2018-19 సం॥నికి గాను **రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక పథకం** (SDP) **క్రింద** రూ. 102 కోట్లు ప్రతిపాదించడం ద్వారా పంట విస్తరణ, రక్షిత సేద్యం, మల్టీ క్రాపింగ్ సిస్టమ్, ఉద్యాన యాంత్రీకరణ, నీటి కుంటలు, సమగ్ర కోత అనంతర యాజమాన్యం మొదలగు నూతన సాంకేతిక పద్ధతుల్ని ప్రోత్సహిస్తున్నాం.

అదే విధంగా కేంద్ర ప్రాయోజిత రాష్ట్ర పథకమైన **సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకం** (MIDH) ద్వారా ఉద్యాన పంటల సమగ్ర అభివృద్ధికి రూ. 149.19 కోట్లు మా ప్రభుత్వం ప్రతిపాదించింది.

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు పరుస్తున్న సూక్ష్మ సేద్య పథకానికి (MIP)ప్రధాన మంత్రి కృషి శించాయి యోజన (PMKSY) ద్వారా 2017-18ఆర్థిక సం॥లో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 425 కోట్లు (60%) మంజూరు కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ. 282.36 కోట్లు (40%) మంజూరు చేస్తూ అదనపు సబ్సిడీని రైతులకు అందించుట కోసం మరో రూ. 462.73 కోట్లు అనగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ. 745.09 కోట్లు మంజూరు చేసాం. 2018-19 సంవత్సరంలో పెద్ద ఎత్తున బిందు మరియు తుంపర సేద్య పరికరాలను రైతులకు అందించుటకు రూ. 1152 కోట్లను ప్రతిపాదించాం.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (RKVY) ద్వారా కూరగాయల ఉత్పత్తి, నాణ్యత పెంచుటకు పందిళ్లు, ట్రెల్లీస్, సంకర జాతి కూరగాయ విత్తనాల సరఫరా, ప్లాస్టిక్ క్రేట్లు వంటి వాటిని రైతులకు రాయితీపై అందజేస్తున్నాం. అంతేకాకుండా పండ్ల తోటల విస్తరణ మరియు రైతు- ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటును కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాం.

నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్ సీడ్ మరియు ఆయిల్ పామ్ మినీ మిషన్-II (NMOOP) ద్వారా పామాయిల్ తోటల సాగు ప్రోత్సహించుటకుగాను రూ. 61.01 కోట్లను ప్రతిపాదించాం.

ఉద్యానశాఖకు 2018-19లో రెవెన్యూ వ్యయం రూ. 1517.88 కోట్లను ప్రతిపాదించాం.

**ఉద్యాన విశ్వవిద్యాలయం:**

ఉద్యాన విశ్వవిద్యాలయ లక్ష్యాలుగా విద్య ద్వారా మానవ వనరుల అభివృద్ధి, అవసరాలకు తగిన పరిశోధనలు నిర్వహించడం మరియు పరిశోధనా సాంకేతికతను విస్తరణ ద్వారా రైతులకు అందచేయడం ప్రధానంగా ఉన్నాయి. విశ్వవిద్యాలయ పరిధిలో 4 ప్రభుత్వ మరియు 4 ప్రైవేటు ఉద్యాన కళాశాలలు, 17 పరిశోధనా కేంద్రాలు, 4 ప్రభుత్వ మరియు 5 ప్రైవేటు ఉద్యాన పాలిటెక్నిక్‌లు మరియు 4 కృషి విజ్ఞాన కేంద్రాలు కలవు.

ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ పరిశోధనా కేంద్రాల ద్వారా 14 ఉద్యాన పంటలకు చెందిన 23 రకాలను విడుదల చేసాం.

ఉద్యాన విశ్వవిద్యాలయానికి 2017-18 సంవత్సరానికి కొత్తగా ఒక ఉద్యాన కళాశాలను 50 మంది బి.యస్సీ (ఉద్యాన) హార్టికల్చర్ విద్యార్థులతో చినలాటరపి, గుడ్లూరు మండలం, కందుకూరు నియోజకవర్గం, ప్రకాశం జిల్లా నందు ప్రారంభించాం.

మూడు ప్రైవేటు ఉద్యాన కళాశాలలు విశ్వవిద్యాలయ పరిధిలో 2017-18 సంవత్సరానికి 60 మంది విద్యార్థుల చొప్పున బి.యస్సీ (ఉద్యాన) కోర్సు ప్రారంభించాం. ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలో టి.వెంకుపాలెం గ్రామం, అనకాపల్లి మండలం, విశాఖపట్నం జిల్లా నందు ఉద్యాన పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసాం.

ఉద్యాన పరిశోధనా కేంద్రం, చింతపల్లిలో నాబార్డ్-ఆర్.ఐ.డి.ఎఫ్. క్రింద ఏర్పాటు చేయబడిన విశిష్ఠ రక్షిత సాగు కేంద్రంలో ఆర్కిడ్ సాగు మరియు పరిశోధనల్ని ప్రారంభించాం.

రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం (ఆర్.కె.వి.వై.) క్రింద నాణ్యతా ప్రమాణాల పరీక్షా కేంద్రాన్ని గుంటూరు జిల్లాలోని ఉద్యాన పరిశోధనా కేంద్రం, లాం ఫాం నందు ప్రారంభించాం. విశ్వవిద్యాలయంలోని బి.యస్సీ హానర్స్ హార్టికల్చర్ డిగ్రీ కోర్సు ఆఖరి సంవత్సరం విద్యార్థులకు గ్రామీణ ఉద్యాన పంటల సాగులోని సమస్యలపై అనుభవం

కొరకు READY (Rural Entrepreneurship Awareness Development Yojana) కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాం.

జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రం ద్వారా 80 టన్నుల జీవన ఎరువులను రైతులకు అందించాం. వివిధ పండ్ల మొక్కల నాణ్యమైన అంట్లను మరియు కూరగాయలు, సుగంధద్రవ్యాల విత్తనాలను తయారుచేసి రైతులకు అందించాం.

ఐ.సి.ఏ.ఆర్. వారిచే ఉత్తమ సుగంధద్రవ్యాల అఖిల భారత సమన్వయ పరిశోధనా సంస్థలుగా ఉద్యాన పరిశోధనా కేంద్రం, లాం, గుంటూరు మరియు ఉద్యాన పరిశోధనా స్థానం, చింతపల్లిలకు పురస్కారం లభించింది.

నేషనల్ అకడమిక్ డిపాజిటరీ (NAD) మరియు అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ASCI) లతో ఉద్యాన విశ్వవిద్యాలయం అవగాహనా ఒప్పందాన్ని (MoU) కుదుర్చుకుంది.

2018-19లో మొత్తము బడ్జెట్ రూ.96.22 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.56.22 కోట్లు మరియు పెట్టుబడి (Capital) వ్యయం రూ.40 కోట్లను ప్రతిపాదించాం.

**పట్టుపరిశ్రమశాఖ:**

పట్టుపరిశ్రమ ఒక వ్యవసాయాధారిత వాణిజ్యపంట. ముఖ్యంగా మహిళలకు ఉపాధి కల్పిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉంది. పట్టుపరిశ్రమ రైతులకు సాలీనా ఎకరానికి దాదాపు రూ.1,25,000/- నికర ఆదాయాన్ని కల్పిస్తుంది.

2016-17సం॥ నాటికి ఉన్న 82,889 ఎకరాల మల్బరీ తోటలకు అదనంగా 2017-18 సంవత్సరంలో 9,079 ఎకరాల్లో మల్బరీ తోటలు నాటుట ద్వారా మల్బరీ విస్తీర్ణాన్ని 91,968 ఎకరాలకు పెంచాం.

2017–18 సంవత్సరంలో 6389 మెట్రిక్ టన్నుల బైవోల్టైన్ పట్టు గూళ్ళను 28.58% పెరుగుదల రేటుతో (2016–17 సం॥పై) ఉత్పత్తి చేసాం. 1022 మెట్రిక్ టన్నుల బైవోల్టైన్ పట్టుదారాన్ని 31.19% పెరుగుదల రేటుతో ఉత్పత్తి చేసాం.

పట్టు నేత కార్మికులకు పట్టుదారంపై నెలకు రూ. 1000/- చొప్పున ఇస్తున్న రాయితీ పథకం అమలుకై రూ. 42.08 కోట్లను మంజూరు చేసి, తద్వారా 35000 పట్టు నేత కార్మికుల కుటుంబాలకు చేయూత నిచ్చాం.

2017–18 సం॥లో రాష్ట్ర అభివృద్ధి పథకం క్రింద రూ. 204.78 కోట్ల నిధులు విడుదల కాగా, జనవరి నాటికి రూ. 140.22 కోట్లు వివిధ పథకాల అమలు కోసం ఖర్చు చేసాం.

2018–19 సంవత్సరానికి గాను రాష్ట్ర అభివృద్ధి పథకం క్రింద రూ. 175.12 కోట్లను ప్రతిపాదించాం. ఇందులో రూ. 74.976 కోట్లు పట్టు పరిశ్రమశాఖ ద్వారా అమలవుతున్న వివిధ రైతు సంక్షేమ పథకాలకై ప్రతిపాదించాం.

ఈ విధంగా ప్రతిపాదించిన బడ్జెట్‌లో షెడ్యూల్డ్ కులముల మరియు షెడ్యూల్డ్ తెగల రైతులకు పట్టుపరిశ్రమ ద్వారా జీవనోపాధి పెంచడం కోసం 90% రాయితీతో షెడ్యూల్డ్ కులముల కొరకు రూ. 2.00 కోట్లు మరియు షెడ్యూల్డ్ తెగల కొరకు రూ. 5.00 కోట్లను కేటాయించాం.

2018–19లో మొత్తము బడ్జెట్ రూ. 175.12 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ. 175.108 కోట్లు మరియు పెట్టుబడి (Capital) వ్యయం రూ. 0.0125 కోట్లను ప్రతిపాదించాం.

**పశు సంవర్థకశాఖ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అపారమైన పశు సంపదకు ఆలవాలం కనుక తదనుగుణమైన బడ్జెట్ కేటాయింపులు సైతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పశుసంవర్థక రంగం అందుకొంటుంది.

ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఒంగోలు మరియు పుంగనూరు గోజాతులు, శ్రేష్ఠమైన నెల్లూరు జోడిపి జాతి గొర్రెలు, ఆశిల్ జాతి కోళ్ళు సైతం మన రాష్ట్రంలో ఉండడం మనకు గర్వకారణం. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం స్థిరమైన ఆదాయ వనరుగా – సుస్థిర సూచికగా, ఈ రంగంపై ఆధారపడిన వారికి జీవనాధారంగా, వారికి బ్రతుకు తెరువు నిస్తున్న పశు సంవర్ధక రంగానికి మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న విషయాన్ని గౌరవ సభకు తెలియజేయడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను.

దేశ స్థాయిలో గొర్రెలు మరియు మేకలు సంఖ్యలో మొదటి స్థానం, కోళ్ళ సంఖ్యలో మూడవ స్థానం గేదెల సంఖ్యలో 5వ స్థానం ఉంటూ, రమారమి 20 లక్షలకు పైగా కుటుంబాలు ఈ రంగంలో జీవనోపాధి పొందుచున్నవి.

2016-17 సంవత్సరంలో పశుగణ ఉత్పత్తుల విలువ రూ.59,796 కోట్ల రూపాయలుగా, రాష్ట్ర ఆర్థిక విలువలో 9.32% గా అంచనా వేసాం. రమారమి 1583 కోట్లు గుడ్ల ఉత్పత్తితో దేశంలో 5వ వంతు రాష్ట్రంలో ఉత్పత్తి చేస్తూ, సుమారు 6.32 లక్షల మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తితో దేశంలో4వ స్థానంలోను, 121.77 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తిలో దేశంలో 5వ స్థానంలోను ఉండి, 2022 సంవత్సరానికి దేశంలో పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తిలో మొదటి మూడు స్థానాలలో ఉండడానికి లక్ష్యంగా పెట్టుకొని ముందుకు వెళ్ళుతున్నాం.

రాష్ట్రంలో పశుగ్రాస భద్రత సాధించే దిశలో పశుగ్రాస ఉత్పత్తి మరియు నిల్వ చేసే క్రమంలో 'ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం'లో ఏడాది పొడవున సరసమైన ధరలకు నాణ్యమైన గడ్డిని రైతులకు అందుబాటులో ఉంచే లక్ష్యంతో అనేక చర్యలు చేపడుతున్నాం.

తద్వారా గ్రామీణ పాడి ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు, ఔత్సాహికులను ఈ రంగం వైపు ఆకర్షించేందుకు కృషిచేస్తున్నాం.

2018-19 ఆర్థిక సంవత్సరానికి ఉత్పాదకతను వృద్ధిచేయుట, సంపూర్ణమైన విలువజోడింపు మౌలిక సదుపాయాలు, పశు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పన మరియు పశుగ్రాస వనరులందుబాటులోకి తీసుకొని రావటానికి చర్యలు తీసుకొంటున్నాం.

అలాగే రూ.393.31 కోట్లను సాధారణ రాష్ట్ర ప్రణాళిక పద్దు క్రింద రూ.20.00 కోట్లు గ్రామీణ మౌళిక సదుపాయల అభివృద్ధి నిధి (RIDF) పద్దులోను, రూ.68.93 కోట్లను కేంద్ర ప్రభుత్వ సహాయ ప్రణాళిక పద్దు క్రింద, మొత్తం రూ.482.04 కోట్లు పశుసంవర్ధక రంగం అభివృద్ధి కోసం 2018–19 సం॥లో రాష్ట్ర ప్రణాళిక పద్దును పొందుపరిచాం.

పశుగణ సేవలు అదించడంలో గ్రామీణ మౌళిక సదుపాయాల అభివృద్ధి నిధి (RIDF) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన పరికరాలతో పశు వైద్యశాలల నిర్మాణాలు చేపడుతున్నాం. ఈ పథకం కోసం రూ.20.00 కోట్లను ప్రతిపాదించాం.

2018–19 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర సహాయ ప్రణాళిక పథకంలో భాగంగా (CASP) జాతీయ పశుగణ ఆరోగ్య మరియు వ్యాధి నివారణ పథకం, జాతీయ పశుగణ యాజమాన్య పథకం, జాతీయ పశుగణ ప్రత్యుత్పత్తి మరియు పాడి పరిశ్రమ అభివృద్ధి పథకం అమలు కోసం రూ.68.93 కోట్లను ప్రతిపాదించాం.

పశుగ్రాస కొరతను అధిగమించటమే లక్ష్యంగా ప్రభుత్వం "మెగా పశుగ్రాస క్షేత్రాలు" అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఔత్సాహికుల సేవలను ఉపయోగించుకొని స్థానికంగా గ్రామాల్లో గడ్డిని పండించి అవసరాలకు పోను మిగిలిన పశుగ్రాసాన్ని "సైలేజి బేళ్ళ" రూపంలోకి మార్చి పశుగ్రాస కొరత ఉన్న ప్రాంతాలకు సరఫరా చేసి, ఎండాకాలంలో కూడా పశుగ్రాస కొరతను తీర్చుటకై తగిన చర్యలు తీసుకుంటున్నాం.

పశుగ్రాస లభ్యత సమస్యను అధిగమించడానికి 10 లక్షల క్వింటాళ్ళు మాగుడు గడ్డి మరియు 5 లక్షల క్వింటాళ్ళ సంపూర్ణ దాణా మిశ్రమాన్ని రాష్ట్రంలో అందుబాటులో ఉంచేందుకు నిర్ణయించాం.

రాష్ట్రంలో ఇన్విట్రో ఫెర్టిలైజేషన్ ద్వారా మేలుజాతి పశు సంతతిని వేగవంతంగా అభివృద్ధి పరచడానికి పశుసంవర్ధక శాఖ జె.కె. ట్రస్ట్‌తో కలిసి ప్రణాళికను రూపొందించాం.

2018-19లో మొత్తం బడ్జెట్ రూ.1223.40 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.1121.04 కోట్లు మరియు పెట్టుబడి (Capital) వ్యయం రూ.102.37 కోట్లను ప్రతిపాదించాం.

## శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం :

ఈ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ప్రైవేట్ రంగంలో 2017-18లో కళాశాలలు ఈ క్రింది విధంగా క్రొత్తగా ఏర్పాటు చేయబడినవి.

1. డైరీ టెక్నాలజీ కళాశాల, పాటవోల, తూర్పుగోదావరి జిల్లా,

2. మత్స్య పాలిటెక్నిక్, పాటవోల, తూర్పుగోదావరి జిల్లా,

3. పాల ఉత్పత్తుల తయారీ పాలిటెక్నిక్, సంగంజాగర్లమూడి, గుంటూరు జిల్లా,

4. పశుసంవర్థక పాలిటెక్నిక్‌లు (1) కనుముల్ల, ప్రకాశం జిల్లా, (2) నరసరావుపేట గుంటూరు జిల్లా, (3) వక్కపట్లవారి పాలెం, నాగాయలంక, కృష్ణాజిల్లా.

ప్రభుత్వం రాపూరు పశుసంవర్థక పాలిటెక్నిక్ మరియు భావదేవరపల్లి కళాశాలలకు మౌలిక సదుపాయాల కొరకు బోధనేతర సిబ్బందిని మా ప్రభుత్వం మంజూరు చేసాం.

గరివిడి, విజయనగరం జిల్లా నందు నెలకొల్పబడనున్న క్రొత్త పశువైద్య కళాశాలకు మౌలిక సదుపాయాల కొరకు గ్రామీణ మౌలిక అభివృద్ధి పథకం జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు ద్వారా రూ.81.72 కోట్లను మంజూరు చేసి, భవనాల నిర్మాణాన్ని ప్రారంభించాం.

విశ్వవిద్యాలయంలో 905 విద్యార్థులు వివిధ కోర్సుల్లో 2017-18లో ప్రవేశం పొందినారు. ఇతర సంస్థల ద్వారా 10 పరిశోధనా ప్రాజెక్టులకు రూ.66.0 లక్షలు మరియు ఆర్.కె.వి.వై పథకం క్రింద 6 పరిశోధనా ప్రాజెక్టులకు గాను రూ.346.0 లక్షలు విడుదల చేసి రాష్ట్రంలో పశుగణ ఉత్పాదకతను పెంచుటకు పరిశోధనలు చేపట్టాం.

విశ్వవిద్యాలయం ఐవెబ్ టెక్నాలజీలో ఆటోమేషన్, జియోతో అంతర్జాల సదుపాయం కోసం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం మరియు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంతో బోధనా మరియు పరిశోధనా అంశాలపై అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

అత్యుత్తమ ప్రమాణాలతో ఐవిఎఫ్ పరిశోధనాశాల మరియు ఘనీకృత వీర్యపరిశోధనా శాల గుంటూరు పశుపరిశోధనా స్థానంలో ప్రారంభించాం.

వివిధ ప్రాంతాల్లో సహాయ పశువైద్యుల వసతి గృహాలు మరియు రైతు వసతి గృహాలను ప్రారంభించాం.

జంతువులకు మరియు మనుషులకు వచ్చు 'లెప్టోస్పైర వ్యాధి' నివారణకు ఒకే టీకాను ఉత్పత్తి చేయుటకు పరిశోధనలు జరుగుతున్నవి.

పశువిజ్ఞాన పంచాంగాన్ని మొదటిసారిగా ముద్రించాం.

రాష్ట్రంలో పశుగణ ఉత్పత్తి పెంచుట కోసం 1.5 లక్షల డోసుల ఒంగోలు జాతి వీర్యం, 600 పుంగనూరు జాతి వీర్యం, 400 విత్తనపు పొట్టేళ్ళు, 2000 సంకర జాతి పందులు, 70 మెట్రిక్ టన్నుల సంపూర్ణమేత, 5000 రాజశ్రీ కోళ్లు, సమారు 200 ఎకరాలకు సరిపడు వివిధ గడ్డి మొక్కల పిలకల్ని రైతులకు సరఫరా చేసాం.

రైతుల కోసం టోల్ ఫ్రీ నెంబరును ప్రారంభించాం.

2018-19లో మొత్తము బడ్జెట్ రూ. 130 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ. 100 కోట్లు మరియు పెట్టుబడి (Capital) వ్యయం రూ. 30 కోట్లను ప్రతిపాదించాం.

**మత్స్యశాఖ:**

మత్స్య మరియు ఆక్వా సాగులో విస్తారమైన వనరులు మరియు సామర్థ్యంతో నిరంతరం రాష్ట్రం రెండంకెల వృద్ధి రేటుని సాధిస్తున్నది. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొత్తం రొయ్యల మరియు చేపల ఉత్పత్తి మరియు విలువలో మొదటి స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ మత్స్య రంగం ద్వారా 6.4 శాతం రాష్ట్ర దేశీయ స్థూల ఉత్పత్తి (GSDP) నిస్తూ 14.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుంది. 2016-17సం॥నకు మన దేశ సముద్ర మత్స్య

ఎగుమతుల విలువ రూ.37,871 కోట్లు కాగా మన రాష్ట్ర సముద్ర మత్స్య ఎగుమతుల విలువ సుమారు రూ.17,000 కోట్లు. అనగా దేశ ఎగుమతుల్లో రాష్ట్రం దాదాపు 45 శాతం వాటా కలిగి ఉంది.

2017-18సం॥నకు 33.84 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తి, స్థూల విలువ జోడింపు (GVA) రూ.42,110 కోట్లు (at constant prices) లక్ష్యంగా, మరియు ఉత్పత్తిపై 22.35 శాతం మరియు స్థూల విలువ జోడింపు (GVA) పై 35.65 శాతం వృద్ధి సాధించే లక్ష్యాన్ని నిర్దేశించాం. డిసెంబరు, 2017నాటికి చేపల మరియు రొయ్యల ఉత్పత్తిలో 27.49 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి స్థూల విలువ జోడింపు రూ.34,041.43 కోట్లు (at constant prices) సాధించాం.

ప్రభుత్వం, మీ-సేవా ద్వారా ఆక్వా సాగు క్రమబద్దీకరణకు విధానాలు సరళీకృతం, ఆక్వా చెరువుల పాండ్ ఆటోమేషన్, DKT భూములలో ఆక్వా సాగుకు అనుమతించుట, 181 క్లస్టర్‌లలో విస్తరించి ఉన్న 1,86,241 హెక్టార్లలో 92,701 ఆక్వా రైతులకు క్లస్టర్ విధానం మరియు ప్రాథమిక ఉత్పాదక స్థాయిలో ఉత్తమ యాజమాన్య పద్దతులపై నిరంతర శిక్షణ, రికార్డు కీపింగ్, యాంటీబయాటిక్ లేని ఉత్పాదకాలు వాడుట, వ్యాధి విశ్లేషణ ప్రయోగశాలలు స్థాపించడం ద్వారా వ్యాధి నిఘా అమలు చేయడం, అధిక ఉత్పాదకతను పెంచు సమర్థవంతమైన నర్సరీ మరియు గ్రో అవుట్ చెరువులు సాగు విధానం ప్రోత్సహించుట మరియు నూతన సుస్థిర, కొత్త సాంకేతిక పద్ధతులు ద్వారా చంద్రన్న ఆక్వా రైతు క్షేత్రాలు ద్వారా క్షేత్రస్థాయి ప్రదర్శన ద్వారా నిరంతరం మత్స్య రంగం అభివృద్ధికి దోహదపడుతున్నాయి.

**అధ్యక్షా!**

2017-18 సం॥నకు వివిధ మత్స్య అభివృద్ధి పథకాలకు రూ.210.94 కోట్లు మంజూరు చేయగా, డిసెంబర్,2017 నాటికి రూ.161.31 కోట్లు ఖర్చు చేసాం. మా ప్రభుత్వం, మత్స్య విధానం - 2015 ద్వారా చేపలు మరియు రొయ్యల ప్రాసెసింగ్ రంగానికి మా ప్రభుత్వం వివిధ ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పిస్తున్నది.

సముద్ర రంగంలో సముద్ర నాచు (Sea- weed) పెంపకం, సముద్ర జలాలలో పంజరాలు పెట్టి చేపల పెంపకం (Cage Culture), సముద్ర లోతు జలాల్లో చేపల వేట (Deep Sea Fishing), ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ లాండింగ్ సెంటర్లు, నాణ్యమైన చేప పిల్లల అందుబాటు కొరకు ఆక్వా రైతులకు క్వారంటైన్ వసతులు, తల్లి చేపల పెంపక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రత్యామ్నాయ జాతులైన, మండ పీత మరియు పండుగొప్ప హాచెరీల స్థాపన, కాలువలు మరియు డ్రైన్ల పూడిక తీయుట, ఆక్వా సాగు ప్రాంతం వరకు విద్యుత్ లైన్లు మరియు రోడ్లు కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

ఇట్టి ఉత్తమ యాజమాన్య పద్ధతులు మరియు విధానాలు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ ఆక్వాహబ్‌గా మార్చుటకు మా ప్రభుత్వం కృషి చేస్తున్నది.

2018-19లో మొత్తం బడ్జెట్ రూ.386 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం రూ.366 కోట్లు మరియు పెట్టుబడి (Capital) వ్యయం రూ.20 కోట్లను ప్రతిపాదించాం.

## వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ:

రైతులు మార్కెట్ యార్డుకు తెచ్చిన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు మరియు విక్రయాల క్రమబద్ధీకరణ మరియు, రైతుల వారి ఉత్పత్తులను లాభదాయకంగా ఉండే ధరకు విక్రయించునట్లుగా చేయటమే వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ యొక్క ఉద్దేశ్యం.

మన రాష్ట్రంలో 191 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ మార్కెట్ కమిటీల ద్వారా 324 మార్కెట్ యార్డుల నిర్వహణ జరుగుతుంది. వీటిలో ధాన్యాలు, పప్పులు మరియు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్లు 10, పండ్ల మార్కెట్లు 21, కూరగాయల మార్కెట్లు 25, పశు మార్కెట్లు 33 మరియు ప్రత్తి కొనుగోలు కేంద్రాలు 43 కలవు.

ఈ శాఖలో 96 రైతు బజార్ల ద్వారా రైతులు పండించిన కూరగాయల్ని నేరుగా వినియోగదారులకు దళారీలు లేకుండా సరసమైన ధరలకు అందజేస్తున్నాం. అంతేగాక, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 56 రైతు బజార్లను క్రొత్తగా మంజూరు చేసాం.

ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల నందు 9,11,666 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల 1038 గోదాములు కలవు.

క్రొత్తగా రూ. 54.6 కోట్లతో 47 గోదాములు 91,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మాణంలో ఉన్నవి. రూ. 65 కోట్లతో 52,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 13 కోల్డ్ స్టోరేజీలను 13 మార్కెట్ కమిటీల్లో నిర్మిస్తున్నాం.

వ్యవసాయ మార్కెట్ యార్డ్ల నందు (22) ఈ-నామ్, మార్కెట్ల ద్వారా ఇప్పటివరకు రూ. 2954.97 కోట్లు విలువగల లావాదేవీలు జరిగినవి. క్రొత్తగా 47 మార్కెట్ కమిటీల్లో ఈ-నామ్ పథకాన్ని ప్రవేశపెట్టుటకు ప్రయత్నం జరుగుతుంది. ఈ సంవత్సరంలో అన్ని ఈ-నామ్ మార్కెట్లలో నాణ్యతను నిర్ధారించే ప్రయోగశాలలు త్వరితగతిని ప్రారంభించుటకు చర్యలు తీసుకున్నాం.

14 వ్యవసాయ మార్కెట్లను మరియు 89 రైతు బజార్లను ఈ సంవత్సరం నందు ఆధునీకరణ చేయుచున్నాం.

రైతులు మార్కెట్ కమిటీ గోదాముల్లో నిల్వ ఉంచిన సరుకునకు **"రైతుబంధు"** పథకం ద్వారా 75 శాతం విలువ లేదా గరిష్ఠంగా రెండు లక్షల రూపాయల వరకు ఋణం, 180 రోజుల వరకు వడ్డీ లేకుండా ఇచ్చే పథకాన్ని అమలు చేస్తున్నాం. 2017-18 సంవత్సరంలో ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 3637 రైతులు రూ. 43.39 కోట్లు ఋణాన్ని లబ్ధి పొందారు.

2018-19లో రెవెన్యూ వ్యయం రూ. 11.83 కోట్లను ప్రతిపాదించాం.

## సహకార రంగం:

వ్యవసాయ మరియు అనుబంధ రంగాల అభివృద్ధికి సహకార రంగం చాలా కీలకమైన పాత్ర పోషిస్తుంది.

ఆప్కాబ్ 2017-18 సం॥నికి గాను రూ. 6,861.96 కోట్లు స్వల్పకాలిక ఋణాల క్రింద మరియు రూ. 608.43 కోట్లు దీర్ఘకాలిక వ్యవసాయ ఋణాల క్రింద 15,76,259 మంది రైతులకు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘములు మరియు జిల్లా సహకార బ్యాంకుల ద్వారా పంపిణీ చేసాం.

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లా సహకార బ్యాంకులు 18-12-2017 వరకు రూ.391.36 కోట్ల ఆర్థిక సహాయంగా 98,278 మంది కౌలు రైతులకు పంపిణీ చేసాం.

**వ్యవసాయ పరపతి:**

2014-15 సం॥లో ఉన్న వడ్డీ రాయితీ, వడ్డీ సబ్సిడీ బకాయిలను చెల్లించడం కోసం రూ. 57.00 కోట్లను 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించాం. దీనివలన, వడ్డీ రాయితీ ద్వారా 84,712 మంది రైతులు వడ్డీ సబ్సిడీ ద్వారా, 13,45,207 మంది రైతులకు లబ్ది కలుగుతుంది.

**ప్రాథమిక పరపతి సహకార సంఘముల (PACS) ద్వారా రైతులకు వివిధ సేవలు:**

ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందజేయడమే గాక రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సన్న, చిన్నకారు రైతులకు మద్ధతు ధర కల్పించి రైతు సమగ్ర అభివృద్ధి కొరకు సహకార సంఘములు కృషి చేయుచున్నాయి.

సహకార శాఖకు మొత్తం రెవెన్యూ వ్యయం క్రింద రూ.208.11కోట్లను బడ్జెట్ 2018-19లో ప్రతిపాదించాం.

**విద్యుత్ శాఖ:**

మా ప్రభుత్వం వ్యవసాయానికి నాణ్యత కల్గిన నమ్మకమైన 7 గంటల విద్యుత్తు సరఫరా ఉచితంగా ఇచ్చుటకు కృత నిశ్చయంతో ఉంది. రాష్ట్రంలో మొత్తం 16.97 లక్షల (డిసెంబరు,2017) వ్యవసాయ సర్వీసు కనెక్షన్లు ఉన్నాయి.

రాష్ట్రంలోని 7 జిల్లాల్లో 46,727 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లు ఏర్పాటు చేయుటకు ఎ.పి. హై వోల్టేజి పంపిణి వ్యవస్థ (APHVDS) పథకాన్ని రూ.295 కోట్ల వ్యయంతో చేపట్టాం. ఈ పథకానికి JICA రూ.252.80 కోట్ల ఋణ రూపంలో సహాయం మంజూరు చేసింది. డిసెంబరు,2017 వరకు 49,319 వ్యవసాయ సర్వీసు కనెక్షన్ల కోసం రూ.297.69 కోట్లను ఖర్చు చేసాం.

మా ప్రభుత్వం, భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిసియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ (EESL) సహాయంతో AGDSM పథకంలో 1 లక్ష ISI మార్కులేని పంపుసెట్లను సామర్థ్యం గల (Five Star Rating) ISI మార్కు కలిగిన పంపుసెట్లతో మార్పు చేయుటకు చర్యలు చేపట్టింది. డిసెంబరు, 2017 వరకు 6969 పంపుసెట్లను మార్పు చేసాం.

విద్యుత్‌శాఖకు మొత్తం రెవెన్యూ వ్యయం క్రింద **రూ.2500 కోట్లను** 2018-19లో ప్రతిపాదించాం.

## నెడ్‌క్యాప్ (NREDCAP):

మా ప్రభుత్వం సౌర శక్తితో నడిచే పంపుల కార్యక్రమాన్ని ప్రభుత్వ సంస్థ అయిన సాంప్రదాయేతర (నూతన మరియు పునరుద్ధరణీయ) ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (నెడ్‌క్యాప్) ద్వారా భారీగా చేపట్టాం.

ఇందులో భాగంగా 3 హెచ్‌పి (3000 వాట్) మరియు 5 హెచ్‌పి (5000 వాట్) సామర్థ్యం గల పంపులను నిర్మిస్తున్నాం. సోలార్ పంప్ సెట్ ఖరీదులో 60% రాయితీ రాష్ట్ర ప్రభుత్వం, 30% రాయితీని కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తున్నాయి. మిగిలిన 10% లబ్ధిదారుడు భరించవలసి ఉంటుంది.

సౌర శక్తి పంపులు పగటి పూట పనిచేయడం వలన వ్యవసాయదారుడు రాత్రి పూట పొలమునకు వెళ్ళవలసిన అవసరం ఉండదు. ఈ సౌర శక్తి పంపులను విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లో నిర్మించడం వలన వ్యవసాయదారులకు ఎంతో ఉపయోగకరం.

ఇంత వరకు మా ప్రభుత్వం 25,000 పంప్ సెట్లను ముఖ్యంగా చిన్న, సన్నకారు, షెడ్యూల్ కులాల / జాతుల వారికి మరియు **"ఎన్.టి.ఆర్ జలసిరి"** కార్యక్రమం క్రింద (8725 పంపులను) రూ.400 కోట్ల ఖర్చుతో నిర్మించాం.

మా ప్రభుత్వం, 1,00,000 పంప్ సెట్లను 2018-19 సంవత్సరంలో లక్ష్యంగా రూ. 1800 కోట్ల రాయితీతో నిర్మించుటకు ప్రణాళికలను తయారు చేసాం.

## వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం:

చిన్న, సన్నకారు రైతుల భూముల్లో భూమి అభివృద్ధి ఉత్పాదకత, జీవనోపాదులను పెంపొందించే లక్ష్యంతో వివిధ రకాల పనులను చేపట్టడానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టం అవకాశం కల్పించింది. బంజరు, వ్యవసాయ యోగ్యం కాని భూముల్లో అభివృద్ధి పనులు, పండ్ల తోటలు, పొలం గట్లపై మొక్కలు, గడ్డి పెంపకం వంటి పనుల్ని మన రాష్ట్రంలో విస్తృతంగా చేపడుతున్నాం. అంతేకాకుండా భూగర్భ జలాల పెంపుదలకు, సాగునీటి కల్పనకు, భూసార పరిరక్షణ, నీటి సంరక్షణ, చెరువులు, కుంటలలో, కాలువలలో మరియు పంట కాలవల్లో పూడిక తీత పనులు వంటివి కూడా విస్తృతంగా చేపడుతున్నాం.

ఉపాధి హామి చట్టంలో షెడ్యూలు –1కి సవరణలను అనుసరించి వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు నేరుగా లబ్ది చేకూర్చే విధంగా జిల్లాల్లో చేపట్టే పనులలో కనీసం 60శాతము విలువలు గల పనులు భూమి అభివృద్ధి, జల సంరక్షణ, వ్యవసాయంలో ఉత్పాదకత పెంచే పనులు మరియు అటవీ సంరక్షణ పనులపై తప్పనిసరిగా ఖర్చు చేయాలని నిర్దేశించారు.

ఈ అంశాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, రైతుకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి సుస్థిర ఆదాయాన్ని కల్పించేందుకు గాను వ్యవసాయ తదితర శాఖల్లో అందుబాటులో ఉన్న నిధులకు ఉపాధి హామి నిధులతో జోడించి వివిధ కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది.

రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులను వర్షాభావ, కరువు పరిస్థితుల నుంచి కాపాడటానికి అమలుచేస్తున్న నీరు– చెట్టు, నీరు ప్రగతి, వనం–మనం మరియు ఇతర కార్యక్రమాలతో పాటుగా 'పంట సంజీవని' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. పంట సంజీవిని ద్వారా దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితులు, అతితక్కువ వర్షపాత పరిస్థితులలో పంటలు కాపాడుకోవచ్చు.

అలాగే రైతుల భూముల్లో నుంచి వృధాగా పోతున్న వాన నీటిని ఒడిసి పట్టి, భూమిలోనికి ఇంకింప చేసి భూగర్భ జలాలు పెంపుదలను కూడా పంట సంజీవని ద్వారా సాధిస్తున్నాం. పంట సంజీవని అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2.67 లక్షల పంట సంజీవనుల నిర్మాణం చేపట్టాం.

**అధ్యక్షా!**

2018–19 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం క్రింద రూ.3980 కోట్లను వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఖర్చు చేయటానికి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాం. 2017–18 సంవత్సరంలో నిర్ధేశించుకున్న ప్రణాళికలో రూ.2722 కోట్లను వ్యవసాయ అనుబంధ రంగాలకు ఖర్చు చేశాం.

గ్రామీణాభివృద్ధికి ఉద్దేశించిన 10 స్టార్ల కార్యక్రమంలో ముఖ్యమైంది 8వ స్టార్. ప్రతీ కుటుంబానికి రూ. 10,000/- ఆదాయం సమకూర్చే ప్రక్రియలో వ్యవసాయశాఖ, ఉపాధి పథకం ద్వారా 65% కుటుంబాలకు ఈ క్రింది విధంగా సహాయపడుతుంది.

1. భూమిని అభివృద్ధి పనులు చేపట్టడం.
2. భూమిని సారవంతం చేయడం (సిల్ట్ అప్లికేషన్)
3. భూగర్భ జలాలను పెంచి పంటను కాపాడడం,
4. సేంద్రియ ఎరువులను ప్రోత్సహించడం,
5. పంట మార్పిడి విధానంలో భాగంగా పండ్ల తోటల పెంపకాన్ని విస్తరింప జేయడం.
6. పంట నిల్వకు, గ్రేడింగ్‌కు అవసరమైన గ్రామీణ గిడ్డంగుల నిర్మాణం,
7. వ్యవసాయ క్షేత్రాలకు రహదారి సౌకర్యం కల్పన,
8. వాటర్ షెడ్, నీరాంచల్ ప్రాజెక్ట్ కింద ప్రత్యేక చర్యల ద్వారా అధికంగా నీటిని వినియోగించిన గ్రామాలలో భూగర్భ జలాలను పెంపొందించడం.

MGNREGA క్రింద వ్యవసాయ అనుబంధ రంగాలకు 2018–19లో రెవెన్యూ వ్యయం రూ.4730 కోట్లను ప్రతిపాదించాం.

**రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మరియు అనుబంధ శాఖల బడ్జెట్ 2018–19 సంవత్సరానికి గాను మొత్తం రూ. 19070.36 కోట్లను ప్రతిపాదించాం. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.18602.98 కోట్లు మరియు రూ. 467.38 కోట్లు పెట్టుబడి వ్యయాన్ని ప్రతిపాదించాం.**

**ఆకుపచ్చని లోకంలోకి ఆశల లోగిళ్ళలోకి...**
**మంచికాలం మళ్ళీ వచ్చింది...**
**చంద్రన్న మనస్సంతా ఆకుపచ్చని అమరావతి కోసమే...**
**రైతును ప్రపంచ పటాన గర్వంగా నిలబెట్టడమే...**
**చంద్రన్న ఆశయం**
**ఇదే మా ప్రభుత్వ ధ్యేయం.**

❖ ❖ ❖

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.**